దావీదు

ఈశ్వర స్తుతిగీతాలు

వాడ్రేవు చినవీరభద్రుడు

దావీదు

ఈశ్వర స్తుతిగీతాలు

వాడ్రేవు చినవీరభద్రుడు

ESWARA STUTI GITALU
(SELECTED PSALMS FROM OLD TESTAMENT)

Selected and translated by
VADREVU CHINAVEERABHADRUDU

October, 2024

Cover painting in watercolor
Vadrevu Chinaveerabhadrudu

David image as a sheperd boy
Unknown artist, courtesy: wikimedia commons

e-book released by

VADREVU CHINAVEERABHADRUDU
First floor, House No. 56, Navodaya colony,
Mehidipatnam, Hyderabad-500 028
chinaveera@gmail.com
9490957129

for more resources please visit

www.chinaveerabhadrudu.in

నా తొలి ఉపాధ్యాయిని

వజ్రమ్మ పంతులమ్మగారి స్మృతికి

ఆగమగీతాలు

ధనుర్మాసపు ప్రత్యూషం. కిందన ఎవరో అప్పుడే ప్రభాతసంకీర్తన మొదలుపెట్టారు. ఒక్కసారిగా మెలకువ వచ్చింది. మనిషి తనని తాను మేల్కొల్పుకోడానికి ఎన్ని దారులు! ఎన్ని గీతాలు! ప్రతి ఒక్క గీతమూ నిన్ను నీకు సన్నిహితుణ్ణి చేసేదే. తప్పిపోయిన నిన్ను నీకు తిరిగి తీసుకొచ్చి ఇచ్చేదే.

అందుకనే నేనిష్టపడే కవుల్లో శైవులున్నారు, వైష్ణవులున్నారు, శాక్తులున్నారు, బౌద్ధులున్నారు, జైనులున్నారు. నా చిన్నప్పుడు తాడికొండలో సాయంకాల ప్రార్థనా సమావేశాల్లో మా సహాధ్యాయి వెంకటరత్నం 'నడిపించు నా నావా, నడిసాంద్రమున దేవా' అని ఎలుగెత్తి పాడిన క్రైస్తవకీర్తన నేను జీవించినంతకాలం నా ఎదలో మార్మోగుతూనే ఉంటుంది. ఆ స్కూల్లోనే అదే సమావేశాల్లో, అర్థం తెలియకపోయినా, అది 'సురా అల్ ఫాతిహా' అని తెలియకపోయినా ప్రతి సాయంకాలం నేను నా తోటిపిల్లలందరితో చదివించిన ఖురాన్ లోని మొదటి సురాని నా చిన్నప్పుడే దేవుడు విని ఉన్నాడన్న నమ్మకం నన్నెప్పటికీ వదలదు.

'నిన్ను ఇంటర్వ్యూ చేస్తూ మృణాళిని నీకు ఇష్టమైన కవిత్వం ఏదని అడిగినప్పుడు నువ్వు భక్తికవిత్వమని చెప్పగానే నాకు చాలా ఆశ్చర్యంగానూ, సంతోషంగానూ అనిపించింది' అంది మా అక్క. 'ప్రపంచమంతా కవిత్వవీథుల్లో తిరిగి తిరిగి చివరికి మళ్ళా భక్తికవిత్వం దగ్గరకే చేరడం గొప్పగా కూడా అనిపించింది' అని కూడా అంది.

ఏది భక్తి కవిత్వం కాదు? రాజమండ్రిలో కవిత్వం గురించి మాట్లాడుకునే రోజుల్లో నా మిత్రుడు గోపీచంద్ తనకి గీతాంజలి అంటే చాలా ఇష్టమని చెప్తూ, అక్కడ కవి సర్వేశ్వరుణ్ణి సంబోధించిన ప్రతి తావులోనూ తాను 'జీవితం' అని అనుకుని చదువు కుంటానని చెప్పాడు. చరాచరాల్ని ప్రేమిస్తూ మనిషి పలికిన ప్రతి మాటా భక్తికవిత్వమే కదా.

భక్తి కవిత్వం, సర్వేశ్వరసన్నిధికోసం తపించిన కవుల కవిత్వం, నిజంగానే నాకు ప్రాణదాయకం. ఆ కవితలు చదువుకున్నప్పుడు నాకు నిజంగా జీవించిన అనుభూతి కలుగుతుంది. ఆ కవిత్వాల్ని సమస్తభాషల్లోనూ చదువుకుంటూ ఉండటంకోసమే మరొక నూరేళ్ళు బతకాలనిపిస్తుంది. మరొక భాషలోని భక్తికవిత్వం చదివినప్పుడల్లా, దాన్ని మళ్ళా నా కోసం తెలుగు చేసుకుంటేనే దాన్ని నా గుండెనిండుగా ఆఘ్రాణించిన తృప్తి కలుగుతుంది.

అందుకనే ఆ మధ్య నేను చేసిన ఒక ప్రసంగంలో Pslams నుంచి ఒక గీతాన్ని ప్రస్తావించినప్పుడు మిర్యాలగూడ నుంచి ఫాదర్ అలెగ్జాండర్ ఫోన్ చేసారు. ఆ సామగీతాల్ని తెలుగు చెయ్యరాదా అనడిగారు. మీరు అడుగుతున్నారంటే దేవుడు అడుగుతున్నట్టే అన్నాను.

2

పాతనిబంధనలోని కీర్తనలు యూదులకీ, క్రైస్తవులకీ కూడా సమానంగా స్ఫూర్తి, ఆసరా, ఓదార్పు, స్వస్థత, ధన్యతలను అందిస్తూ వచ్చాయి. ఆ కీర్తనల గురించి మరింత తెలుసుకునేకొద్దీ, వాటిని మరింత శ్రద్ధగా అధ్యయనం చేసినకొద్దీ మరెన్నో విశేషాలు, మరెంతో ఉత్తేజం నాకు లభిస్తూ ఉన్నది.

సువార్తలు మొదటిసారి ఎప్పుడు చదివానో గుర్తులేదుగాని, అవి చదివినప్పుడల్లా మనసుకి కలిగే స్వస్థతతో పాటు, ఓదార్పుతో పాటు, ధైర్యంతో పాటు, ఒక ఘట్టం మాత్రం మనసుని కలచివేస్తూ ఉండేది. ఏసును శిలువవేసినప్పుడు, ఆ అపరాహ్ణవేళ ఆయన శిలువమీద నిలబడి, 'దేవా, దేవా నా చేతిని ఎందుకు విడిచావు' అని అన్నాడని చదివినప్పుడల్లా నా మనసుకి చెప్పలేని ఆవేదన కలిగేది. ఇదేమిటిది, జీవితకాలంపాటు సర్వేశ్వరుడి వార్తాహరుడిగా ఈ లోకంలో సంచరించిన ఏసు, తనని తాను దైవకుమారుడిగా సంభావించుకున్న ప్రవక్త, తన చిట్టచివరి క్షణాల్లో ఇంత విహ్వలంగా ఆక్రోశించాడేమిటి అనిపించేది. సువార్తలు మొత్తం ఏసు ఏ భగవత్సందేశాన్ని వినిపిస్తో వచ్చాడో, ఆ సందేశానికీ, ఆ అచంచలమైన ఆ విశ్వాసానికీ, ఈ చివరి మాటలకీ పొసగదని అనిపించేది.

కాని ఆ చివరి మాటలు ఏసువి కావనీ, 'ఏలీ ఏలీ లామా సబ్బాచేతానీ' అనే ఆ అరమాయిక్ పదాలు పాతనిబంధనలోని కీర్తనల్లో 22 వ కీర్తనలోని ప్రథమ పంక్తి అని తెలిసినప్పుడు నాకు గొప్ప కుతూహలం కలిగింది. ఆ కీర్తన మొత్తం చదివాను.

ఆ కీర్తనలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం 1 నుంచి 18 పంక్తులు ' దేవా

దేవా నా చేతిని ఎందుకు విడిచిపెట్టావు' నుంచి 'వాళ్ళు నా అంగీకోసం చీట్లు వేసుకుంటారు' దాకా ఒక భాగం. అది గీతకారుడు దేవుడు తనని నిస్సహాయంగా వదిలిపెట్టేసాడనీ, తన శత్రువులు తనని చుట్టుముట్టారనీ, తన దేహాంగాల్ని చీల్చేస్తున్నారనీ, అయినా దేవుడు తన మొర ఆలకించలేదనీ మొరపెట్టుకోవడం. ఆ గీతకారుడు దావీదే అనుకుంటే ఆయన ఈ భాగం రాయడం ద్వారా తనకి ఇరవై ఎనిమిది తరాల తర్వాత తన వంశంలో ప్రభవించబోయే ఏసు అనుభవించబోయే శారీరిక చిత్రహింసను ముందే ఊహించి అభివర్ణించాడని చెప్పాలి.

కాని ఆ గీతం అక్కడితో పూర్తి కాలేదు. అక్కణ్ణుంచి మరొక పదమూడు పాదాల్లో గీతకారుడు దైవమహిమని ఉగ్గడించకుండా ఉండలేకపోయాడు. దైవరాజ్యం రాబోతున్నదనీ, నేల నాలుగు చెరగులా ఆయన మహిమాతిశయం ప్రకటించడం తథ్యమనీ ఎలుగెత్తి చాటకుండా ఉండలేకపోయాడు. అంతేకాదు, రాబోయే కాలంలో బీదసాదలకి అన్నం దొరుకుతుందనీ, వారికి తృప్తి కలుగుతుందనీ కూడా చాటిచెప్తున్నాడు.

ఈ స్తుతిగీతంలోని మొదటి భాగం నిజమైతే రెండో భాగం కూడా నిజం కాకతప్పదు. యేసు ఆ కల్వరి కొండ మీద ఆ అపరాహ్ణవేళ ఈ గీతంలోని మొదటి భాగం పూర్తిగా నిజం కావడం చూసాడు. ఎంత పూర్తిగా అంటే, చివరకి తన శత్రువులు చీట్లు వేసుకుని తన అంగీ పంచుకునేదాకా. కాబట్టి, గీతంలోని రెండో భాగం కూడా నిజమయ్యే తీరుతుందని ఆయనకి నమ్మకం కలిగిందని చెప్పడానికే ఆయన ఆ తన చివరిక్షణాల్లో ఈ స్తుతిగీతాన్ని స్మరించుకున్నాడు. స్తుతిగీతంలోని మొదటిపాదాన్ని స్మరించడమంటే మొత్తం స్తుతిగీతాన్ని స్మరణకు తెచ్చుకోవడమే కదా, మొత్తం కీర్తనలన్నిటినీ స్మరించుకోవడమే కదా, తన పూర్వప్రవక్తలు తరతరాలుగా ఉగ్గడిస్తున్న ఈశ్వరం మహిమాతిశయాన్ని మరింత అచంచలంగా ఎలుగెత్తి చాటుకోవడమే కదా.

ఈ మార్పు ఈ గీతంలోని 21 వ వచనంలో నువ్వు నాకు బదులు పలికావు నుంచి మనకు కనిపిస్తుంది. దేవుడు, తన ప్రభువు తన మొరాలకిస్తున్నాడని నమ్మడమే కాదు, ఆయన తనకు జవాబిచ్చాడని కూడా కీర్తనకారుడు చెప్పడం గమనించాలి. ఈ మొత్తం కీర్తన చదవకుండా కేవలం 'దేవా దేవా నా చేతిని ఎందుకు విడిచావు' అనే మొదటివాక్యం దగ్గరే ఆగిపోయి అవే క్రీస్తు చివరి మాటలని అనుకోవడం కన్నా పొరపాటు మరొకటి ఉండదు. ఆ కీర్తనని క్రీస్తు స్మరిస్తున్నాడంటేనే 'నువ్వు నాకు బదులు పలికావు' అని ఆ కొండకొమ్ముమీంచి సమస్తలోకానికీ ఆయన చాటుతున్నాడు. ఎంత గొప్ప వాక్యం! ఎంత కరుణామయ వాక్యం! ఎంత ధైర్యాన్ని, ఓదార్పునిచ్చేవాక్యమిది!

ఈ సంగతి బోధపడ్డాక నాకు పాతనిబంధనలోని ఈ కీర్తనల పట్ల గౌరవం మరింత ఇనుమడించింది. కీర్తనల్లోని స్థలకాల విశేషాల్ని పక్కన పెట్టి చదువుకున్నట్లయితే, ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా ఈశ్వరభక్తుల ఆత్మగానమిలానే కదా ఉంటుందనిపించింది. నా పసితనంలో మా బామ్మగారు ఏ ముహూర్తాన పోతన భాగవత పద్యాలు నాకు వినిపించి కొన్నేనా నాతో కంఠస్థం చేయించారోగాని అప్పణ్ణుంచీ ఈశ్వరస్తుతి గీతాలు వినడమన్నా, మననం చేసుకోవడమన్నా నాకు ప్రాణం లేచి వచ్చినట్టుంటుంది. వేరే భాషల్లో ఈశ్వరభక్తులు గానం చేసిన స్తుతి గీతాల్ని తెలుగులో తిరిగి రాసుకుంటే అవి పూర్తిగా నా రక్తాస్థిగతం అయిపోయాయనిపిస్తుంది. అందుకనే ఇప్పుడు ఈ గీతాల్ని కూడా ఇలా తెలుగు చేయడానికి పూనుకున్నాను.

3

ఈశ్వర స్తుతిగీతాలుగా నేను అనువదించిన ఈ స్తోత్రాలకు, విన్నపాలకు ప్రత్యేకంగా ఎటువంటి వ్యాఖ్యానం అవసరంలేదనుకున్నాను. అందుకని ఆ గీతాల్ని సరళవచనంలో నేరుగా అనువదించాను. అయితే, ఈ గీతాల నేపథ్యం గురించి మరికొన్ని విషయాలు మీతో పంచుకుంటే మీరు వీటిని ఎక్కువ ఆస్వాదించగలరు అనిపించింది.

Psalms బైబిల్లో పాతనిబంధనలో ఒక అధ్యాయం. ఆ పదానికి అర్థం స్తోత్రములు అని. జయగీతాలు అని కూడా అనవచ్చు. మొత్తం 150 గీతాలు అవి. వాటిలో స్తుతులున్నాయి, నతులున్నాయి, ఆత్మ విశ్వాస గీతాలున్నాయి, ధన్యవాద సమర్పణలున్నాయి, నిరసనలున్నాయి, విలాపాలున్నాయి. ప్రపంచమంతా భగవద్భక్తులు ఎన్ని మానసిక అవస్థలకు లోనవుతూ కవిత్వం చెప్పారో ఆ అవస్థలన్నీ ఆ గీతాల్లో కనవస్తాయి. ఆ గీతాల్ని చదువుతున్నప్పుడు మనకి టాగోర్ గీతాంజలి గుర్తు రావడంలో ఆశ్చర్యం లేదు. నిజానికి టాగోర్ తన బెంగాలీ గీతాల్ని ఇంగ్లిషు వచనంలోకి అనుసృజించి వెలువరించి నప్పుడు పాశ్చాత్యపాఠకులకి అవి మరో రూపంలో Psalms లాగే అనిపించాయి.

యుగయుగాలుగా Psalms మానవాళిని ఏ విధంగా ప్రభావితం చేస్తూ వచ్చాయో Rowland E. Prothero అనే పండితుడు The Psalms in Human Life (1903) అనే ఒక అద్భుతమైన గ్రంథం రాసాడు. అందులో ఆయన రాసిన మొదటి అధ్యాయం మొత్తాన్ని యథాతథంగా అనువదించి మీతో పంచుకోవాలన్న కోరికని ఎలానో అణచుకుంటూ ఇప్పటికి ఈ వాక్యాలు మీముందుంచుతున్నాను. ఆయన తన రచనమొదలుపెడుతూనే ఇలా అంటున్నాడు:

> రబ్బీయ సంప్రదాయంలో చెప్పుకునేదాని ప్రకారం దావీదు శయ్యపైన ఒక తంత్రీవాద్యం వేలాడుతూ ఉండేదట. అర్ధరాత్రి పూట ఒక మందపవనం వీచినప్పుడల్లా ఆ తంత్రుల పైన సంగీతపు తరగలు రేగేవట. ఆ కవిరాజు తన నిద్రపక్కనపెట్టి శయ్యమీంచి లేచి ప్రాచీదిశన ప్రత్యూషకాంతులు పరుచుకునేదాకా ఆ తంత్రీస్వనాలకు పదాలు కూర్చుకుంటూ గడిపేవాడట. ఆ సంప్రదాయంలో వికసించిన కవిత్వం మొత్తాన్ని ఒకే ఒక్క వాక్యానికి కుదించి ఏం చెప్తారంటే, పాతనిబంధనలోని కీర్తనల్లో, మానవుడి హృదయం మీద మన సృష్టికర్త స్వరపరిచిన సమస్త సంగీతమూ వినిపిస్తుందని. మానవుడి కోమల గీతికాగానం, అతడి అనుతాప విలాపం, అతడి విషాదసంగీతం, అతడి విజయదుందుభిస్వనం, అతడి పరాజయ నిర్వేదం, అచంచలమైన అతడి ఆత్మవిశ్వాసపు నిబ్బరం, తనకొక ఆసరా దొరికిందన్న నిశ్చింతలోని పారవశ్యం ఆ గీతాల్లో పోగుపడ్డాయి. అందులో మానవాత్మ తాలూకు సమస్త దేహాంగ విభజనా మనకి గోచరిస్తుంది. హైన్రిక్ హైని అన్నట్లుగా ఆ గీతాల్లో 'సూర్యోదయం, సూర్యాస్తమయం, జన్మ, మృత్యువు, వాగ్దానం, సాఫల్యం– మొత్తం మానవాళి జీవనరూపకమంతా' ఒక్కచోటకు చేరుకున్నాయి.

ఆయన ఇంకా ఇలా రాస్తున్నాడు:

> ఎన్నటికీ వెలిసిపోని రంగుల్లో మానవుడి నైతిక సంగ్రామం కీర్తనల్లో శాశ్వతంగా చిత్రితమైంది. ఆ యుద్ధంలో మానవుడు బెంబేలు పడుతూ ఉండవచ్చుగానీ, పూర్తిగా పరాజితుడు కావడంలేదు, అతడు తన స్వభావం లోని అత్యున్నత, శ్రేష్ఠ శిఖరాలకు చేరుకోడానికి సదా నలుగులాట పడుతూనే ఉన్నాడు, ప్రతిసారీ కించిత్ దూరంలో తన ప్రయత్నం తప్పి పోతుండగా, తన ఆశయానికీ, తన లక్ష్యప్రాప్తికీ మధ్య ఎంత అగాధమున్నదో గ్రహిస్తూనే ఉన్నాడు. మనకి ఆ కీర్తనల్లో వినిపించేది ఏదోను ఉద్యానంలో మనిషికీ, దైవానికీ మధ్య నడిచిన అమాయికమైన సంభాషణ కాదు. ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయి ఉంటే మన పతితస్వభావాలకు ఆ కీర్తనలు విలువైనవిగా తోచి ఉండేవేకావు. దానికి బదులు తన అపరాధస్వభావం పట్ల లోతైన ఎరుక కలిగిన ఆత్మ సిగ్గుతో, అనుతాపంతో, ఆశతో తడబడుతూ, తొట్రుపడుతూ, భగవంతుడితో తన వ్యక్తిగత సంభాషణను కొనసాగించడానికి తాపత్రయపడటం కనిపిస్తుంది. కీర్తనలు దేవుడితో ముఖాముఖి, భావంతో

భావం, హృదయంతో హృదయం నిరంతరం చేసే సంవాదాలు. ఇక్కడ కూడగట్టినవి ఒక మతం తాలూకు ప్రాథమిక నిబంధనలు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక జీవననియమాలు మాత్రమే కాదు, ఇవి నిత్యసాధన సూత్రాలు, భక్తిసారాంశవచనాలు, ప్రార్థన, ఈశ్వరస్తుతులతో కూడుకున్న నిర్దేశసూత్రాలు. మీదుమిక్కిలి ఈ ఆరాటమంతా సుసంపన్నమైన కావ్యభాషలో, కావ్యసత్యంతో శోభిస్తూ ఉండటం మనం గమనించాలి.

ఆయన రాసిన ఈ వాక్యాలు కూడా మీతో పంచుకోనివ్వండి. ఇలా అంటున్నాడు ఆయన.

ప్రతి మనిషీ తన ఆత్మసంచలనాన్ని పరికించుకోడానికి కీర్తనలు అద్దం పడతాయి. చింతనశీలమైన ప్రతి ఒక్క మానవహృదయమూ తనకు రక్షకుడిగా, సంరక్షకుడిగా, స్నేహితుడిగా ఉండే ఒక అత్యున్నత భగవత్ స్నేహంకోసం, ప్రేమకోసం, శాశ్వత సన్నిధికోసం తపించే అనుబంధాన్ని ఈ కీర్తనలు ఒక దివ్యపరిభాషలో ప్రకటిస్తున్నాయి. అవి పలుకుతున్నవి సాధారణఅనుభవాల్నే, మనకి సుపరిచితమైన ఆలోచనల్నే. కానీ ఈ సాధారణ సామగ్రికే అవి ఒక అసాధారణమైన విస్తృతిని, ఒక సాంద్రతని, ఒక లోతుని, ఒక ఉన్నతిని సమకూర్చుకుంటున్నాయి. అత్యంతప్రతిభావంతులు కూడా అందుకోలేని ఎత్తులకు అవి చేరుకోగలుగుతున్నాయి. మహోదారమైన గొప్ప ప్రజ్ఞాళువు ఆత్మవిచారాన్ని అవి మాటల్లోకి అనువదిస్తున్నాయి. సత్యం నుంచీ, సారళ్యం నుంచీ పుట్టిన సౌందర్యాన్నీ, అనుభూతికీ, అభివ్యక్తికీ మధ్య కుదిరిన చక్కని సమతూకాన్నీ, నిరక్షరాస్యులైన రైతుల మూగ ఆవేదననీ, వినయసౌశీల్యాన్నీ అవి ప్రతిబింబిస్తున్నాయి. కాబట్టే ప్రతి ఒక్క దేశంలోనూ ఆయాజాతుల దైనందిన జీవితంలో కీర్తనలు ఒక అంతర్భాగమైపోయాయి. వాళ్ల సామెతల్లోకి అవి చొచ్చుకుపోయాయి, వాళ్ళ సంభాషణల్లో కలగలిసిపోయాయి, వారి అస్తిత్వపు ప్రతి కీలక సందర్భంలోనూ అవి వినియోగానికి వస్తూనే ఉన్నాయి.

ఇంకా ఇలా రాస్తున్నాడు:

కీర్తనల సమక్షంలోనే మనం పెళ్ళిళ్ళు చేసుకుంటున్నాం, కీర్తనల సమక్షంలోనే అంత్యక్రియలు జరుగుతున్నాయి. కీర్తనల ఆసరాతోనే మనం మన పార్థివ అస్తిత్వం తాలూకు పరమార్థాన్ని పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకోగలుగు తున్నాం. మనం పెరిగి పెద్దయ్యే కొద్దీ, ఈ గ్రంథంలోని చిరపరిచిత పదజాలం

ప్రతి సారీ ఎంత నిత్యనూతన శక్తితో మనకి కొత్త అర్థాలు స్ఫురింపచేస్తూ ఉన్నదని!

ఇటువంటి ప్రభావం యుగయుగాలుగా క్రైస్తవ సాధువుల పైనా, సాధకుల పైనా, చర్చిపైనా, రచయితల పైనా ఏ విధంగా ఉంటున్నదో ఈ పండితుడు చాలా విపులంగా తన పుస్తకంలో చర్చించాడు. అగస్టయిన్ సాధువు Confessions లో, థామస్.ఎ.కెంపిస్ Imitation of Christ లో, జాన్ బన్యన్ Grace Abounding లో, బిషప్ ఆండ్రూస్ Devotionsలో, బ్లెయిజి పాస్కల్ Pensées లో కీర్తనల స్ఫూర్తి ఎలా ప్రవహిస్తూ ఉన్నదో ఆయన ఎంతో విశదంగా నిరూపించాడు. ఈ పేర్లు మనకి బాగా తెలిసినవి. మనకి అంతగా తెలియని మరెన్నో అసంఖ్యాకమైన ఉదాహరణల్ని ప్రస్తావిస్తూ ఆయనిలా అంటున్నాడు:

> ఆ విధంగా కీర్తనల అధ్యాయంలో అమరవీరుల నెత్తుటిమరకలతో చివికి పోయిన పుటలున్నాయి. సాధువుల కన్నీళ్ళతో తడిసిపోయిన పుటలున్నాయి. భయం మీదా, ప్రలోభం మీదా దుర్బల మానవాళి సాధించిన విజయాల వెలుగులున్నాయి. ఒక వీరోచిత ప్రకాశంతో, మానవాతీత సాహసంతో మెరిసి పోయే పుటలు కూడా ఉన్నాయి. చిరపరిచితమైన ఆ పంక్తులపైన హృదయాన్ని ఉప్పొంగించే ఆధ్యాత్మిక సాహసగాథల్నీ, హృదయవిదారకమైన విషాదగాథల్నీ కూడా తిరిగితిరిగి రాసిన ఆనవాళ్ళున్నాయి.

Psalms గా ఇంగ్లిషు బైబిలు పేర్కొన్న ఈ కవితల్ని తెలుగు బైబిలు 'కీర్తనలు' అని అనువదించింది. వీటి హీబ్రూ మూలపదం mizmor అంటే గీతం లేదా గేయమని అర్థం. దాని మరో పదం ehilim అంటే అర్థం స్తోత్రం అని. స్తోత్రంగానూ, గీతంగానూ కూడా వీటికి సంగీత సహకారం ఉండితీరాలన్న సూచనలేదు. కాని ఇవి మతపరమైన క్రతువుల్లో హవిస్సులు అర్పిస్తూ పలికే సూక్తాలకన్నా భిన్నమైనవి అని మాత్రం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

నూట యాభై సామగీతాల్నీ అయిదు విభాగాలుగా పరిగణించడం పరిపాటి. 1 నుంచి 41 దాకా మొదటి భాగం, 42 నుంచి 72 దాకా రెండవ భాగం, 73 నుంచి 89 దాకా మొదటిభాగం, 90 నుంచి 106 నాలుగవ భాగం, 107 నుంచి 150 దాకా అయిదవభాగం.

పాతనిబంధనలోని మొదటి గ్రంథాలు–జెనిసిస్, ఎకోసడస్, లెవిక్టస్, నంబర్స్, ద్యుటిరానమీ –అయిదింటినీ కలిపి పెంటచూక్ అని వ్యవహరిస్తారు. వీటిని 'తోరా' అని కూడా పిలుస్తారు. తోరా అంటే దైవశాసనం అని అర్థం. ఈ అయిదు గ్రంథాల్నీ మోషే తాలూకు అయిదు పుస్తకాలుగా కూడా పిలుస్తారు. ఇవి యూదులకు నిత్యపారాయణ గ్రంథాలు. Psalms లోని అయిదుభాగాలూ ఈ అయిదుగ్రంథాల సారాంశాన్నీ ప్రతిబింబిస్తాయని నమ్మకం. అందువల్ల సామగీతాల్ని తోరా సంగ్రహంగా పరిగణిస్తుంటారు కూడా.

అయితే కీర్తనల్ని ఇలా అయిదుభాగాలుగా విభజించి వాటిని పాతనిబంధనలోని మోషే గ్రంథాలు అయిదింటికీ సంగ్రహంగా పేర్కొనే విభజనని ఇప్పుడు చాలామంది పండితులు అంగీకరించడంలేదు. అవన్నీ ఏకకాలంలో ఏక కర్తృత్వంతో వెలువడ్డవి అని కూడా పండితులు భావించడంలేదు.

ఈ అంశం మీద ఇంతదాకా వచ్చిన పరిశోధనల్నీ, పరిశీలనల్నీ సమగ్రంగా సమీక్షిస్తూ J.Day అనే పండితుడు Psalms (1990) అనే పుస్తకం రాసాడు. అందులో ఆయన చెప్పినదాన్నిబట్టి కీర్తనల్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. వాటిలో స్థూలంగా 42–83 దాకా కీర్తనల్ని అత్యంత పురాతనమైన ప్రార్థనలుగా చెప్పవచ్చంటాడు. వాటిని Elohistic Psalter అంటాడు. హీబ్రూలో Elohim అంటే దేవుడు అని అర్థం. కాగా తక్కిన కీర్తనల్లో అంటే 1–41, 84–150 కీర్తనల్లో Elohim అనే పదానికి బదులు Yahweh అనే పదం ప్రధానంగా కనిపిస్తుంది. యెహోవా అంటే ప్రభువు అని అర్థం. భగవంతుడు ప్రభువుగా, రాజుగా, రాజాధిరాజుగా, రక్షకుడిగా, సంరక్షుడిగా మారిన పరిణామం 1–41, 84–150 కీర్తనల్లో కనిపిస్తుంది. అలాగని ఈ మూడు విభాగాలూ కూడా విడివిడి విభాగాలుగా ఉండేవనీ, కాలక్రమంలో అవి ఒక గ్రంథంగా సంకలన మయ్యాయనీ కూడా అనుకోలేమని చెప్తాడు. ఒక పరిశీలన ప్రకారం మొదటి రెండు భాగాలూ అంటే 1–41, 42–72 ఒక పుస్తకంగానూ, తక్కిన మూడు భాగాలూ ఒక పుస్తకంగానూ ఉండేవనీ, అవన్నీ కలిపి ఒక గ్రంథంగా రూపొందాయనీ కూడా అంటాడు.

కీర్తనల్లో వినిపించే ఆవేదన, ఆరాటం, ఆశాభావాల్ని బట్టి వాటిని యూదుల ప్రవాస కాలానికి ముందూ, ప్రవాస కాలం తర్వాతా ప్రభవించినవిగా చూస్తున్నారు. క్రీ.పూ. 586 లో బేబిలోనియన్ చక్రవర్తి నెబుకడ్‌నజర్ యూదాపైన దండెత్తి సొలొమోను నిర్మించిన పవిత్రదేవాలయాన్ని నేలమట్టం చేసాడు. ఆ రోజుల్లో ఆ మహాసామ్రాజ్యాలు తాము జయించిన ప్రాంతాల పట్లా, జాతుల పట్లా ఒక అత్యంత అమానుషమైన పద్ధతిని అమలు

చేసేవారు. దాని ప్రకారం తాము జయించిన జాతుల్లో ముఖ్యులైన నాయకుల్ని ఒక సమూహంగా నిర్బంధించి వారిని తమ రాజ్య పరిధిలోకి ప్రవాసులుగా తీసుకొచ్చేసేవారు. అలాగే వారి స్థానంలో ఆ ప్రాంతానికి చెందని పరాయి ప్రాంత ప్రజల్ని ప్రవాసానికి పంపేవారు. దానివల్ల ఆ జాతుల సంస్కృతి, సంప్రదాయం, ఆత్మస్థైర్యం మొత్తం నాశనమై పోయేవి. నెబుకడ్‌నజర్ కూడా ఇజ్రాయేలు నుంచి ఎందరో యూదుల్ని ఆ విధంగా బేబిలోన్‌కి ప్రవాసితులుగా తీసుకువెళ్ళిపోయాడు. ఆ తర్వాత క్రీ.పూ. 539 లో బేబిలోన్‌ని జయించిన పర్షియన్ చక్రవర్తి సైరస్ ఆ యూదులు తిరిగి తమ స్వదేశానికి వెళ్ళడానికి అనుమతించాడు. అలా ప్రవాసానికి వెళ్ళిన యూదులు మరొక అర్థశతాబ్దం తర్వాత గానీ తమ ప్రాంతానికి తిరిగి చేరుకోలేకపోయారు. కీర్తనల్లో ఈ రెండు దశలూ మనకి వినిపిస్తాయి. ఉదాహరణకి, ఈ చరిత్ర ఏమీ తెలియకపోయినా కూడా, సుప్రసిద్ధమైన కీర్తన 137 యూదుల ప్రవాసదుఃఖాన్ని వినిపిస్తున్నదే అని మనం పోల్చుకోగలుగుతాం.

మధ్యప్రాచ్యానికి చెందిన ప్రాచీన సాహిత్యం గురించీ, చరిత్ర గురించీ మరిన్ని పరిశోధనలు వెలువడుతున్నకొద్దీ, కీర్తనల గురించిన అవగాహన కూడా విస్తృతమవుతూ వస్తున్నది. ఉదాహరణకి కీర్తనల్లోని అత్యంత ప్రాచీన మైన కీర్తనలకి ఈజిప్షియన్ స్తోత్రాలు నమూనాగా ఉన్నాయనేది అటువంటి ఒక పరిశీలన. ముఖ్యంగా 104 వ కీర్తన అఖ్నేతాన్ ఫారో రాసిన ఒక స్తోత్రాన్ని దాదాపుగా తిరిగి రాసిన కీర్తన కావడం. క్రీ.పూ. పధ్నాలుగవ శతాబ్దంలో అఖ్నేతాన్ ఏకేశ్వరోపాసనతో ఈజిప్టులో ఒక విధమైన విప్లవాన్ని తీసుకొచ్చాడు. కాని అది అతడితోటే అంతమైపోయింది. తన ఏకేశ్వరోపాసనలో అతడు సూర్య మండలాన్ని స్తుతిస్తూ రాసిన స్తోత్రాన్ని నమూనాగా తీసుకున్న 104 వ కీర్తన చదువుతుంటే మనకి ఋగ్వేదంలోని విష్ణుసూక్తం గుర్తురావడంలో ఆశ్చర్యం లేదు.

4

కీర్తనలు ఆవిర్భవించిన కాలాన్నిబట్టి వాటిని స్థూలంగా రెండు భాగాలుగా విభజిస్తారని చెప్పాను కదా. అవి: యూదులు బేబిలోన్‌కి ప్రవాసానికి వెళ్ళకముందటి ప్రార్థనలూ, ప్రవాసం నుంచి స్వదేశానికి తిరిగివచ్చిన తరువాత కూర్చుకున్న ప్రార్థనలూనూ. మొత్తం కీర్తనల్లో దాదాపుగా మూడింట రెండు వంతులు ప్రవాసానికి వెళ్ళకముందు స్తోత్రాలు. వాటిలో మళ్ళా రెండు భాగాలున్నాయి. 41 నుంచి 89 దాకా ఉన్న కీర్తనలు యూదు సమాజం, యెరుషలేం కేంద్రంగా ఒక ఇజ్రాయేలుగా సంఘటితం కాకముందు, చిన్న చిన్న సమూహాలుగా, చిన్న చిన్న ప్రార్థనా కూటములుగా ఉన్నప్పటి కీర్తనలు. యెరుషలేంలో సొలోమోను దేవాలయం నిర్మించకపూర్వం ఒక గుడారంలో దేవుణ్ణి ప్రతిష్టించుకుని

ఆయన్ని ఆలంబనగా తాము చేసుకునే హేమంత ఉత్సవాల్లో పాడుకున్న గీతాలవి. అంటే మార్గశిరమాసంలో వేదకాలమానవుడు నవాగ్రాయణ క్రతువుల్లో తొలి హవిస్సులు సమర్పిస్తూ పాడుకున్న అగ్నిసూక్తాల్లాంటివి అని చెప్పవచ్చు.

అయితే కీర్తనల్లో వినిపించే భావోద్వేగం, హృదయావేదనల్ని దృష్టిలో పెట్టుకుని చూసినప్పుడు వాటిని మళ్ళా స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటి తరహా కీర్తనలు విలపాలు, రెండో తరహా కీర్తనలు ధన్యవాద సమర్పణలు. ఈ రెండూ కాక, ఆత్మస్థైర్యాన్ని ప్రకటించే గీతాలుగానూ, దైవజ్ఞాన ప్రకటన గీతాలుగానూ, యాత్రా గీతాలుగానూ, ప్రవేశవేళల్లో చేసే ప్రార్థనలుగానూ కూడా కొన్ని గీతాల్ని లెక్కవేస్తున్నారుగానీ, అవన్నీ కూడా దాదాపుగా కృతజ్ఞతా ప్రకటనలే. మొత్తం గీతాలన్నిటిలోనూ దాదాపు మూడింట రెండు వంతులు విలాపగీతాలే. అందులో ఆశ్చర్యం లేదంటాడు J.Day. 'దుఃఖ్ మేఁ సుమిరన్ సబ్ కరై, సుఖ్ మేఁ కరే న కోయ్' అని కబీరు అనలేదా! కష్టంలో భగవంతుణ్ణి తలచుకోవడంలో మానవుడికి ఏ మతభేదమూ లేదు. ఇప్పుడు మన కవిత్వం కూడా అంతే కదా! జీవితవాస్తవాల్నీ, చుట్టూ ఉన్న నిష్ఠుర పరిస్థితుల్నీ చూసి ఎలుగెత్తి ఆక్రందించడంలో ఉన్న ఆసక్తి, కవులకి, జీవితం తమకి ప్రసాదిస్తున్న సంతోషాల్ని బిగ్గరంగా గానం చెయ్యడంలో లేదు కదా. ఒకవేళ ఎవరేనా అలా తమ జీవనసంతోషాన్ని మాత్రమే గానం చేస్తే ఆ కవిని తోటి కవులు ఒకపట్టాన నమ్మలేరు కూడా.

కీర్తనల్లో మరొక ముఖ్యలక్షణం కనిపిస్తూ ఉంది. వాటిల్లో మొదటి భాగంలో విలాపాలుంటే రాను రాను విజయసంతోష గీతాలు కనిపిస్తాయి. అలాగే కీర్తనల్లోని మొట్టమొదటి కీర్తన కూడా మంగళ ప్రదమైన కీర్తననే. బైబిలు పండితులు చెప్పేదాని ప్రకారం మొదటి కీర్తన మొట్టమొదటగా పుట్టిన కీర్తన కాదు. ఆ గీతంతో కీర్తనల అధ్యాయాన్ని మొదలుపెట్టడం సంకలనకారులు చూపించిన వివేకం.

పూర్వకాలపు సంకలనాల్లో ఇటువంటి ఒక దృక్పథం ఉండేది. అంటే మొదటి కీర్తన లేదా మొదటి శ్లోకం లేదా మొదటి పదం అది కేవలం ప్రారంభ పదప్రయోగమో, శ్లోకమో, పద్యమో మాత్రమే అయి ఊరుకోకుండా ఆ మొత్తం అధ్యాయానికి ప్రాతినిథ్యం వహించేదిగా కూడా ఉండటం. ఉదాహరణకి ఋగ్వేదం మొదటిమండలంలోని మొదటి సూక్తం 'అగ్ని మీళే పురోహితం' ఋగ్వేదం లోని అతిచిన్న సూక్తం కావడం వల్ల మాత్రమే మొదటి సూక్తం కాలేదు. ఋగ్వేదమానవుడి మొత్తం జీవనదృక్పథానికి, అగ్నిసాక్షిగా, అగ్నిని అల్లుకుని, అతడు తన జీవనక్రతువును తీర్చిదిద్దుకోడాన్ని ఆ సూక్తం ప్రతిబింబిస్తుంది. ఋగ్వేదంలో వాక్కుని ఇళ, సరస్వతి, భారతి అనే మూడు రూపాల్లో,

మూడు దశల్లో ఆవాహన చేసారు. ఋగ్వేద మానవుడి ప్రపంచంలో మూడు లోకాలున్నాయి. అవి పృథ్వి, అంతరిక్షం, ద్యులోకం. అగ్ని పృథ్వీదేవత. అంతరిక్షంలో ఇంద్రుడు, ద్యులోకంలో ఆదిత్యుడు. ఇళ పార్థివసంబంధమైన వాక్కు. సరస్వతి మధ్యలోకాలకి చెందిన వాక్కు. భారతి ఆదిత్యలోకపు వెలుగు. 'భా' అంటేనే వెలుగు. రతి అంటే ఆ వెలుగుపట్ల నిష్ఠ. ఈ ప్రస్థానక్రమమంతా ఒక్క మొదటి సూక్తంలోనే మనం పోల్చుకోవచ్చు. అలానే కీర్తనల్లో కూడా మొదటి కీర్తన ఒక్కటి క్షుణ్ణంగా అధ్యయనం చేసినా మొత్తం కీర్తనల సారాంశాన్ని మనం అవగాహనచేసుకోవచ్చు.

అదీకాక ఏ కావ్యమైనా మంగళప్రదంగా మొదలై, మధ్యలో కూడా మంగళ భావనల్ని గుర్తుచేస్తూ చివరికి మంగళప్రదంగా ముగియాలనేది ప్రాచీనుల కావ్యదృక్పథం. కీర్తనలు కూడా అందుకు మినహాయింపు కాదని, ఈ నూటయాభై కీర్తనల్లోని 1, 75, 150 గీతాలు చదివినా కూడా మనం గ్రహించగలుగుతాం.

అంతేకాక, మనం ఇంతకు ముందు చెప్పుకున్న 22 వ కీర్తననే చూసినా కూడా ఆ గీతంలో రెండుభాగాలున్నాయనీ, మొదటి భాగం విలాపమైతే, ఈశ్వరానుగ్రహం తనకి ఒక్కడికే కాక, తన దేశానికీ, తన జాతికీ మాత్రమే కాక, భూమండలం మొత్తానికి దక్కబోతున్నదనే ఆశాభావం రెండోభాగమనీ కూడా అనుకున్నాం. ఇదే స్ఫూర్తి కీర్తనల మొత్తం అధ్యాయానికి వర్తిస్తుంది. ఆ విధంగా వాటిని ఒక దివ్యమంగళ ప్రకటనగా కూడా మనం భావించవచ్చు. తర్వాత రోజుల్లో దాంటే తాను నరకం నుంచి స్వర్గం వైపుగా ప్రయాణించడాన్ని డివైన్ కామెడీ గా రాసాడని మనకు తెలుసు. ఈ కీర్తనల్ని మొదటి డివైన్ కామెడీగా అనుకోవచ్చు.

కీర్తనల్లో అధికభాగం విలాపాలు అని చెప్తున్నప్పుడు 22 వ కీర్తనలోలానే చాలా కీర్తనల్లో మొత్తం గీతమంతా విలాపం కాకుండా సగం నుంచీ అదొక విశ్వాస ప్రకటనగా, ఒక సాక్షాత్కారం లభించిన సంతోషంగా కూడా వినిపిస్తుంది. చాలా గీతాల్లో మధ్యలోనే ఏదో జరగడం, ఆ తర్వాత, ఆ కన్నీళ్ళు ఆనందబాష్పాలుగా మారిపోడం మనం గమనిస్తాం. 126 వ కీర్తనలో చెప్పుకున్నట్టుగా అంతదాకా తాము అనుభవించిన కష్టాలన్నీ ఒక కలలాగా తోచి 'కన్నీళ్ళు నారుగా నాట్లునాటే వాళ్ళు సంతోషం గంపలకి ఎత్తుకుని తిరిగిరావడం' గీతకర్తలు చూసారు, చూసింది ఎలుగెత్తి పాడేరు.

కేవలం విలాపాలుగా ఉన్న కీర్తనల్ని, అంటే, 3-7, 9-10, 13,17, 22, 25-28, 31, 35, 38-39, 40, 42-43, 51-52, 54-57, 59, 61, 64, 69-71,

77, 86, 88, 94, 102, 109, 120, 130, 139–143 లను పరిశీలించినప్పుడు మనం మరికొన్ని అంశాలు గమనించవచ్చు.

విలాపాలు సాధారణంగా అభ్యర్థనలుగా, వినతిలేఖలుగా కనిపిస్తాయి. వాటిలో గీతకర్త తన అమాయికత్వాన్ని, నిర్దోషిత్వాన్ని విన్నవించుకోడం కనిపిస్తుంది. తులసీదాస్ 'వినయపత్రిక' లో లాగా వీటిల్లో కూడా తన శత్రువులు– బయటివాళ్ళూ, లోపలివాళ్ళూ– కూడా తనని చుట్టుముట్టి ఉన్న ఒక విహ్వలత్వం కనిపిస్తుంది. అయితే, దేవుడు తన మొరాలకిస్తున్నాడనే నిశ్చయ జ్ఞానం, ఒక అచంచల విశ్వాసం ఈ గీతాలకి ప్రాణం. అందుకనే కొన్ని చోట్ల అవి ఫిర్యాదులుగా, రక్షణకోసం ఆక్రందనలుగా వినబడుతున్నప్పుడు కూడా, ఆ విశ్వాసం చెక్కుచెదరకపోవడం మనం చూడవచ్చు.

గీతాల్ని మరింత క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పండితులు విలాపాల్లో మళ్ళా రెండు రకాలున్నాయని గుర్తుపట్టేరు. మొదటి తరహా విలాపాలు గీతకర్త తన స్వీయ దుఃఖాన్ని ప్రకటించేవి. రెండో తరహా విలాపాలు తన జాతిదుఃఖాన్ని వినిపించేవి. అక్కడ గీతకారుడికి తన దుఃఖం కొన్నిచోట్ల జాతిదుఃఖం, కొన్ని చోట్ల జాతిదుఃఖమే తన దుఃఖం కూడా. గీతకర్త తన విషాదాన్ని ప్రకటిస్తున్నప్పుడు అది దాదాపుగా మృత్యువు తన మీద విరుచుకుపడ్డ అనుభవం. జాతి దుఃఖాన్ని ప్రకటిస్తున్నప్పుడు తన జాతిమీద ప్రాకృతిక విపత్తులో, బయటి శత్రువులో విరుచుకుపడే సందర్భాలు లేదా తమ విశ్వాసాలమీద పరాయి విశ్వాసాలు, పరాయి దేవతలు దండెత్తడాలు. లేదా ఒక క్షీణత, ఒక corruption తన నైతికవిలువల్లో లేదా తన సమాజం తాలూకు నైతిక ప్రవర్తనలో ఒక సంక్షోభం తన దుఃఖప్రకటంగా మారడం కనిపిస్తుంది.

కొన్ని సార్లు ఆ విలాపాలు ఒక వ్యక్తి తన వ్యక్తిగత దుఃఖాన్ని ప్రకటించేవిగా ఉన్నప్పటికీ, ఆ వ్యక్తి ఒక రాజుగా కూడా తన ఆక్రోశాన్ని వినిపిస్తుంటాడు. ఈ గీతాల్లో చాలావాటికి దావీదు కర్తృత్వం ఉందన్నప్పుడు ఆ దావీదు ఒక వ్యక్తి మాత్రమే కాక, ఒక జాతినాయకుడిగా కూడా తన దుఃఖాన్ని ప్రకటిస్తున్నాడు. నిజానికి అక్కడ వ్యక్తికీ, రాజుకీ మధ్య సరిహద్దు రేఖ గీయలేం కూడా. తనమీద దండెత్తుతున్న శత్రువులు బయటి శత్రువులే కానక్కరలేదు, తన ప్రలోభాలు, తాను దైవశాసనానికి కట్టుబడి ఉండలేకపోతున్న నిస్సహాయత్వం కూడా ఆ గీతాల సారాంశం కావచ్చు. అలాగే సామూహిక విలాప గీతాల్లో కూడా మేము అని కాక, చాలాసార్లు నేను అని కూడా వినిపింస్తుంది. అక్కడ ఆ నేను ఆ జాతి తాలూకు ఆత్మ అని మనం అర్థం చేసుకోవాలి.

కొన్ని సార్లు విలాపాల్లో తాను ప్రకటిస్తున్న దుఃఖం ఒక రోగం వల్ల, వ్యాధివల్ల లేదా దీర్ఘకాల రుగ్మత వల్ల కలుగుతున్న కష్టం కూడా. అయితే తనకి ఒక రుగ్మత కలగడంలోని కష్టం కన్నా, తాను ఎక్కడో దైవానుశాసనాన్ని ఉల్లంఘించాడనీ, అందుకే తనని ఆ రుగ్మత పట్టుకుందనీ భావించడం ఆ గీతాల్లో కనిపిస్తుంది. మానవుడిగా తనని వెంటాడే ఆదిపాపం నుంచి విముక్తిపొందితే తప్ప తాను ఆ రుగ్మతనుంచి బయటపడలేననే ఒక మెలకువ కూడా ఆ గీతాల్లో వినిపిస్తుంది.

చాలా సార్లు ఆ విలాపాల్లో కనవచ్చే ఆక్రోశం, తాను అన్యాయానికి గురవుతున్నాడనే ఒక భావన. లేదా తన మీద అన్యాయంగా నిందలుమోపుతున్నారనే ఒక నిస్సహాయత్వం, తనని అన్యాయంగా దోషిగా చూపిస్తున్నారనే ఒక మొత్తుకోలు- ఇది భావుకులైన యూదుల్నీ, క్రైస్తవుల్నీ కూడా- యుగయుగాలుగా వెన్నాడుతూనే ఉన్న ఒక మానసిక చేతన. ఉదాహరణకి ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో కాఫ్కా రాసిన The Trial (1925) లో ఉన్నది ఈ కీర్తనల్లోని మనఃస్థితి లాంటిదే. అయితే, తన మీద చేస్తున్న ఆ ఆరోపణకి తన అంతరంగంలో ఎక్కడో ఏ మూలనో తాను బాధ్యుణ్ణేమో అన్న అపరాధ భావన కాఫ్కా నవలకి కీలకం.

గీతాల్లోని చాలా పదప్రయోగాలు, అభివ్యక్తి, ఆక్రోశాన్ని ప్రకటించే తీరు విలక్షణంగా, అద్వితీయంగా ఉంటాయి. అన్నిటిలోకీ అతి పెద్ద విషాదకరమైన ప్రకటన how long అనేది. ఆరవ కీర్తనలో, పదమూడవ కీర్తనలో వినబడే మాట. 'ఎన్నాళ్ళింకా?'. మనమొక దుఃఖానికి లోనయినప్పుడు, వ్యక్తులుగా గానీ, కుటుంబాలుగా గానీ, జాతులుగా గానీ, ఆ కష్టం ఎప్పటికి తీరిపోతుందో తెలిస్తే, అప్పటిదాకా, ఆ కష్టాన్నెట్లానో పంటిబిగువున భరించగలమనుకుంటాం. కాని కష్టంలోని అతిపెద్ద కష్టం అది ఎన్నాళ్ళు భరించవలసి ఉంటుందో తెలియకపోవడమే. విపత్తులో చిక్కుకున్నప్పుడు మనిషికి లభించగల మొట్టమొదటి సహాయం ఆ విపత్తు మరెన్నాళ్ళో ఉండేది కాదని తెలియడం. కనీసం ఎవరేనా ఆ మాట తనకి నిశ్చయంగా చెప్పడం. కాని అలాంటి మాట చెప్పేవాళ్ళే కనిపించరు. విషాదాల్లో కెల్లా అదే అతి పెద్ద విషాదం.

తన దుఃఖం పూర్తిగా దైవికంకాదనీ, తాను పూర్తిగా నిరపరాధి కాదనీ ఎక్కడో తన పట్ల తనకే ఉండే ఒక సంశయం గీతకారుణ్ణి మరింత శోకగ్రస్తుణ్ణి చేస్తుంది. (స్వీయ హృదయం న్యాయ సదనం నేరమారోపించడానికి, నరనరాలా గూఢచారులు దృష్టి నాపై నిలపటానికి-బైరాగి.)అందుకని తానెటువంటి వాడుగానీ తనని తిరస్కరించవద్దని దేవుడికి మొరపెట్టుకుంటాడు.

5

కీర్తనల్లో మొదటి రెండువంతులు విలాపాలనీ, తర్వాతివి విజయగీతాలూ, ధన్యవాద సమర్పణలనీ చెప్పుకున్నాం. కీర్తనల్లో అధికభాగం యూదులు బేబిలోను ప్రవాసానికి పోకపూర్వపు కాలానికి చెందినవనీ, వాటిలో విలాపగీతాలు అధికంగా ఉన్నాయనీ, ప్రవాసం తర్వాతి గీతాల్లో విజయగీతాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనీ కూడా అనుకున్నాం. ప్రవాసానికి పోకముందు అంటే క్రీ.పూ 597 కన్నా ముందు, ప్రవాసం తర్వాత అంటే క్రీ.పూ. 539 నుంచి దాదాపు క్రీస్తుకాలం దాకా కీర్తనల కాలం అనుకుంటే అవి దాదాపుగా యూదుచరిత్రలోనూ, అనేకమంది దేవతల్లో ఒకడిగా మొదలై తర్వాత రోజుల్లో ఏకేశ్వరుడిగా, సర్వేశ్వరుడిగా, రాజాధిరాజుగా యెహోవా పరిణామం చెందిన చరిత్రలోనూ అంతర్భాగాలుగా ఇమిడిపోయాయని చెప్పవచ్చు.

క్రీ.పూ రెండవ సహస్రాబ్దిలో మొదలైన ఇస్రాయేలు చరిత్రలో ఇస్రాయేలు తన అద్వితీయను సాధించుకునే క్రమానికీ, యెహోవా ఒక దేవత స్థానం నుంచి ఏకేశ్వరుడిగా పరిణామం చెందడానికీ మధ్య అవినాభావ సంబంధం ఉంది. నిజానికి యెహోవా పట్ల నమ్మకం వల్లనే ఇస్రాయేలు ఇస్రాయేలుగా, యూదులు యూదులుగా, చివరికి, క్రీస్తు ఒక మెస్సయ్యాగా మారగలిగారని కూడా మనం చెప్పవచ్చు. ఈ భావపరిణామమంతా కీర్తనల్లో కనిపిస్తుంది. ఆ పుటలన్నీ అయితే రక్తంతో తడిసాయి, లేదా కన్నీళ్ళతో తడిసి పోయాయి.

ఎక్కడో కొన్ని గ్రామాల్లో వందల సంఖ్యలో మొదలైన ఇస్రాయేలీలు ఇస్రాయేలుగా రూపొందడం ఒక్కరోజులో జరగలేదు. వారి చుట్టూ వారికన్నా అనేక రెట్లు మహాపరిమాణం కలిగిన, ఈజిప్షియన్, అసీరియన్, బేబిలోనియన్, పర్షియన్ మహాసామ్రాజ్యాల మధ్య వారు తమ ఉనికిని కాపాడుకుంటూ, తమ గుర్తింపునీ, తమ అస్తిత్వముద్రనీ నిలబెట్టుకోవడం వెనక, తాము దేవుడు ఎన్నుకున్న ఒక ప్రత్యేక సమూహం అనే నమ్మకమే చాలా బలంగా పనిచేస్తూ వచ్చింది. తాము ఆ chosen few అని నమ్మడం, నమ్మలేకపోవడం, కానీ నమ్మలేకుండా ఉండటం– అవిశ్వాస, విశ్వాసాల మధ్య ఆ జాతి పడ్డ ఊగిసలాట, నలుగులాట మొత్తం మనకి పాతనిబంధనలో వచన రూపంలో కనిపిస్తే, కీర్తనల్లో గీతరూపంలో వినిపిస్తుంది.

బేబిలోనియన్ల చేతిలో అవమానకరంగా ఓడిపోయి బేబిలోను ప్రవాసానికి పోకముందు యూదులకి కనీసం నలుగురైదుగురు దేవతలు ఉన్నారు. వారిలో యెహోవా,

రాజవంశపు దేవత. కానీ రాజభవనానికి బయట పల్లెల్లో యూదులు స్థానిక దేవతల్ని కొలుస్తూనే ఉండేవారు. తమ చుట్టూ తమ పూర్వకాలం నుంచీ కూడా తక్కిన మెసొపొటేమియన్ జాతులు జరుపుకునే పండగలే వాళ్ళూ జరుపుకునేవారు. అయితే ఆ దేవతలూ, ఆ పండగలూ వారికి నేరుగా దొరికినవి కావు. వాళ్ళు వాటిని కాననైట్లనుండి స్వీకరించారు. కానీ ప్రాచీన మెసొపొటేమియన్ దేవతలూ, ఆ పండగలూ ప్రధానంగా వ్యావసాయిక ఉత్సవాలు. నేనింతకుందు చెప్పినట్టు అప్పుడు ఆ దేవతలకు చేసే పూజలు తొలిధాన్యాల్ని భూదేవతకీ, సూర్యదేవతకీ సమర్పించే నవాగ్రాయణ క్రతువులు మాత్రమే. కానీ ఆ పండగల్ని యెహోవా తనకీ, తాను ఎంచుకున్న జాతికీ మధ్య ఒప్పందపు పండగలుగా మార్చేసాడు.

Covenant festivals గా చెప్పే ఈ పండగలు ప్రధానంగా ఏడు పండగలు. వీటిని ఎలా జరుపుకోవాలో, ఎప్పుడు జరుపుకోవాలో యెహోవా మోషేకి విశదంగా వెల్లడించాడు. లెవిక్టస్ 23 వ అధ్యాయంలో పేర్కొన్న ఆ ఏడు పండగల– విశ్రాంతిదినం (sabbat), పస్కా పండగ (Passover), పొంగని రొట్టెల పండగ (Unleavened Bread), ప్రథమఫలాలు (First Fruits), వారాలు, వారాల తరువాత పెంతెకోస్తు (Weeks and Pentecost), శృంగవాద్యాల పండగ (Trumpets), ప్రాయశ్చిత్తదినం (Atonement), పర్ణశాలల పండగ (Tabernacles)– ద్వారా యెహోవా తాను ఎంచుకున్న జాతినుంచి ఏమి ఆశించాడో ఊహించడం కష్టం కాదు. ఆ పండగల ద్వారా మనుషులు కుటుంబాలుగా, ఒక జాతిగా సంఘటితపడాలనీ, ఆ సందర్భంగా పాటించవలసిన నియమనిబంధనల ద్వారా వారు ఒక జాతీయ స్వభావాన్ని సంతరించుకోవాలనీ, తమ చుట్టూ ఉన్న వాతావరణ పరిస్థితుల్తోగాని, రాజకీయ వాతావరణంతోగాని నిమిత్తం లేకుండా వారు తమ పూర్తివిధేయతను తన పట్లనే కనపర్చాలనీ యెహోవా కోరుకున్నాడు. అంతేకాదు, ప్రతి ఒక్క యూదు కూడా ఏడాదికి మూడు సార్లు యెరుషలేం యాత్ర చెయ్యాలన్నది కూడా ఆ ఒప్పందంలో భాగం. ఆ విధంగా ఆయన తక్కిన దేవీదేవతల్ని పక్కకు నెట్టి తానే ఏకేశ్వరుడిగా, యూదుల రాజాధిరాజుగా సుప్రతిష్ఠితుడయ్యాడు.

కీర్తనల్లో విజయగీతాలుగా, ధన్యవాద సమర్పణలుగా ప్రభవించిన గీతాలు ఈ పండగల్లో, యెరుషలేం యాత్రల్లో తలెత్తినవే. అందుకనే తొలిగీతాల్లో దేవుడిగా కనిపించే యెహోవా, ఈ మలిగీతాల్లో ప్రభువుగా కనిపించడం మొదలుపెట్టాడు. ఈ గీతాలు ఒక జాతి ఆయనకు సమర్పించుకున్న కృతజ్ఞతా గీతాంజలి. వాటిల్లో యెహోవాని రెండు విధాలుగా కీర్తించారు. మొదటిది, ఆయన తమ తమ వ్యక్తిగత జీవితాల్లో చూపించిన

మహిమలు. ఆయన తమ మొరాలకించి, తమని కష్టాలనుంచీ, విపత్తులనుంచీ బయట పడేసినందుకు చెల్లించిన స్తుతులు. రెండోది, ఆయన ఇస్రాయేలు చరిత్రలో నిర్వహించిన పాత్ర. ఆయన వట్టి దేవుడు మాత్రమే కాదు, తమ రాజు కూడా. తమ రాజు మాత్రమే కాదు, ఏకేశ్వరుడు కూడా. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. మరొకర్ని కొలవడాన్ని ఆయన సహించడు. కొలవలసిన అగత్యం కూడా లేదు. ఎందుకంటే తాము మొరపెట్టుకున్న ప్రతిసారీ ఆయన తమని వ్యక్తిగత కష్టాల నుంచి మాత్రమే కాదు, రాజకీయపరమైన విపత్తులనుంచి కూడా బయటపడేస్తున్నాడు.

ఒక దేవుడు ఏకేశ్వరుడిగా మారడంలో ఆధ్యాత్మికంగా ఎంత సౌలభ్యం ఉన్నప్పటికీ రాజకీయంగా అది నియంతృత్వంగా, లేదా సామ్రాజ్యవాదంగా పరిణమించకుండా ఉండటం సాధ్యం కాదు. అలానే ఏకేశ్వరోపాసన నీడలో రాజ్యాలు బలపడేకొద్దీ, అవి నైతికంగా పతనం కావడం కూడా అసంభవం కాదు. అందుకని యెహోవా తాను సర్వేశ్వరుడిగా మారుతున్న క్రమంలో తన నైతికశాసనం అనుల్లంఘనీయమని కూడా ఇస్రాయేలీల్ని హెచ్చరిస్తూనే ఉన్నాడు. యూదులు బేబిలోను చేతుల్లో ఓడిపోడానికి ముందు వారి బహుదేవతారాధన వల్ల వారి పతనం సంభవించిందని ప్రవక్తల్తో చెప్పిస్తూ వచ్చాడు. ప్రవాసం తరువాత ఇస్రాయేలు కూలిపోయి యూదియా బలపడటం మొదలయ్యాక, బహుదేవతారాధన అంతరించిన తర్వాత, ప్రజల్లో నైతిక నిష్ఠ సన్నగిల్లుతూ ఉందని మళ్ళా ప్రవక్తల్తో చెప్పిస్తూ వచ్చాడు. ఆత్మవంచన, దివాలాకోరుతనం, సంఘజీవితంలోనూ, దేవుడి ఎదట కపటవర్తనా మొదలైనవాటిపట్ల యెహోవా తన ఆగ్రహం దాచుకోకపోవడం ప్రవాసానికి ముందునుంచే కనిపిస్తూ వచ్చింది. ముఖ్యంగా జెరిమియా, మొదటి ఇషయ్యాలలో ఈ ఆక్రోశం చాలా స్పష్టంగా వినిపిస్తుంది. నిజానికి యూదులు ఒక జాతిగా తమ నైతికతకు దూరమయ్యాకనే వారు బేబిలోను చేతుల్లో ఓడిపోయి బందీలయ్యారని రెండవ ఇషయ్యా ఎలుగెత్తి మరీ ప్రకటిస్తో వచ్చాడు.

తన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నవారి పట్ల ఆగ్రహాన్ని ప్రకటించే దేవుడిగా కనిపిచే యెహోవా నెమ్మదిగా తన కరుణని కూడా చాటుకోవడం మొదలుపెట్టాడు. ప్రవాసం తరువాతి యూదియా కాలపు ప్రవక్తలు హగ్గయి, జకరయ్యా, మలాచి, జోయెల్ వంటి వారి మాటల్లో రానున్న కాలం మరింత ప్రేమాన్విత కాలం కాబోతున్నదనే సూచనలు కనిపించడం మొదలుపెట్టాయి. కేవలం నైతికత దగ్గరే ఆగిపోకుండా తాను కరుణామయుణ్ణి కూడా అని యెహోవా ప్రకటించడం మొదలుపెట్టాడు.

బహుదేవతలు ఏకేశ్వరుడిగా పరిణామం చెందే క్రమంలో మొదట ఒక నైతిక శాసనంగా ఆ తరువాత ఒక కరుణామయ మూర్తిగా మారిన ఈ పరిణామాన్ని మనం వేదకాలంతోనూ, బుద్ధుడి ఆవిర్భావంతోనూ పోల్చవచ్చు. ఋగ్వేదఋషులు ఈ ప్రపంచాన్ని ఒక నైతిక శాసనం పాలిస్తూ ఉన్నదనీ, దాన్ని ఋతం అనీ అన్నారు. ఉపనిషత్తులు, ఆ నైతికశాసనమే పరమసత్యం అని భావిస్తూ దాన్ని బ్రహ్మన్ అని అన్నాయి. అక్కడితో ఆగకుండా 'అది నువ్వే' అని కూడా అన్నాయి. కాని అటువంటి ఎరుక కలిగిన తర్వాత కూడా మనిషి తాను జీవించే జీవితాన్ని ఎల్లవేళలా పరిశుద్ధంగా ఉంచుకునే మార్గమెట్లా? ఆ విద్య, ఉపనిషత్తుల భాషలో ఆ పరావిద్య, దాన్నెలా పొందగలం? మనశ్శరీరాల్ని నియంత్రించుకోవడం ద్వారా, శీల, సమాధి, ప్రజ్ఞల ద్వారా అది సాధ్యపడుతుందని బుద్ధుడు చెప్పాడు. అయితే ప్రతి మనిషీ ఆ ప్రజ్ఞని సాధించుకుని తన తామసప్రవృత్తినుంచి బయటపడేదాకా తాను తిరిగితిరిగి బోధిసత్త్వుడిగా జన్మిస్తూనే ఉంటానని బుద్ధుడు చెప్పడం ఒక కరుణామయ వాగ్దానం.

తిరిగి మళ్ళా తొమ్మిది పది శతాబ్దాల్లో శంకరాచార్యుడు అంతిమ సత్యం బ్రహ్మన్ అని మాత్రమే నిర్ధారించినతరువాత, ఆ బ్రహ్మన్ ఈశ్వరుడు కాదనీ, ఆ నైతికసూత్రం వ్యక్తిగత రాగద్వేషాలకి అతీతమనీ చెప్పిన తరువాత మళ్ళా ఒక దయామయుడైన ఈశ్వరుడి అవసరం తలెత్తింది. ద్వైత, విశిష్టాద్వైత, కాశ్మీరు శక్తి–శివాద్వైతాలు ఆ అవసరాన్ని తీర్చడం, ప్రతి ఒక్క జీవికీ భగవదనుగ్రహం లభిస్తుందని చెప్పడం భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో మరొక కొత్త యుగానికి తలుపులు తెరిచింది.

యూదుల చరిత్రలో క్రీస్తు ఆగమనం అటువంటి కొత్త కాలం. ఆ ఆగమనాన్ని కీర్తనలు ముందే సూచిస్తున్నాయని సువార్తీకులు గుర్తుపట్టారు. పాతనిబంధననుంచి సువార్తల్లో ఎత్తి రాసుకున్న వాక్యాల్లో మూడు వంతులదాకా కీర్తనల్లో వాక్యాలే కావడం గమనించాలి. మత్తయి సువార్తలో పది సార్లు, యోహాను సువార్తలో తొమ్మిది సార్లు, మార్కు సువార్తలో నాలుగు సార్లు, లూకా సువార్తలో అయిదు సార్లు కీర్తనల ప్రస్తావనలు కనిపిస్తాయి. నేను ముందే చెప్పినట్లుగా యేసు శిలువపైన పలికిన చివరిమాటలు కూడా 22 వ కీర్తనలోని మొదటి మాటలే. దాదాపుగా ఈ ప్రస్తావనలన్నీ అయితే royal psalms లేదా messianic psalms. అయితే రాజాధిరాజుగా మారిన యెహోవా తన ప్రజలకు వాగ్దానం చేసిన రాజ్యం, ఆ వాగ్దత్త వసుంధర 'అక్కడుందనీ, ఇక్కడుందనీ అనకండి, అది మీలోనే ఉంది' (లూకా, 17:21) అని క్రీస్తు చెప్పడం కీర్తనలు కలగన్న సత్యానికి పతాకస్థాయి.

కాబట్టి కీర్తనల్లోని ధన్యవాద సమర్పణ గీతాలు, ప్రపంచ భక్తిసాహిత్యంలోనే ఒక సర్వోత్కృష్ట అధ్యాయం. అవి గొప్ప ఓదార్పు, ఒక బాసట, నిస్పృహ చెందిన మనుషులకి, కుటుంబాలకీ, జాతులకీ ఒక స్వస్థత, ఒక నిరుపమాన ధన్యత.

విలాపగీతాలన్నిటికీ ఒక నిర్మాణ నమూనా ఉందని చెప్పలేము గానీ, కృతజ్ఞతా సమర్పణ గీతాలకు మాత్రం ఒక నమూనాను మనం ఊహించవచ్చు. ఈ గీతాలన్నిటిలోకీ అతి చిన్న గీతమైన 117 వ కీర్తనని చూస్తే మనకి ఈ నిర్మాణం సులభంగా బోధపడుతుంది. చూడండి:

> సమస్త జనులారా, ప్రభువుని స్తుతించండి. సకలలోకప్రజలారా, ప్రభుమహిమ ఉగ్గడించండి.
>
> మనపట్ల ఆయన అనుగ్రహం చెక్కుచెదరనిది. మనపట్ల ఆయన నమ్మకం ఎన్నటికీ తరగనిది. స్తుతించండి ప్రభువుని నోరారా!

ఇందులో మొదటి భాగం ఒక పిలుపు. ప్రభువుని స్తుతించడానికి ఒక ఆహ్వానం. రెండవభాగం అలా ప్రభువుని ఎందుకు స్తుతించాలో కారణాలు వివరించడం. మూడో భాగం మళ్ళా మొదటి అహ్వానాన్ని మరోమారు ఉగ్గడించడం.

అంటే ఇది ఒక స్తుతి. స్తోత్రం. కేవలం మాటలు మాత్రమే కాదు, సంగీతవాద్యాలతో, మొత్తం సామూహికంగా పలికే ఒక ధన్యవాద తీర్మానం. అలా ఒక సమూహంగా యెహోవా పట్ల తమ కృతజ్ఞతని చాటుకోవడం ద్వారా వారంతా ఒక theophany కి, ఒక ఈశ్వరభావోద్వేగానికి, ఒక దివ్యపారవశ్యానికి లోనవుతున్నారు. అంటే దేవుడు మరెక్కడో లేడు, ఆ క్షణాన, ఆ సామూహిక హృదయసమర్పణలో, ఆ ఈశ్వరస్తుతి గీతాలాపనలోనే ఆయన ప్రత్యక్షమవుతున్నాడన్నమాట. యెహోవా ఒక జాతిని ఇస్రాయేలుగా తీర్చిదిద్దాడంటే, ఇదుగో, ఇలానే.

కీర్తనల్లో 8,19, 29, 33, 46–48, 65, 66, 68, 76, 84, 87, 93, 95–100, 103–104, 111, 113–14, 117, 122, 134–36, 145–50 ధన్యవాద గీతాలు, ఇవి కాక స్తోత్రాలుగానూ, ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేసే గీతాలుగానూ లెక్కించినవాటిని కూడా మనం ధన్యవాదగీతాలుగానే లెక్కపెట్టుకోవచ్చు.

ఏ ధన్యవాదమైనా అంతిమంగా ఒక స్తోత్రం. లలితా సహస్రనామాల్లో ఒక నామం 'స్తోత్రప్రియా' అనేది. సర్వేశ్వరుణ్ణి మనం ఇది కావాలనో లేదా నన్ను కాపాడు అనో

అభ్యర్థించకూడదు, నీకేం కావాలో ఆయనకు తెలుసు, నువ్వు చెయ్యవలసిందల్లా, ఆయనకి అనుక్షణం, అడుగడుగునా ధన్యవాదాలు సమర్పించుకోవడమే అని పెద్దలు చెప్తారు. కీర్తనకారులకి ఈ సంగతి తెలుసు. అందుకనే కీర్తనల్లో చివరికి వచ్చేటప్పటికి, 'స్తోత్రములు', 'స్తోత్రములు' అనే మాటలు తప్ప మరో మాట వినిపించదు, 148 వ కీర్తనలో లాగా.

6

కీర్తనలు దావీదు పేరు మీద ప్రసిద్ధికెక్కినప్పటికీ అన్ని గీతాలూ దావీదు పేరు మీద లేవు. 3-9, 11-32, 34-41, 51-65, 68-70, 86, 101, 103, 108-110, 122, 124, 131, 133, 138-145 గీతాలు అంటే మొత్తం డెబ్బై నాలుగు కీర్తనలు దావీదు కృతులుగా మనకి లభిస్తున్నాయి. అలాగని ఇవన్నీ దావీదు రాసాడనే అర్థంలోనే కాదు, దావీదుకి సంబంధించినవి అనే అర్థంలో కూడా. ఈ సంఖ్య నెమ్మదిగా 85 దాకా పెరిగింది కూడా.

దావీదు తర్వాత కనిపించే కీర్తన కారుల్లో కోరా పుత్రులున్నారు. వారు రాసినవిగా చెప్పే 42-49, 84-85, 87-88 కీర్తనలు సీయోను పర్వత ప్రాంతంలో ప్రాచీన యెరుషలేం సంప్రదాయంలో పుట్టి ఉంటాయని ఇప్పుడు పండితుల అంచనా.

50 వ కీర్తన, 73-83 కీర్తనలు అసఫ్ అనే ఒక దేవాలయ గాయకుడి పేరు మీద ఉన్నాయి. అతడూ అతడి పుత్రులూ ఒక ప్రవక్తల సంప్రదాయానికి చెందిన దేవాలయ వాద్యకారులూ, సంగీతకారులూ అయి ఉండవచ్చునని అందుకనే ఆ గీతాల్లో భగవంతుడి తీర్పు గురించీ, భవిష్యవాణి గురించీ, యెహోవా మహిమల గురించీ ఎక్కువ ఉద్ఘాటన ఉందని ఒక అభిప్రాయం.

అలాగే 39 వ కీర్తన, 62, 77 యెదుతున్ అనే ఆయన పేరుమీద, 89 వ కీర్తన ఈథన్ అనే పేరుమీద, 88 వ కీర్తన హెమాన్ అనే ఆయన పేరు మీద ఉన్నాయి. ఆ ముగ్గురు కూడా దేవాలయ గాయకులే. ఇక 72, 127 కీర్తనలు సొలోమోను పేరుమీద ఉన్నాయిగాని వాటికి సొలోమోను కర్త అని చెప్పలేం. అందులో 72 వ కీర్తన ప్రవాసానికి పూర్వపు కీర్తన, 127 తర్వాతి కాలపు కీర్తన. ఇక 90 వ కీర్తన మోషే పేరుమీద ఉన్నప్పటికీ దాన్నెవరూ మోషే కృతిగా భావించడంలేదు.

మొత్తం మీద సగానికి పైగా కీర్తనలు దావీదు పేరిటనే ఉన్నాయి. ఇటీవలి పరిశోధనలు దావీదు కర్తృత్వాన్ని ప్రశ్నిస్తున్నప్పటికీ, కొందరు పరిశోధకుల దృష్టిలో

దావీదు చారిత్రిక వ్యక్తి కాకపోయినప్పటికీ, ఒక ప్రశ్న మిగిలే ఉంటుంది. బైబిల్లో ఎందరో ప్రవక్తలు, ఎందరో కవులు, గాయకులు ఉండగా, వీటి కర్తృత్వాన్ని దావీదుకే ఎందుకే ఆరోపిస్తూ వచ్చారని.

అందుకు రెండు కారణాలు చెప్పవచ్చు. మొదటిది, దావీదు గొర్రెలకాపరిగా ఉన్నప్పుడు ఒక తంత్రీవాద్యం మీద భగవత్ సంకీర్తనం చేసేవాడనీ, సౌలు రాజు అస్వస్థతకు గురయినప్పుడల్లా దావీదు వచ్చి పాటలు పాడితే ఆ రాజుకి స్వస్థత చిక్కేదనీ బైబిలు చెప్తున్నందువల్ల. అంతేకాదు, మోషేతో యెహోవా కుదుర్చుకున్న మొదటి ఒడంబడిక మంజూషికని యెరుషలేం తీసుకువచ్చినప్పుడు దావీదు ఆ ఊరేగింపులో ముందు నిలబడి ఆనందంతో పాటలు పాడుతూ నాట్యం చేసాడని కూడా అతడి కథ చెప్తున్నది. అంత విస్పష్టమైన గాయకుడిగా బైబిల్లో మరే పాత్రా మనకు కనిపించదు.

ఇక రెండో కారణం మరింత లోతైనది.

పాతనిబంధనలో దావీదు కథ Samuel మొదటి, రెండవ గ్రంథాల్లోనూ, Kings గ్రంథంలో మొదటి అధ్యాయాల్లోనూ ఉంది. ఆ కథ చదివినవాళ్ళకి అంత నాటకీయమైన జీవితకథ బైబిల్లో మరొకటి లేదని అర్థమవుతుంది.

యోసేపు, మోషేలు కూడా దావీదు కనిపించినంత తీవ్రమానవీయంగా కనబడరు. దావీదు ఎంత బలవంతుడో అంత బలహీనుడు కూడా. అతడు తన జీవితకాలమంతా బయటి శత్రువులతో ఎంతో పోరాడేడో, తన ఇంటి శత్రువుల తోనూ, తన అంతశ్శత్రువుల తోనూ కూడా అంతగా పోరాడేడు. అంతః బహిస్సంగ్రామాలతో సంచరించే దావీదు కథ చదువుతున్నంతసేపూ మన ఒళ్ళు గగుర్పొడుస్తూనే ఉంటుంది. మనం అతణ్ణి అభిమానించాలో, అభిశంసించాలో తేల్చుకోలేంగాని, విస్మరించలేమని మాత్రం అర్థమవుతుంది.

కాని తనని నడిపించిన దైవం పట్ల అతడి విశ్వాసం ప్రశ్నించలేనిదిగా కనిపిస్తుంది, చివరికి అతడు తన దైవం పట్ల అపచారం చేసినప్పుడు కూడా. అతడి ముందు పాలన చేసిన సౌలూ, అత్యంత వివేకవంతుడ్కెన అతడి కొడుకు సొలోమోనూ కూడా దైవాజ్ఞని ఉల్లంఘించి దైవోపహతులైనప్పటికీ, వారి అభిశప్తతలో లేని తీవ్రత మనకి దావీదు జీవితంలో కనిపిస్తుంది.

అటువంటి జీవితంవల్లనే దావీదు భగవద్భక్తులకి ఒక ప్రాగ్రూపంగా కనిపిస్తాడు.

దేహానికీ, దైవానికీ మధ్య జీవితమంతా నలిగిపోయినవాడుగా కనిపిస్తాడు. ఒక భగవద్భక్తుడు తన జీవితంలో ఎన్ని విరుద్ధావస్థలకు లోనుకాగలడో అవన్నీ మనకి దావీదులో కనిపిస్తాయి. అందుకనే బహుశా, సామగీతాలకు ఒక కర్త అంటూ ఉంటే అందుకు దావీదుని మించిన అర్హుడెవరూ మనకి కనిపించరు.

దావీదు ఈ గీతాలు రాసాడని అనుకుంటున్నప్పుడు ఆ దావీదు ఒక నామవాచకం, ఒక సర్వనామం కూడా. ఎందుకంటే, ఈ గీతాల్లో వ్యక్తి విలాపాలు చాలాచోట్ల జాతివిలాపాలుగా కూడా వ్యక్తమయ్యాయనీ, అలానే జాతిదుఃఖం కూడా ఒక వ్యక్తి కంఠంలో వినిపిస్తూ ఉందని కూడా అనుకున్నాం. కాబట్టి ఇక్కడ దావీదు ఏకకాలంలో ఒక వ్యక్తీ, ఒక జాతీ కూడా. దావీదు అంటే 'ప్రియమైనవాడు' అని అర్థం. ప్రతి ఒక్క మనిషీ కూడా దావీదే. మనల్ని ఒక్కరినీ కూడా భగవంతుడు ఎంతో ప్రేమిస్తూనే ఉంటాడు. మన జీవితాల్లో, ఎన్నో సంక్షుభిత సమయాల్లో ఆయన ప్రేమ మనకి అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. అయినా కూడా ఆ నిత్యజాగృతిలో మనం నిలబడకుండా తొట్రుపడుతూనే ఉంటాం. మన దేహం, మన మనస్సు కల్పించే ఎన్నో ప్రలోభాల్లో ఎప్పటికప్పుడు కూరుకు పోతూనే ఉంటాం. మన జీవితాల్లో దేహానికీ, దైవానికీ; దేహానికీ, ధర్మానికీ మధ్య జరిగే నిరంతర సంగ్రామానికి దావీదు ఒక నమూనా. కాబట్టి ఈ గీతాలు రాయడం ద్వారా దావీదు మనందరి ఆర్తికీ ఒక గళాన్నిచ్చాడు. ఒకవేళ దావీదు ఈ గీతాలు రాయకపోయి ఉంటే నువ్వో నేనో తప్పకుండా రాసిఉండేవాళ్ళమే అని అనుకోడానికి నాకేమీ సందేహం లేదు.

త్యాగరాజ కీర్తనల్ని వచనంలోకి మార్చినప్పుడు భమిడిపాటి కామేశ్వరరావుగారు ఆ పుస్తకానికి 'త్యాగరాజు ఆత్మవిచారము' అని పేరుపెట్టారు. Psalms అధికభాగం డేవిడ్ రాసాడనే నమ్మకం ఉన్నందువల్ల ఈ కీర్తనల్ని నాకు దావీదురాజు ఆత్మవిచారం అనాలనిపిస్తున్నది.

దావీదు ఒక Godly sufferer. అంటే దేవుడు అప్పగించిన పని నెరవేర్చడం కోసం పుట్టినవాడు, కాని దేవుడి శత్రువుల చేతిలో చెప్పలేనన్ని ఇబ్బందులకి, కష్టాలకీ లోన్కైనవాడు. మళ్ళా క్రీస్తు అటువంటి Godly sufferer కాబట్టి, ఈ గీతాలు దావీదు పాడుకున్నప్పటికీ, ఇవి ప్రధానంగా దావీదు ఆర్తికీ, ఆత్మవిచారానికీ వ్యక్తీకరణలే అయినప్పటికీ, ఇవి క్రీస్తుని సూచించే కీర్తనలు కూడా. దావీదు సందర్భంలో ఇవి వర్తమానానికి సంబంధించినవి, క్రీస్తు పరంగా ఆగమగీతులు.

7

సామగీతాలకు కింగ్ జేమ్స్ బైబిలు తర్వాత కూడా మరెన్నో ఇంగ్లిషు అనువాదాలు వచ్చాయి. కొందరు వాటిని మూలవిధేయంగానూ, కొందరు స్వేచ్ఛగానూ అనువదించారు. ఇంగ్లిషు మహాకవి మిల్టన్ కూడా సామగీతాల్ని ఇంగ్లిషు ఛందస్సుల్లో అనువదించే ప్రయత్నం చేసాడు. కాని ప్రాయికంగా హీబ్రూ, ఇంగ్లిషు భాషలమధ్య ఉన్న భాషాపరమైన, ఛందో పరమైన విభేదాలవల్ల ఏ ఒక్క అనువాదం కూడా హీబ్రూలోని స్ఫూర్తిని, సమగ్రతని మనకి పూర్తిగా అందించలేదనే హీబ్రూ భాషావేత్తలు చెప్తున్నారు.

కాని భాష, ఛందస్సులకన్నా కూడా అతి పెద్ద సమస్య, సామగీతాల్లోని తాత్త్వికతకు సంబంధించిన సమస్య. ఆ గీతాల్ని కూరుస్తున్నప్పుడు ఆ గీతకర్తలు యూదు సంస్కృతికన్నా పూర్వకాలాలకు చెందిన మధ్యాసియా గీతాలనుంచి స్ఫూర్తి తెచ్చుకున్నారని ఇంతకు ముందు చెప్పుకున్నాం. ముఖ్యంగా కాంస్యయుగానికి చెందిన గీతాల్ని తమకు నమూనాలుగా తీసుకున్నారని కూడా చెప్పుకున్నాం.

ఆ గీతాల్లోని హీబ్రూ పదాలను మనం రెండువేల ఏళ్ళ క్రైస్తవ సంప్రదాయం, మతాచారాల నేపథ్యంలో అనువదించినప్పుడు ఆ మూలానికి పూర్తిగా న్యాయం చెయ్యలేమనేది ఇప్పుడు మనకి కలుగుతున్న మెలకువ. హీబ్రూ పండితుడు, అనువాదకుడు Robert Alter ఈ అనువాద సమస్యలను తన The Book of Psalms, A Translation with Commentary లో విపులంగా చర్చించాడు. ఆయన ఇచ్చిన రెండు ఉదాహరణలు మనకి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తాయి.

మొదటిది, Psalms ఇంగ్లిషు అనువాదాల్లో తరచు కనవచ్చే soul అనే పదం. దాని హీబ్రూ మూలానికి అసలైన అర్థం జీవం లేదా ప్రాణం. దాన్ని గ్రీకులోకి అనువదించినప్పుడు anima అని అనువదించడంతో గ్రీకు నుంచి ఇంగ్లిషు అనువాదకులు soul అనే సమానార్థకాన్ని తీసుకొచ్చారు. దాన్ని మనం తెలుగులో 'ఆత్మ' అని అనువదిస్తే, అది హీబ్రూ మూలానికి సమానార్థకం కాకపోగా అసలు అర్థం నుంచి సుదూరంగా జరిగిపోయినట్టు కూడా.

ఎందుకంటే, హీబ్రూ గీతకర్త మాట్లాడుతున్న జీవానికీ, ప్రాణానికీ, ఆత్మ అనగానే మనకు స్ఫురించే శాశ్వత ఆధ్యాత్మిక సత్యానికీ మధ్య చాలా అంతరం ఉంది. ప్రాచీన హీబ్రూ కవికి ఆత్మలాంటి పెద్ద పెద్ద భావనలు లేవు. జీవం, ప్రాణం, శ్వాస, ఊపిరి లాంటి భౌతిక-జైవిక పదజాలం మాత్రమే ఆ భావనకి న్యాయం చెయ్యగలదు.

అలాగే మరొక పదం, కింగ్‌జేమ్స్ వెర్షన్‌లో తరచు ఉపయోగించిన salvation అనే పదం. ఆ మాట వినగానే మనకు స్ఫురించేది ఆధ్యాత్మికవిముక్తి, మోక్షం. కాని హీబ్రూ కవి మాట్లాడుతున్నది విడుదల గురించి. ఉదాహరణకి నువ్వొకరికి అప్పుపడ్డావు. జీవితకాలం వెట్టి చాకిరీ చేసినా కూడా ఆ అప్పుతీరదు. నిన్నెవరేనా ఆ అప్పునుంచి విడిపించారనుకో, అప్పుడు నీకు కలిగే విడుదల లాంటిదే సామగీతాలు మాట్లాడే విడుదల.

ఇలా హీబ్రూ గీతాల్లోని ముఖ్య పదాలు, ముఖ్యభావనలు ఒక మనిషి తన ఇహలోక జీవితం నిరపాయకరంగా కొనసాగాలని కోరుకోడానికి సంబంధించినవి తప్ప పరలోకం గురించిన పాకులాటలు కావు. దాదాపుగా మన ఋగ్వేదసూక్తాలది కూడా ఇదే పరిస్థితి. ఋగ్వేదఋషులు కోరుకున్నది నలుగురు కలిసి పనిచేస్తూ, నూరు శరత్తులు బతకాలని మాత్రమే. ఇహలోకాన్ని దాటిన పరలోకం మీద ఋగ్వేదానికి ఏమంత ఆసక్తి లేదు. ఆ అంశంలో ఋగ్వేదంలోని ఇంద్ర, అగ్నిసూక్తాలకీ, ఈ గీతాలకీ మధ్య ప్రాయికంగా ఏమంత పెద్ద తేడా లేదు. వాటిని secular hymns అన్నా కూడా అతిశయోక్తి కాదు.

ఈ మెలకువతో నేను Psalms ని తెలుగు చేయడానికి పూనుకున్నాను. ఈ ప్రపంచం ప్రేమించదగ్గదిగానూ, నీతిబద్ధంగానూ, న్యాయసమ్మతంగానూ ఉండాలని కోరుకున్న గీతాలు కాబట్టి వీటిని చదువుతుంటే పరిశుభ్రమైన జలాల్ని తాకినట్టూ, తాజాపరిమళాలు మనమీంచి వీచినట్టూ నాకు అనిపిస్తున్నది.

నేను ఈ గీతాల్ని అనువదించాలనుకున్నప్పుడు పది పన్నెండు ద్విపదలకన్నా మించని గీతాల్నే ఎంచుకున్నాను. చిన్న గీతాలను అనువదించినప్పుడు వాటి స్ఫూర్తిని గ్రహించడం సులభం అనే ఉద్దేశ్యంతో వాటినే ఎంచుకున్నాను.

మొత్తం 150 గీతాలకు గాను, 64 గీతాలు అనువాదం చేసాను. ప్రధానంగా 10 లేదా 12 ద్విపదలకు మించని గీతాల్నే ఎన్నుకోవడంతో సుదీర్ఘమైన గీతాల్ని అనువాదం చెయ్యలేదు. కాని పాతనిబంధన కాలం నాటి భక్తిగీతాల స్వరూపస్వభావాల్ని తెలుసు కోవడానికి ఈ సముచ్చయం చాలనుకుంటున్నాను. మరీ ముఖ్యంగా, సామగీతాలు అనగానే అందరికీ గుర్తొచ్చే 22 వ కీర్తన, 23 వ కీర్తన, 137 వ కీర్తన ఇందులో ఉన్నాయి కాబట్టి, మొత్తం సామగీతాలసారాంశం ఈ అనువాదాల ద్వారా పరిచయ మయినట్టే అనుకుంటున్నాను.

తెలుగులో అచ్చయిన మొదటిగ్రంథం బైబిలు అని మనకు తెలుసు. పాతనిబంధనను పద్ధెనిమిదోశతాబ్దంలో తెలుగు చేసిన తొలితరం అనువాదకులు హీబ్రూ భాషలోని

పవిత్రతకూ, కింగ్ జేమ్స్‌వెర్షన్ లోని సూటిదనానికీ సమానమైన తెలుగును అన్వేషించడంలో చేసిన కృషి నిరుపమానమైనది.

కాని అనువాదాలు ప్రతి వందేళ్ళకూ కాదు, ప్రతి పదేళ్ళకూ ఒకసారి రావలసి ఉంటుంది. గత రెండువందల ఏళ్ళల్లో తెలుగు భాష స్వరూప స్వభావాలు ఊహించ లేనంతగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా, తెలుగులో ఆధునికకవిత్వం వికసించిన తరువాత, ఆ భాషావికాసాన్ని దృష్టిలో పెట్టుకుని బైబిలుకు మరికొన్ని కొత్త అనువాదాలు వచ్చి ఉండవలసింది.

కాని ఆశ్చర్యం! నా చేతుల్లోకి మరొక సరికొత్త అనువాదం వచ్చింది. ఈ గీతాల్ని అనువదించడానికి సహకారిగా ఏ గ్రంథాలైనా దొరుకుతాయేమోనని సికింద్రాబాదులో ఒక పుస్తకాలషాపులో అడుగుపెట్టినప్పుడు, అక్కడి పిల్లవాడు, బైబిలు ప్రచురణల ఎగ్జిబిషను ఒకటి నడుస్తూ ఉందనీ అక్కడ నాకు ఉపకరించే గ్రంథాలు దొరకవచ్చుననీ చెప్తే, ఆ మధ్యాహ్నవేళ వడివడిగా ఆ ఎగ్జిబిషన్‌కి పరుగెత్తాను. అక్కడ 'వ్యాఖ్యానసహిత పవిత్రగ్రంథం' కనిపించింది.

గ్రేస్ మినిస్ట్రీస్ వారూ, ఇండియా బైబిలు లిటరేచర్ వారూ కలిసి ప్రచురించిన ఆ వ్యాఖ్యానసహిత పవిత్రగ్రంథం 1993లో మొదటిసారి ప్రచురించబడింది అనీ, పదిహేడవ ముద్రణ 2022 లో వచ్చిందనీ తెలిసింది. అన్నిటికన్నా ఆశ్చర్యమేమిటంటే ఈ కొత్త అనువాదాన్ని చేసింది ఒక అమెరికన్.

జార్జి రాబర్ట్ క్రో (1924-2007) అనే ఆ అమెరికన్ హీబ్రూ, గ్రీకు బైబిలు మూల గ్రంథాలనుంచి ఈ తెలుగు అనువాదాన్ని రూపొందించాడు. తెలుగు అనువాదం పూర్తిచేసిన రెండువారాలకి ఆయన పరమపదించాడు. 'బాబ్ క్రో దేవుని పొలంలో విత్తబడిన గోధుమ గింజ. అత్యుత్తమంగా ఫలించారు' అని గ్రేస్ మినిస్ట్రీస్ పుస్తకానికి రాసిన ముందుమాటలో ఆయనకు నివాళి అర్పించారు.

బాబ్ క్రో అనువాదం నన్ను అడుగడుగునా ఆశ్చర్యపరుస్తూ వచ్చింది. ఎన్నో పదాలకు ఆయన సాధించుకున్న తెలుగు సమానార్థకాలు దైవస్ఫురణ తప్ప మరేమీ కాదని అనిపించింది. తెలుగు మాతృభాషగా, అపారమైన తెలుగుసాహిత్యం చదివి, అనువాద రంగంలో ఇరవై ఏళ్ళకు పైగా కృషి చేస్తున్న నాకు స్ఫురించని ఎన్నో అద్భుత పద ప్రయోగాలు, వాక్యసంయోజనాలు ఆయన అనువాదంలో కనబడి నన్ను విభ్రాంతికి గురిచేసాయి.

భాష, ఒక నైపుణ్యం అని అనుకునేదానికన్నా ముందు, ఒక భావావేశం అనీ, దివ్యావేశం అనీ నాకు మరో మారు ఎరుకపడింది. స్వర్గస్థుడైన ఆ భగవద్భక్తుడికి ఈ సందర్భంగా నమోవాకాలు చెల్లించుకుంటున్నాను.

చదివినప్పుడు చాలా సరళంగానూ, సూటిగానూ కనిపిస్తూ అనువదించడానికి పూనుకున్నప్పుడు కొత్త కొత్త సమస్యలు కనిపించడం ప్రాచీన గ్రంథాలు, ముఖ్యంగా దైవగ్రంథాలు మనకు పెట్టే పరీక్ష. వేదసూక్తాల విషయంలో ఇది ఎన్ని అభిప్రాయభేదాలకు తావిచ్చిందో మనకు తెలుసు. పాతనిబంధనలోని కీర్తనల విషయంలో కూడా ఈ సమస్య జటిలంగా ఉందని నాకు అనువాదం మొదలుపెట్టేక తెలిసింది.

హీబ్రూగానీ, గ్రీకు గానీ రాని నాబోటి వాడికి, ఆ కీర్తనలోని కొన్ని పదప్రయోగాల, కొన్ని వాక్యనిర్మాణాల అంతరార్థం అంత సులువుగా బోధపడదు. ఇంగ్లిషు బైబిలు అక్కడ ఏ విధంగానూ సహకరించదు. ఆ సమస్యనుంచి నన్ను బయటపడేసిన గ్రంథం డబ్ల్యు.డబ్ల్యు. నార్టన్ వారు ప్రచురించిన The Book of Psalms. ఆ అనువాదకుడు Robert Alter హీబ్రూ పండితుడు. కీర్తనలకు అనువాదంతో పాటు సమస్యాత్మకమైన ప్రతి ఒక్క పదానికీ ఆయన విపులమైన వివరణలు అందించాడు. అందుకనే ఆ అనువాదాన్ని సీమస్ హేనీ వంటి మహాకవి Godsend అని అభివర్ణించాడంటే ఆశ్చర్యం అనిపించదు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న తెలుగు బైబిలు అనువాదాల్లో కీర్తనల అనువాదంలో స్పష్టత కొరవడిన తావుల్లో నా అనువాదం స్పష్టతను సాధించుకుంటే అందుకు కారణం Alter అనువాదమే అని చెప్పగలను.

8

నా తొలి ఉపాధ్యాయిని మా శరభవరం పంచాయితీ సమితి ఎలిమెంటరీ స్కూల్లో మాకు చదువుచెప్పిన వజ్రమ్మ పంతులమ్మగారు. ఆమె నిజమైన క్రైస్తవురాలు. ఆమె ఇంట్లోనే మొదటిసారి నేను Last Supper బొమ్మ చూసాను. ఆమె మాకు పాఠ్యపుస్తకాల్తో పాటు మహాభారతం కూడా చెప్పారు. అలాగే పాతనిబంధనలోని యోసేపూ, అతడి సోదరుల కథ కూడా చెప్పారు.

కాని ప్రతిరోజూ బడి తెరవగానే మాతో చేయించిన ప్రార్థన ఏ సగుణ దేవత ప్రార్థనా కాదు. 'నమస్తే సతేతే జగత్కారణాయ, నమస్తే చితే సర్వలోకాశ్రయాయ' అంటో మొదలయ్యే సర్వేశ్వర ప్రార్థన అది. ఆ దేవుడు ఏ మతానికీ చెందనివాడు, అన్ని

మతాలవారూ స్తుతించదగ్గవాడు. ఈ గీతాల్ని అనువదిస్తున్నప్పుడు, ఇందులో, గీతకర్తలు, పదే పదే ప్రభువనీ, దైవమనీ, భగవంతుడనీ పిలుస్తున్నది ఆ జగత్కారణుణ్ణే, ఆ సర్వ లోకాశ్రయుణ్ణే అని నాకు తెలుస్తూ ఉన్నది.

ఏమీ తెలియని ఆ పసివయసులో ఆ సర్వేశ్వర స్ఫూర్తిని నాకు కలిగించిన మా వజ్రమ్మ పంతులమ్మగారి దివ్యస్మృతికి ఈ గీతాలు సమర్పిస్తున్నాను. ఈ గీతాలను ఇట్లా అనువదించడానికి కారణమైన ఫాదర్ అలెగ్జాండర్ గారికి సవినయ నమస్సుమాంజలి.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**
12-1-2023

ఈశ్వర స్తుతిగీతాలు

ఏటి ఒడ్డున నాటిన చెట్టు

దైవానికి దూరంగా ఉండేవాళ్ళ తోవ తొక్కని మనిషి ధన్యుడు. దుర్మార్గులతో కలిసి నిలబడనివాడు ధన్యుడు. దైవం తిరస్కరించినవాళ్ళు కూచున్నచోట కూచోని వాడు ధన్యుడు.

ప్రభు వాక్యాన్ని అనుసరించడంలోనే అతడికి సంతోషం. అహర్నిశలు ప్రభుశాసనం మీదనే తన దృష్టి లగ్నమై ఉంటుంది.

అతడు ఏటి ఒడ్డున నాటిన చెట్టులాంటివాడు. ఆ చెట్టు ఋతువు రాగానే ఫలిస్తుంది. దాని ఆకులు ఎప్పటికీ వాడవు. ప్రతి ఒక్కపనిలోనూ అతడికి జయం సిద్ధిస్తుంది.

దైవానికి దూరమైనవాళ్ళ సంగతి వేరే. వాళ్ళు ఊకలాంటి వాళ్ళు. గాలి వాళ్ళని చెదరగొట్టేస్తుంది.

మనం చేసిన పనులకి ఒకనాటికి మనం బాధ్యత పడవలసి వచ్చినప్పుడు, దైవంతోడులేని వాళ్ళు నిలబడలేరు. సజ్జనుల సన్నిధిలో దుర్జనులకు చోటు దక్కదు.

సత్యవంతుల దారి దైవం సమ్మతించిన దారి. దైవాన్ని తప్పి నడిచేవాళ్ళది నశించే దారి.

కీర్తనలు, పాతనిబంధన, 1

విముక్తి నిజంగా ఒక దైవక్రియ

ప్రభూ, చూడు! నా శత్రువులెందరో! నన్ను బాధపెట్టేవాళ్ళ సంఖ్య ఎట్లా పెరుగుతోందో!

నామీద విరుచుకుపడేవాళ్ళు కూడా తక్కువేమీ లేరు. వాణ్ణి దేవుడు రక్షించడంటో నా గురించి చాలామందే చెప్తున్నారు.

కాని ప్రభూ, నువ్వు నాకు రక్షణవి. నా యశస్సువి. నన్ను తలెత్తుకు తిరిగేట్టు చేసేవాడివి.

ఎలుగెత్తి ఆయనతో మొరపెట్టుకున్నాను. ఆయన తన పవిత్ర శిఖరమ్మీంచి నన్ను విన్నాడు.

నేను మేనువాల్చాను, నిద్రించాను. మేల్కొన్నాను. ప్రభువు నన్ను నిలబెట్టాడు.

నా చుట్టూ పదివేలమంది మోహరించినా నాకు భయం లేదు.

ప్రభూ, మేలుకో! నా భగవంతుడా నన్ను రక్షించు. నువ్వు నా శత్రువులందరి దవడ ఎముకలు ధ్వంసంచేసావు. దైవాన్ని తప్పినడుచుకునేవాళ్ళ పళ్ళు రాలగొట్టావు.

విముక్తి నిజంగా ఒక దైవక్రియ. నీ వాళ్ళందరిమీదా నీ కృప వర్షిస్తూనే ఉంటుంది.

కీర్తనలు, పాతనిబంధన, 3

కోతకాలం రాగానే

నేను పిలిచినప్పుడు, నా తండ్రీ, నన్నుగన్నవాడా, నా మొరాలించు. నన్ను నిరాశానిస్పృహలనుంచి నుంచి బయటపడేసావు. నా మీద దయ చూపు, నా ప్రార్థనలు పట్టించుకో.

మనుష్యజనులారా! ఎన్నాళ్ళు మీరిట్లా నా ప్రతిష్టకి తలవంపులు తెస్తుంటారు? ఎన్నాళ్లపాటు మీరిట్లా పనికిమాలినవాటిని ప్రేమిస్తారు, అసత్యాన్ని అభిమానిస్తారు?

నాకు తెలుసు, ఎవరు దైవానికి దగ్గరో, వారికోసం ప్రభువు తనలో కొంతచోటు వదిలిపెడతాడు. పిలవగానే దేవుడు నా పిలుపు వింటాడు.

చింతించండి, తప్పులు చెయ్యకండి, ఇంకా శయ్య మీద పరున్నప్పుడే మీ హృదయంలో ఆయన్ని తలచుకోండి. నిశ్చింతగా ఉండండి.

మీ ఆహుతులు సత్యసమ్మతంగా ఉండేట్టు చూసుకోండి.ప్రభువుపైన పూర్తి విశ్వాసం నిలుపుకోండి.

మాకు ఏది మంచిదో ఎవరు చెప్తారు అంటారు చాలామంది. ప్రభూ, నీ సాక్షాత్కార ప్రకాశాన్ని మాలో ప్రతిఒక్కరిమీదా ప్రసరింప చెయ్యి.

కోతకాలం రాగానే వాళ్ల ధాన్యరాశులూ, ద్రాక్షారసాలూ పొంగిపొర్లిన దానికన్నా మిన్నగా నా హృదయాన్ని సంతోషపు వెల్లువతో నింపావు.

ఇక ప్రశాంతిగా మేనువాలుస్తాను, నిద్రిస్తాను, ప్రభూ, నా యోగక్షేమాలు నీ చేతుల్లోకి తీసుకున్నావని నాకు తెలుసు.

కీర్తనలు, పాతనిబంధన, 4

నన్ను తిరస్కరించకు ప్రభూ

నన్ను తిరస్కరించకు ప్రభూ, నీ ఆగ్రహంలో. నా పట్ల నీకు భరించలేనంత అయిష్టం కలుగుతున్నా కూడా నన్ను ఖండించకు.

నా మీద దయ చూపించు ప్రభూ, నేను దుర్బలుణ్ణి. నా ఎముకలు రుజాగ్రస్త మయ్యాయి, ప్రభూ, నన్ను స్వస్థపరచు.

చెప్పలేనంత గొప్ప కష్టంతో నా ఆత్మ నలిగిపోతోంది, కాని నువ్వు, నా ప్రభూ– ఎన్నాళ్ళింకా?

తరలి రా ఓ ప్రభూ, నన్ను బయటపడెయ్యి! కనీసం నీ దయ చూపించడానికేనా నన్ను బయటపడెయ్యి!

నేను మరణించేక ఇంక నీ గురించి తలుచుకోడానికెవరుంటారు? సమాధుల్లోంచి నీకు కృతజ్ఞతలెవరు ప్రకటిస్తారు?

మూలిగీ మూలిగీ నేను అలిసిపోయేను. రాత్రంతా నా శయ్యలో నేను అశ్రువుల్లో ఈదులాడుతోనే ఉన్నాను. ఆగని కన్నీళ్ళతో నా పక్కబట్టలు తడిసిపోయేయి.

అంతులేని దుఃఖంతో నా చూపు మందగించింది, నా శత్రువుల్ని చూసి అది రోజురోజుకీ బలహీనపడుతున్నది.

ఓ క్రూరాత్ములారా, నా దగ్గర్నుంచి దూరంగా పొండి. నేను ఏడుస్తున్న చప్పుడు ప్రభువు చెవిన పడింది.

నా ప్రభువు నా విన్నపం అవధరించాడు, నా ప్రభువు నా ప్రార్థన స్వీకరిస్తాడు.

నా శత్రువులంతా కుంచించుకుపోదురుగాక, ఇక్కట్ల పాలవుదురు గాక! ఒక్కసారిగా
వెన్ను చూపి వాళ్ళు భరించలేనంత అవమానంలో కుంగిపోదురుగాక!

కీర్తనలు, పాతనిబంధన, 6

నీ నామం సర్వోన్నతం

ఓ ప్రభువా, ఈ సమస్తభూమండలం మీద నీ నామం సర్వోన్నతం. ద్యులోకసీమను దాటికూడా విస్తరించింది నీ వెలుగు.

పురిటిగదుల్లో పొత్తిళ్ళలో శయనించే బిడ్డల్లో, పసిపాపల నోటితో జయం పలికించావు. నీ శత్రువులనుంచి కాపాడావు. విరోధుల్నీ, పగతీర్చుకోడానికి పొంచిఉండేవాళ్ళనీ నోరెత్తకుండా చేసావు.

నువ్వు నివసించే స్వర్గధామాన్నీ, నీ అంగుళులు రూపొందిస్తున్న సృష్టినీ, నువ్వు నియమించిన చంద్రతారకల్నీ సంభావించినప్పుడు

ప్రభూ, నీ తలపుల్లో కదలాడుతున్న మనిషి ఎంత? ఎవరికోసం దిగివస్తున్నావో ఆ మనిషి ఎంతటివాడు?

దేవదూతలకన్నా ఒకింత తక్కువగానే అతణ్ణి సృష్టించావు, కాని యశోమకుటంతో, గౌరవంతో అతడి శిరసును అలంకరించావు.

నీ చేతుల్తో రూపొందించిన కార్యాలన్నిటిమీదా అతడికి ఆధిపత్యాన్నిచ్చావు, సమస్త విషయాల్నీ అతడి చరణాల కింద పరిచిపెట్టావు.

ఎడ్లు, గొర్రెలు- సమస్తజంతుజాలం, గాల్లో ఎగిరే పక్షులు, సాగరజలాల్లో ఈదులాడుతూ పయనించే చేపలు- సమస్తం.

ఓ ప్రభూ, మా ప్రభువా, సమస్త భూమండలం మీద నీ నామం ఎంత సర్వోన్నతం!

కీర్తనలు, పాతనిబంధన, 8

దేవుడు సత్యవంతుడు కాబట్టి

నేను ప్రభువును నమ్ముకున్నవాణ్ణి. ఒక పక్షిలాగా కొండమీదకి ఎగిరిపొమ్మని మీరు నాకెట్లా చెప్తారు?

'చూడు దుర్మార్గులు విల్లు వంచారు, శరం ఎక్కుపెట్టారు, సత్యవంతులు మీద దొంగ చాటుగా దాడిచెయ్యబోతున్నారు.

పునాదుల్నే ధ్వంసం చేస్తే నీతిమంతులు ఏమి చెయ్యగలుగుతారు?' అని మీరంటారు

ప్రభువు తన పవిత్రాలయంలో ఉన్నాడు, ఆయన సింహాసనం స్వర్గంలో ఉంది, ఆయన కనిపెట్టుకుని ఉన్నాడు, ఆయన చూపులు వాళ్ళని పరికిస్తున్నాయి.

ప్రభువు నీతిమంతుల్ని పరీక్షిస్తుంటాడు. దుష్టుల్నీ, హింసాకాముకుల్నీ ద్వేషిస్తాడు.

దుర్మార్గుల మీద నిప్పులు కురిపిస్తాడు. వాళ్ళ పానపాత్రలో గంధకమూ, అగ్నీ కురిపిస్తాడు. వడగాడ్పులు వర్షిస్తాడు.

దేవుడు సత్యవంతుడు కాబట్టి సత్యవంతుల్నే ప్రేమిస్తాడు. నీతిమంతుల్నే కటాక్షిస్తాడు.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 11

పుటం పెట్టిన పరిశుద్ధమైన వెండి

రక్షించు ప్రభూ, నీతిమంతులు తుడిచిపెట్టుకు పోబోతున్నారు. మనుషుల మధ్యనుంచి విశ్వాసులు కనుమరుగు కాబోతున్నారు.

ప్రతి ఒక్కడూ పక్కవాడితో సోమరి సల్లాపాలు మొదలుపెట్టాడు, ఎంతసేపు చూడు, మెరమెచ్చులు, పైకి ఒక మాట, లోపల ఒక మాట.

ప్రతి మనిషికీ రెండు గొంతుకలు. ఊరికే పొగిడే ప్రతి పెదవినీ ప్రభువు కత్తిరించెయ్యాలి. ప్రగల్భాలు పలికే ప్రతి నాలుకనీ చీరెయ్యాలి.

'మా నాలుక మా ఇష్టం, మా పెదవులు, మా సొంతం, ప్రభువెవ్వరు మామీద పెత్తనం చెయ్యడానికి' అని అంటారా?

'ఎందుకంటే మీరు బీదల్ని దోచుకుంటున్నారు కాబట్టి, దీనులు దుఃఖిస్తున్నారు కాబట్టి" అంటాడు ప్రభువు, 'వాళ్ళకోసం రాబోతున్నాను, నాకోసం ఎవరు తపిస్తున్నారో వాళ్ళ రక్షణ చూసుకుంటాను' అంటాడు ఆయన.

ప్రభువు మాట్లాడే మాటలు అత్యంత నిర్మలమైనవి. ఏడు సార్లు కాల్చి పుటం పెట్టిన పరిశుద్ధమైన వెండి లాంటివి.

ప్రభూ, వారిని కాపాడు, ఈ తరం నుంచి కాచి రక్షించు. చుట్టూ నీచత్వం పెరిగే కొద్దీ దుర్మార్గులు నలుదిక్కులా విచ్చలవిడిగా తిరుగుతున్నారు.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 12

ఎంతకాలం ప్రభూ?

ఎంతకాలం ప్రభూ? ఈ దీనుణ్ణి ఎంతకాలం దూరం పెడతావు? ఎన్నాళ్ళు నన్ను నీ సమక్షం నుంచి దూరంగా పెడతావు?

ఎన్నాళ్ళు నన్ను నేను ఓదార్చుకుంటూ ఉండాలి? ఎన్నాళ్ళిట్లా ప్రతిరోజూ నా హృదయం దుఃఖార్తిభరితం కావాలి? ఎన్నాళ్ళు నా శత్రువు నా మీద విర్రవీగుతుండాలి?

ఓ ప్రభూ, నా తండ్రీ, నా మొరాలకించు, నా విన్నపాలు విను, నా కళ్ళకు వెలుగునివ్వు. లేకపోతే మరణంలాంటి నిద్రలోనే నేనిట్లా కూరుకుపోయేట్టున్నాను.

లేదనుకో, నన్ను అణచేసానని నా శత్రువు మిడిసిపడుతుంటాడు. నేను పడిపోయినప్పుడల్లా నన్ను బాధపెట్టేవాళ్ళు పొంగిపోతుంటారు.

కాని నాకు నీలోనే నమ్మకం, నీ దయలో. నువ్విచ్చే విముక్తిలోనే నా హృదయానికి సంతోషం.

నా మీద అపరిమిత దయావర్షం కురిపించిన ప్రభువును స్తుతిస్తో నేను జయగీతాలు పాడుకుంటాను.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 13

దైవసన్నిధిలోనే నా దేశానికి విముక్తి

మూర్ఖుడు తనకు తాను చెప్పుకుంటాడు దేవుడు లేడని. వాళ్ళంతా భ్రష్టులు. భరించలేని పనులు చేస్తుంటారు. మంచిపనులు చేసేవాడు ఒక్కడు కూడా లేడు వాళ్ళల్లో.

ప్రభువు స్వర్గంలో ఆసీనుడై మనుష్యసంతతి చేసే పనులు చూస్తూనే ఉన్నాడు. ఒక్కళ్ళయినా తనని అర్థం చేసుకునేవాళ్ళున్నారా, తనకోసం తపించేవాళ్ళున్నారా అని వెతుకు తుంటాడు.

వాళ్ళంతా ఆయన్నుంచి ముఖం చాటేసారు. మొత్తం కలిసికట్టుగా భ్రష్టులయ్యారు. మంచిచేసేవాడు వాళ్ళల్లో ఒక్కడు కూడా లేడు. ఒక్కడంటే ఒక్కడు కూడా లేడు.

రొట్టెలు తిన్నట్టు నా మనుషుల్ని తినేస్తున్న ఆ దుర్మార్గులకి నిజంగా తెలివి లేదా? వాళ్ళెందుకని ప్రభువుని తలుచుకోరు?

ఘోరభయం వాళ్ళకోసం కాచుకుంది. ఎందుకంటే దేవుడు వహించేది సత్యవంతుల పక్షం కాబట్టి.

మీరు బీదసాదల ఉద్దేశాల్ని గేలిచేస్తారు, కాని భగవంతుడు వాళ్ళకి రక్షణగా నిలబడతాడు.

దైవసన్నిధిలోనే నా దేశానికి విముక్తి లభిస్తుంది. ప్రభువు నా జనుల కడగండ్లు తీర్చిన రోజున నా దేశం పులకిస్తుంది, నా ప్రజలు హర్షిస్తారు.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 14

వాళ్ళు ధీరులు

ప్రభూ, నీ గుడారంలో తలదాచుకోడానికి తగినవాళ్ళెవ్వరు? పవిత్రమైన నీ కొండమీద నివసించడానికి యోగ్యులెవ్వరు?

వేలెత్తి చూపలేని విధంగా ఎవరు నడుచుకుంటారో, హృదయంలో సత్యానికి ఎవరు కట్టుబడి ఉంటారో, ఎవరు నీతితప్పక నడుస్తారో,

తోటిమనిషిని నిందించని వాళ్ళెవరో, ఎవరు పొరుగువాడికి హానితలపెట్టరో, తన మిత్రుడి పట్ల శతృత్వం వహించనివారెవరో.

ఎవరు దుర్మార్గుల్ని ఈసడించుకుంటారో, ప్రభువుని నమ్ముకున్నవాళ్ళని గౌరవిస్తారో. తమకి నష్టం వాటిల్లినా సరే ఆడినమాటకు కట్టుబడి ఉండేదెవరో

ఎవరు తమ సొమ్ముతో వడ్డీవ్యాపారం చెయ్యరో, అమాయకులకు వ్యతిరేకంగా లంచం ముట్టరో, వాళ్ళు ధీరులు, వాళ్ళనెవ్వరూ ఇసుమంతైనా కదిలించలేరు.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 15

నా దేవా, నా దేవా!

నా దేవా, నా దేవా, నన్నెందుకు వదిలిపెట్టేసావు? నన్ను రక్షించడానికి ఎందుకు వెనకాడుతున్నావు? ఎందుకు నా మొరాలకించడం లేదు నువ్వు?

నా దేవా, ప్రది దినమూ విలపిస్తున్నాను, కాని నువ్వు జవాబివ్వడం లేదు, ప్రతి రాత్రీ విలపిస్తున్నాను, కాని విశ్రాంతి దొరకడం లేదు.

అత్యంత పరిశుద్ధుడిగా అభిషిక్తమయినవాడివి నువ్వు. సమస్త ఇస్రాయేలు స్తుతిస్తున్నది నిన్నే.

మా పూర్వీకులు నీలోనే నమ్మకం పెట్టుకున్నారు, వాళ్ళ విశ్వాసానికి తగ్గట్టే నువ్వు వాళ్ళ చెరవిడిపించావు.

నీకే వాళ్ళు మొరపెట్టుకున్నారు, బయటపడ్డారు, నిన్నే నమ్మారు, అవమానాలు తప్పించుకున్నారు.

ఇక నేనంటావా? ఒక క్రిమిని, మనిషిని కాను, ప్రతి ఒక్కరూ నన్ను తిరస్కరించేవారే, ప్రజల నిర్లక్ష్యానికి గురైనవాణ్ణి.

నన్ను చూసినవాళ్లంతా ఎగతాళి చేసేవాళ్ళే. తలలు అడ్డంగా ఊపుతూ, నా మీద నిందలు కురిపించేవాళ్ళే.

ప్రభువుని నమ్ముకున్నాడు వాడు, మరి ఆ ప్రభువెలా రక్షిస్తాడో చూద్దామంటారు వాళ్ళు. ఆ ప్రభువునే కదా స్తుతిస్తాడు, ఆ ప్రభువే వచ్చి వాణ్ణి బయటపడేయాలి అని అంటారు.

నా తల్లిగర్భం నుండి నన్ను వెలికి తీసింది నువ్వే. నా తల్లి స్తన్యమిస్తున్నప్పుడే నువ్వు నన్ను పూర్తిగా నమ్మావు.

పుట్టుకతోనే నేను నీ పాలపడ్డాను. తల్లిగర్భంలో ఉన్నప్పుణ్ణుంచే నువ్వు నా దేవుడివని అనుకున్నాను.

నా నుంచి దూరంగా జరక్కు. విపత్తు మీద మీదకొస్తున్నది, నాకు సాయం చెయ్యడానికెవరూ లేరు.

ఎన్నో వృషభాలు నన్ను చుట్టు ముట్టాయి, బషాన్ నగరపు వృషభాలు నన్ను చుట్టుముట్టాయి.

మీద పడి చీల్చి చెండాడడానికి సింహాలు గర్జిస్తూ నా మీద నోరు తెరిచాయి.

నేను నీరుకారిపోతున్నాను, నా ఎముకల కీళ్ళు సడలిపోయాయి. నా హృదయం మైనంగా మారిపోయింది, అది నాలోపల్లోపలనే కరిగిపోయింది.

నా నోరు కుండపెంకులాగా ఎండిపోయింది, నా నాలుక అంగిట్లోనే అతుక్కుపోయింది, నువ్వు నన్ను మృత్యుధూళిలో పడుకోబెట్టావు.

కుక్కలు నన్ను చుట్టు ముట్టాయి, క్రూరాత్ముల గుంపు నన్ను చుట్టుముట్టింది, వాళ్ళు నా చేతుల్నీ, పాదాల్నీ చీరేస్తున్నారు.

నా ఎముకలన్నీ బయటికొచ్చేసాయి, మనుషులు నన్ను ఆకలిగొన్న చూపుల్తో పరికిస్తున్నారు.

వాళ్ళు నా వస్త్రాల్ని తమలొ తాము పంచుకుంటారు, నా అంగీ కోసం చీట్లు వేసుకుంటారు.

కాని, ప్రభూ, నువ్వు నాకు దూరం కాకు, నువ్వే నా బలం, నన్ను రక్షించడానికి త్వరపడు.

నన్ను కత్తివేటు నుంచి తప్పించు, నా విలువైన జీవితం కుక్కలపాలు కాకుండా చూడు.

నన్ను సింహాల నోటినుంచి రక్షించు, మదించిన వృషభాల కొమ్ముల నుంచి కాపాడు.

నీ పేరు నా ప్రజలందరికీ వినిపిస్తాను, సమస్త ప్రజాసభలోనూ నిన్ను స్తుతిస్తాను.

ప్రభువుకి భయపడేమీరంతా ఆయన గుణగానం చెయ్యండి. యాకోబు వారసులారా, ఆయన్ని సమ్మానించండి, ఇస్రాయేలీలురా, ఆయన ముందు మోకరిల్లండి.

కుంగిపోతున్న వాళ్ళదుఃఖాన్ని ఆయన ఎన్నడూ అపహాస్యం చేయలేదు, దుఃఖితుల్ని ఆయన ఎన్నడూ తక్కువచెయ్యలేదు. వ్యాకుల మానవుడినుంచి ఆయన తన ముఖం ఎన్నడూ చాటుచెయ్యలేదు, పైగా రక్షణకోరుతున్న అతడి మొరాలకిస్తోనే ఉన్నాడు.

మహాజనసభముందు నీ స్తుతిగీతాలు ఆలపించడానికి స్ఫూర్తి నీనించే నాకు లభిస్తున్నది, నీకు భయపడేవారిముందు నేను నా శపథాలు చెల్లించుకుంటాను.

బీదసాదలకి అన్నం దొరుకుతుంది, వారికి తృప్తి కలుగుతుంది. ప్రభువుని అన్వేషిస్తున్నవారంతా ఆయన్ను స్తుతించండి, మీ హృదయాల్లో ఆయన కలకాలం వర్ధిల్లు గాక!

నేల నాలుగు చెరగులూ ఆయన వైపు తిరుగుగాక! ఆయన్నే స్మరించుగాక! అన్ని జాతుల కుటుంబాలన్నీ ఆయన ముందు మోకరిల్లుగాక! రాజ్యభారం ఆయనది, అన్ని జాతుల పరిపాలకుడూ ఆయనే.

భూమ్మీది సంపన్నులంతా ఆరాధనలూ, సమారాధనలూ నిర్వహింతురు గాక! తమ ఆయువుముగిసి ప్రాణాలు దుమ్ములో కలవబోయేవారు మొత్తం ఆయన ముందు మోకరిల్లుదురుగాక!

మన సంతతి ఆయన్ను సేవింతురు గాక! భవిష్య తరాలకు ఆయన గురించి వివరింతురు గాక!

ఇంకా పుట్టబోయే వారికోసం ఆయన సత్యసంధతను ప్రకటింతురుగాక! ఇదంతా ఆయన మహిమాతిశయమే అని ఉగ్గడింతురు గాక!

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 22

నా ప్రభువు నా కాపరి

నా ప్రభువు నా కాపరి. నాకు కొరత లేదు.

ఆయన నన్ను పచ్చికబయళ్ళవెంట తిప్పుతాడు. ప్రశాంత సరోవరాలకు తీసుకుపోతాడు.

నా ఆత్మని నిలబెడతాడు. తన పేరుకు తగ్గట్టే నన్ను నీతిమార్గంలో నడిపిస్తాడు..

మృత్యువు నీడ పడే లోయలో నడిచినా ఏ కీడూ భయపెట్టలేదు. ఎందుకంటే నువ్వు నా పక్కనే ఉన్నావు. నీ బెత్తం, నీ దండం నాకు గొప్ప ఓదార్పు.

నా శత్రువుల సమక్షంలోనే నువ్వు నాకు విందుబల్ల పరుస్తావు. నా శిరాన్ని అభిషేకిస్తావు. నా పాత్ర పొంగిపొర్లుతుంది.

నేను జీవించినంతకాలం నీ దయ, అనుగ్రహం నన్ను వెన్నంటే ఉంటాయి. ప్రభుసన్నిధిలోనే నా శాశ్వతనివాసమని నాకు తెలుసు.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 23

ఈ పృథ్వి నా ప్రభువుది

ఈ పృథ్వి నా ప్రభువుది, దీనిలోని సమస్తం ఆయనదే. ఈ ప్రపంచం, ఇందులోని సకలజనులూ కూడా.

సముద్రాల మీద పుడమిని స్థాపించినవాడు. నదీతీరాలమీద నిలబెట్టినవాడూ ఆయననే.

పరమేశ్వరుడి పవిత్రశిఖరం అధిరోహించ గలిగేదెవ్వరు? ప్రభుసన్నిధిలో నిలబడగలిగే దెవ్వరు?

ఎవరి చేతులు నిరపరాధాలో, ఎవరి హృదయం నిర్మలమో తమవి కానివాటిని ఎవరి చూపులు ఆశించవో మోసపూరితంగా సాక్ష్యం చెప్పనిదెవరో

అతడికి ప్రభు కృపాశీస్సులు లభిస్తాయి. దేవుడు వారిని నిర్దోషులుగా లెక్కగడతాడు.

ఇది ఆయనకోసం పరితపించే ప్రజానీకం. నిన్ను వెతుక్కునే వారిదేశం.

మందిరకవాటాల్లారా, తెరుచుకోండి. ఓ పురాతన ద్వారాల్లారా, మీరు తెరుచుకోగానే తన సమస్త వైభవంతో నా ప్రభువు అడుగుపెడతాడు.

వైభవమూర్తి, ఆ ప్రభువు, ఎవరని? బలాఢ్యుడు, సమరశూరుడు సాహసమూర్తి ఆ ప్రభువు.

మందిరకవాటాల్లారా, తెరుచుకోండి ఓ ప్రాచీన ద్వారాల్లారా, మీరు తెరుచుకోగానే యశోవంతుడు నా ప్రభువు అడుగుపెడతాడు.

వైభవమూర్తి, ఆ ప్రభువు, ఎవరని? సేనాధిపతి, సమరశూరుడు సాహసమూర్తి ఆ ప్రభువు.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 24

నన్ను నిలబెట్టు ప్రభూ

నన్ను నిలబెట్టు ప్రభూ, నీతితప్పని వాణ్ణి. సందేహించకుండా నిన్నే నమ్ముకున్నవాణ్ణి.

పరీక్షించు, ప్రభూ, పరీక్షించి, నిరూపించు. నా మనసుని, నా హృదయాన్ని పరీక్షించు.

చెక్కుచెదరని నీ ప్రేమానురాగాన్ని కళ్ళారా చూస్తున్నాను. నీ పట్ల నమ్మకమే నన్ను నడిపిస్తున్నది.

తప్పుడుపనులు చేసేవాళ్ళతో కలిసి కూచోను. ఆత్మవంచకుల సహవాసాన్ని అభిలషించను.

దుర్మార్గుల సమావేశాల్ని మనసారా ద్వేషిస్తాను. కపటులతో కలిసి కూచోడం నాకు చాతకానిపని.

నా చేతుల్ని నిరపరాధత్వంతో శుభ్రంచేసుకుని నీ పాదపీఠం చుట్టూ ప్రదక్షిణం చేస్తాను.

ఎలుగెత్తి ధన్యవాదాలు సమర్పిస్తాను. నీ మహిమలు నోరారా గుణగానం చేస్తాను.

ప్రభూ నువ్వు నివసించే చోటంటే నాకెంతో ప్రేమ. నీ తేజోధామం మీదనే నా దృష్టి ఎప్పుడూ.

పాపిష్టివాళ్ళతో నన్ను కూడా తుడిచిపెట్టకు. హంతకుల్లో నన్ను కూడా ఒకడిగా లెక్కగట్టకు.

వాళ్ళ చేతులనిండా పాచికలు, పన్నాగాలు. వాళ్ళ కుడిచేతిలో చూడు, ఒకటే లంచాలు.

నేనైతే ఎప్పుడూ నీతిమార్గం తప్పలేదు, ప్రభూ! నన్ను బయటపడెయ్యి, నా మీద దయచూపు.

నేనెప్పుడు నిలబడ్డా సమతలంమీదనే నిలబడ్డాను. నలుగురు కూచున్న ప్రతి చోటా నీ మహిమలు ఎలుగెత్తి చాటుతాను.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 26

పభూ, పిలుస్తున్నది నిన్నే

పభూ, పిలుస్తున్నది నిన్నే. నువ్వు నా ఆధారశిలవి. నీ పవిత్రసింహాసనం ముందు చేతులు పైకెత్తి ప్రార్థించినప్పుడు నా పిలుపు పెడచెవిన పెట్టకు. నువ్వు నాకు బదులివ్వకపోతే అధఃపాతాళానికి జారిపోతాను.

నీకోసం మొరపెట్టు కున్నప్పుడు నా స్వరం, విన్నపం ఆలకించు.

నన్ను దుర్మార్గుల్తో కలిపి కిందకు తోసెయ్యకు. చెడ్డవాళ్ళల్తో చేర్చి లెక్కించకు. వాళ్ళు తోటిమనుషుల్తో ఇచ్చకాలాడతారు. కాని హృదయంలో విషం మూటగట్టుకుంటారు.

వాళ్ళ పన్నాగాలకీ, జిత్తులకీ మోసకారిపనులకీ ప్రతిఫలం ముట్టచెప్పు. వాళ్ళేది చెల్లిస్తే దాంతోనే తిరిగి చెల్లించు. వాళ్ళ చేతల్ని వాళ్ళకే అప్పగించు.

ప్రభువు చేతలు అర్థం కాదు వాళ్ళకి. అందుకని చీల్చిపారేస్తాడు వాళ్ళని.

ప్రభువు నిజంగా కృపామయుడు. ఆయన నా మొరాలకించాడు.

ఆయన నా బలం, నా రక్షణ. ఆయనలోనే నాకు నమ్మకం. నన్ను ఆదుకున్నాడు, నా హృదయం పరవశించింది. నా గీతంతో ఆయన్ని ఎలుగెత్తి స్తుతిస్తాను.

ప్రభువు తనని నమ్ముకున్నవాళ్ళ బలం. తాను ఎంచుకున్నవాళ్ళకి రక్షణ.

నీ ప్రజల్ని కాపాడు, నీ సంపత్తి చూసుకో. వాళ్ళని కలకాలం నీ బుజంపైకెత్తుకో.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 28

స్తుతించండి ప్రభువుని

స్తుతించండి ప్రభువుని. యశోవైభవాలతో నోరారా స్తుతించండి.

ఆ ఘనత ఆయనదొక్కడిదేనని కీర్తించండి. పవిత్రత ఆభరణంగా ఆయన్ని అలంకరించండి.

జలరాశులమీద ఆయన వాక్కు పరుచుకుంది-ఈ సమస్త జలాల మీద, ప్రభు మహిమ, ప్రభు వైభవోద్ఘోష వినవస్తున్నది.

ప్రభు కంఠస్వరం శక్తిమంతం. ప్రభు కంఠస్వరం మహిమోపేతం.

ఆయన స్వరం దేవదారు తరువుల్ని కూల్చగలదు. లెబనాను కాననాల్ని తుంచెయ్యగలదు.

లెబనానుని లేగదూడలాగా పరుగులెత్తించగలడు. సిరియోనుని ఎద్దుగిత్తలాగా గెంతు లెత్తించగలడు

ప్రభు కంఠస్వరం అగ్నిశిఖల్ని వెలికితేగలదు.

ప్రభు కంఠస్వరం ఎడారుల్ని వణికించగలదు. ప్రభు కంఠస్వరం ఖాదేషు సీమని కంపింప చెయ్యగలదు.

ప్రభు కంఠస్వరానికి హరిణాలు ప్రసవిస్తాయి. అడవిచెట్లన్నీ ఆకులు రాల్చేస్తాయి. దేవళంలో ప్రతి ఒక్కరూ ఆయనకి జయం పలుకుతారు.

ప్రభువు జలప్రళయం మీద పట్టాభిషిక్తుడు కాగలడు. రాజాధిరాజై శాశ్వతంగా సింహాసనం మీద ఆసీనుడు కాగలడు

ప్రభువు తన ప్రజానీకానికి బలం ప్రసాదించుగాక ! శాంతి సమకూర్చుగాక !

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 29

నిన్ను స్తుతిస్తాను, ప్రభూ

నిన్ను స్తుతిస్తాను, ప్రభూ, నన్నుద్ధరించావు. నా శత్రువులు నన్ను మించిపోకుండా కాపాడేవు.

ఓ ప్రభూ, నా ప్రభూ, నీ చేయూత కోసం విలపించినప్పుడు. నువ్వు నాకు స్వస్థత చేకూర్చావు.

నా ఆత్మని నరకం నుండి బయటకు లాగావు. పతితజనులనుండి పక్కకు తీసిపెట్టావు.

ఓ భాగవతోత్తములారా, ప్రభుగుణగానం చెయ్యండి. దివ్యనామ సంకీర్తన మొదలుపెట్టండి.

ఆయన కోపం క్షణకాలం మాత్రమే. కాని అనుగ్రహం కలకాలం. ఈ శోకమంతా ఒక్క రాత్రికి మటుకే. తెల్లవారుతూనే సంతోషం వర్షిస్తుంది.

నా సంగతంటారా, రోజులు బాగా ఉన్నప్పుడు నాకు ఎదురు లేదను కున్నాను.

ప్రభూ, నువ్వు అనుగ్రహించిన వేళల్లో నేను కొండలాగా నిశ్చలంగా ఉన్నాను. నీ ముఖం పక్కకు తప్పించినప్పుడు నిరాశలో కుంగిపొయ్యాను.

ప్రభూ, నువ్వు వింటావనే నేను విలపిస్తున్నది. నీ దయానుగ్రహానికే ప్రాధేయపడుతున్నది.

నేను పాతాళానికి జారిపోతే నా పతనం ఎవరికి ప్రయోజనకరం? అప్పుడు ఆ దుమ్ము నిన్ను స్తుతిస్తుందా? నీ విశ్వాసమహిమను అది ఉగ్గడిస్తుందా?

ఆలకించు, ప్రభూ, నా మొరాలకించు. ప్రభూ, దయచూపు, నన్నాదరించు.

నా సంతాపాన్ని సంగీతంగా మార్చినవాడివి. నా మలినవస్త్రాన్ని ఊడ్చిపక్కకు లాగి ఆనందనవ్యవస్త్రం కట్టబెట్టావు.

ఇంక మౌనం సాధ్యంకాదు, నా వైభవమే నీ గుణగానం చేస్తుంది. ఓ ప్రభూ, నా దైవమా, కలకాలం నిన్నిలా కీర్తిస్తూనే ఉంటాను.

దేవాలయ ప్రతిష్ఠ వేళ దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 30

అతడు ధన్యుడు

ఎవరి తప్పులు క్షమించబడతాయో, ఎవరి పాపాలు లెక్కకు రావో అతడు ధన్యుడు.

ఎవరి ఆత్మలో కపటంలేదో, ఎవరి మీద ప్రభువు కినుక వహించడో అతడు ధన్యుడు.

నేను మౌనంవహించినప్పుడు, రోజంగా మూల్గి మూల్గి నా ఎముకలు శిథిలమైపోయాయి.

అహర్నిశలు నా మీద నీ చెయ్యి బరువుగా పడిఉన్నప్పుడు వేసవికాల జలంలాగా నా సత్తువ ఇంకిపోయింది.

నీ పట్ల నా అపచారాల్ని పూర్తిగా ఒప్పుకున్నాను. నా అతిక్రమణలేవీ నీముందు దాచుకోలేదు. నా ఉల్లంఘనల్ని నీ ముందు వెల్లడించుకున్నప్పుడు నా అపరాధాలు అన్నిటినీ నువ్వు క్షమించేసావు.

కనుక నువ్వు ఎప్పుడు దొరికితే అప్పుడే భక్తులు నిన్ను ప్రార్థించుకోవాలి. తీరా కాలం వరదలాగా పరుగెత్తినప్పుడు వారు నిన్ను అందుకోలేకపోవచ్చు.

నేను తల దాచుకునే చోటువి నువ్వు. కష్టాలనుంచి నన్ను కాచిరక్షిస్తావు. నా చుట్టూ నీ విమోచన నినాదాలు.

నువ్వెలా నడుచుకోవాలో చెప్తాను, నీకు దారి చూపిస్తాను. ఎప్పటికీ నిన్నొక కంట కనిపెట్టి ఉంటాను, కనికరిస్తాను.

గుర్రంలానో, కంచరగాడిదలానో తెలివిమాలి బతక్కు.. వాటికైతే కళ్ళెం, మునుగోల తప్పనిసరి. లేకపోతే వాటిని అదుపు చెయ్యలేం.

దుర్మార్గులకి అంతులేని కడగండ్లు,. విశ్వాసులచుట్టూ అంతులేని ప్రేమ.

సజ్జనులారా, సత్యవంతులారా, స్తుతించండి, ఆనంద జయ జయ ధ్వానాలు ఆలపించండి.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 32

నీ ప్రేమది సూటిదారి

దుర్మార్గుడు చేసే అపరాధాలు నా హృదయంలో తిష్ఠ వేసాయి. అతడి కళ్ళల్లో దేవుడి పట్ల భయం కనిపించదు.

లోపలి క్రూరత్వం బయటికి కనబడదు, అది బయట పడేదాకా అతడు బాహాటంగా తనని తాను పొగుడుకుంటాడు. నోరు తెరిచాడా మోసం, దగా. మంచిదారిన నడవడమెప్పుడో మానేసాడు.

పక్కమీంచి దిగకుండానే పన్నాగాలు మొదలుపెడతాడు. అతడు ఎంచుకునే దారి వంకరదారి. తప్పుపనుల పనుల పట్ల ఏవగింపు లేదతడికి.

ప్రభూ, నీ ప్రేమది సూటిదారి, అంతరిక్షందాకా విస్తరించింది. నీవాళ్ళ పట్ల నువ్వు చూపే అనుగ్రహం మేఘపర్యంతం.

నీ సత్యసంధత మహాపర్వతం వంటిది. నీ నిర్ణయాలు లోతైన సముద్రాలవంటివి. ప్రభూ, మనుషులకీ, పశువులకీ నువ్వే రక్షణ.

స్థిరమైన నీ ప్రేమ ఎంత అమూల్యం ప్రభూ! మానవజాతి నీ రెక్కలనీడకింద తలదాచుకుంటుంది.

నీ గృహాంగణసమృద్ధి వాళ్ళకు విందువడ్డిస్తుంది. నీ సంతోషజలాల్లో వాళ్ళ దప్పిక తీరుతుంది.

ప్రాణం నీ దగ్గర ఒక ఊటలాగా ఊరుతుంది. నీ వెలుగులోనే మాకు వెలుగు చిక్కుతుంది.

నిన్ను తెలుసుకున్నవాళ్ళందరికీ నీ ప్రేమ స్థిరంగా ప్రసాదించు. సత్యసంధులహృదయాల్లో నీ నిజాయితీ నాటుకోనివ్వు

గర్విష్ఠులు నా మీద తమ పాదం మోపనివ్వకు. దుర్మార్గుల హస్తం నన్ను దూరంగా తరమనివ్వకు.

చెడ్డపనులు చేసేవాళ్ళు అదుగో అక్కడే పడివున్నారు. మళ్ళా పైకి లేవకుండా కుప్ప కూలిపొయ్యారు.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 36

నా దైవం మహోన్నతుడు

బీదసాదల పట్ల ప్రేమకలిగిన వాడు ధన్యుడు. కష్టకాలంలో ప్రభువు అతణ్ణి బయటపడేస్తాడు.

అతణ్ణి కాపాడతాడు, ప్రాణాలతో నిలబెడతాడు. భూమ్మీద అంత భాగ్యశాలి మరొకడు లేడనిపిస్తాడు. నువ్వు అతణ్ణి శత్రువుల కుట్రలనుంచి తప్పిస్తావు.

అతణ్ణి రోగశయ్యమీద కూడా ప్రభువు చూసుకుంటాడు. అస్వస్థతపొందిన వేళల్లో అతడికి సమస్తం సమకూరుస్తావు.

ఇక నా గురించి. నేను నీ పట్ల అపరాధం చేసాను. అయినా ప్రభూ, నా పట్ల కృపచూపు, నన్ను బతికించు.

వాడు మరణించగానే ఊరూపేరూ లేకుండా పోతాడు చూడు అంటారు నా శత్రువులు, వాళ్ళ మాటల్లో ఎంత విషం.

నన్నెవరేనా పరామర్శించినా పైకి చెప్పేవి వట్టిమాటలు. వాళ్ళమనసులో మాత్రం కుటిలత్వం పోగుపడుతుంటుంది. నాదగ్గర్నుంచి బయటికి పోగానే అది బయటపడుతుంది.

నన్ను ద్వేషించేవాళ్ళంతా బయట చెవులు కొరుక్కుంటారు. ఎంత చెడ్డగా చెప్పుకోవాలో అంతగానూ చెప్పుకుంటారు. వాడిమీద పెద్ద ఆపద విరుచుకుపడింది అనుకుంటారు. వాడు పడి ఉన్నచోటనుంచి ఇక మళ్ళీ పైకి లేవడంటారు.

చివరికి నేనెంతో నమ్మిన నా ప్రియమిత్రుడు, ఎన్నిసార్లోనాతో కలిసి విందారగించినవాడు కూడా నన్ను నిందిస్తాడు.

కాని, ప్రభూ, నువ్వు నా పట్ల దయార్ద్రహృదయం చూపించు. నన్ను పైకిలేపు, కనికరించు, నేను వాళ్ళకి పాఠం చెప్తాను.

అప్పుడు తెలుస్తుంది నాకు నేనంటే నీకు ఇష్టమని. ఎన్నటికీ నా శత్రువుకి నామీద పైచేయి దక్కదని

నువ్వు నా నిజాయితీ చూసినన్నుకనికరిస్తావు. నీ సమక్షంలో నాకు శాశ్వతమైన స్థానమిస్తావు.

నా జనాన్ని కాపాడుతున్న నా దైవం మహోన్నతుడు. యుగాలనుండి యుగాలదాకా మహా మహిమోపేతుడు. తథాస్తు! తథాస్తు!

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 41

నా తరఫున వాదించు

దైవాన్ని నమ్మని వాళ్ళ ముందు నన్ను సమర్థించు ప్రభూ, నా తరఫున వాదించు. మోసకారిమనుషులనుంచి, అన్యాయానికి ఒడిగట్టేవారినుంచి నన్ను బయట పడెయ్యి.

నా ఏకైక ఆశ్రయానివి, దైవానివి నువ్వొక్కడివే. నన్నెందుకు నిరాకరిస్తున్నావు? నా శత్రువు నన్ను పెడుతున్న బాధలకి నేనెందుకిట్లా శోకిస్తూ తిరగాలి?

నీ సత్యాన్నీ, వెలుతురునీ నాకోసం పరిచిపెట్టు. వాటితో నాకు దారిచూపించు. అవి నన్ను నీ పవిత్రశిఖరం చెంతకి, నీ గృహప్రాంగణానికి తీసుకురానివ్వు.

అప్పుడు నేను భగవంతుడి అర్చావేదికదగ్గర నిలబడతాను. నా తంబుర సితారనాదాలతో నా దైవమా ప్రియదైవమా, నా ఆనందధామమా, నిన్ను స్తుతిస్తాను

నా ప్రాణమా! నువ్వెందుకిట్లా నీరసించిపోయావు? లోపల్లోపల ఎందుకిట్లా సతమతమవుతున్నావు? దేవుణ్ణి నమ్ము. ఆయనే నా దైవం, నా విముక్తి. మళ్ళా మళ్ళా అయనకే నా స్తోత్రములు, స్తోత్రములు.

కీర్తనలు, పాతనిబంధన, 43

భగవంతుడే మనకు దిక్కు

భగవంతుడే మనకు దిక్కు, బలం. కష్టాలు చుట్టుముట్టినప్పుడు ఆయనొక్కడే ఓదార్పు.

సముద్రాలు ఘూర్ణిల్లనీ, నురగలు కక్కనీ. కెరటాల తాకిడికి కొండలు కంపించనీ. భూమి బద్దలై, కొండలు కడలిలో కుంగిపోనీ. మనకు భయం లేదు.

భగవంతుడి నగరంచెంత ఆహ్లాదనదీప్రవాహం ఒకటుంది. ఆ ప్రవాహం భగవంతుడికి ఒక నగరాన్ని నిర్మిస్తుంది. సర్వేశ్వరుడి గుడారం నిలబెడుతుంది.

ప్రతి ఉషోదయవేళా ఈశ్వరుడు ఆమెకి తోడునిలబడతాడు. అచంచలుడిగా.

జాతులు తిరగబడతాయి, రాజ్యాలు తడబడతాయి. ఆయన తన గళం విప్పగానే భూమి కరిగిపోతుంది.

సేనాధీశుడు సర్వేశ్వరుడు మనకు తోడుగా ఉన్నాడు. దేశాధీశుడు మనకు కోటలాగా నిలబడివున్నాడు.

రండి, ప్రభు మహిమలు చూడండి. ఈ భూమిని ఆయన శిథిలం చెయ్యగలడు.

చూడండి. యుద్ధాల్ని భూమి అంచులదాకా తుడిచెయ్యగలడు. విల్లమ్ములు విరిచిపారేసాడు, బల్లేల్ని ముక్కలు చేసేసాడు. రథాల్ని దగ్ధం చేసేసాడు.

నిశ్చింతగా ఉండు, దైవం నేనేనని తెలుసుకో. సమస్త జాతులు నన్ను కొనియాడతాయి. భూమిమొత్తం నా మహిమను ఉద్ఘాటిస్తుంది.

సేనాధీశుడు సర్వేశ్వరుడు మనకు తోడుగా ఉన్నాడు. దేశాధీశుడు మనకు కోటలాగా నిలబడివున్నాడు.

ప్రధాన గాయకుడి గీతం, కోరాపుత్రుల కృతి, కీర్తనలు, పాతనిబంధన, 46

ఆనందగానం ఆలపించండి

సమస్త జనులారా, సంతోషంగా చప్పట్లు చరచండి. అత్యుచ్చస్వరంతో ఆనందగానం ఆలపించండి.

సర్వేశ్వరుడు ప్రభువుని చూసి భీతిచెందండి. సమస్తపృథ్వీమీద రాజాధిరాజు ఆయన.

జనుల్ని మన చేతికింద అణచిపెట్టాడు. జాతుల్ని మన కాళ్ళకింద తొక్కిపెట్టాడు.

తాను ప్రేమిస్తున్న దేశం పట్ల అభిమానాన్ని మనకు వారసత్వంగా అనుగ్రహించాడు.

దైవం ఉచ్చైస్వరంతో పైకి అధిరోహించాడు. భేరీనినాదంతో ప్రభువు ముందుకు సాగాడు.

ఆలపించండి స్తోత్రాలు దైవానికి, స్తోత్రాలు. మన రాజాధిరాజుకి స్తోత్రములు, స్తోత్రములు.

సమస్తభూమండలానికి రాజాధిరాజు ఆయన. సర్వేశ్వరుడికి సామగీతాలతో స్తోత్రాలు ఆలపించండి.

లోకమంతటికీ దైవమొక్కడే పాలకుడు. తన పవిత్ర సింహాసనం మీద అభిషిక్తుడు.

సమస్త జాతుల రాకుమారులూ అబ్రహాము సంతతితిగా ఒకచోట కూడుకుంటున్నారు. భూమ్మీద ఉన్న రక్షణస్థలాలన్నీ దేవుడివే. సర్వేశ్వరుడు, ఆయన సర్వోన్నతుడు.

ప్రధాన గాయకుడి గీతం, కోరాపుత్రుల కృతి, కీర్తనలు, పాతనిబంధన, 47

దైవశుభనామ సంపదకోసం

ఉద్ధత మానవుడా! నీ చెడునడతని చూసుకుని ఎందుకంత ఉబ్బిపోతున్నావు? కలకాలం నిలిచేది కరుణామయుడి ప్రేమ మాత్రమే.

నువ్వు నోరువిప్పితే విధ్వంసం. రంపంకొక్కుల్లాగా నీ చేతలనిండా మోసం.

నీకు చెడు రుచిస్తుంది, మంచి కాదు. నీ దృష్టి అబద్ధాల మీదే, నిజం మీద కాదు.

మోసకారి నోరు. నువ్వు మాట్లాడే మాటలు క్రూరమృగాల్లాగా విరుచుకు పడతాయి.

కాని దేవుడు నిన్ను నిట్టనిలువునా కూల్చేస్తాడు. నీ గుడారం నుంచి నిన్ను బయటకు ఈడ్చేస్తాడు. బతికున్న మనుషులనుంచి వేళ్ళతో పెళ్లగించిపారేస్తాడు.

సత్యవంతులకి సత్యం తెలుసుకాబట్టి భయపడతారు. నిన్ను చూసి నవ్వుతూ అంటారు కదా:

'చూడండి దేవుణ్ణి శరణు జొచ్చని వాడి పరిస్థితి! తన ఐశ్వర్యాన్ని నమ్ముకుని చేజేతులా వినాశనం కొనితెచ్చుకున్నాడు' అంటారు.

నేను మటుకు భగవంతుడి ముంగిట్లో పచ్చటిచెట్టులాంటి వాణ్ణి. ఎప్పటికీ మరెప్పటికీ భగవంతుడి ప్రేమనే నమ్ముకున్నవాణ్ణి.

నా మీద వర్షించిన ఈ ప్రేమ నేనెప్పటికీ గుర్తుపెట్టుకుంటాను. భగవత్స న్నిధిలో దైవ శుభనామ సంపదకోసం సదా నిరీక్షిస్తాను.

ప్రధాన గాయకుడి గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 52

నా మొరాలకించు

భగవంతుడా, నీ పేరుమీద నన్ను కాపాడు. నీ శక్తితో, బలంతో నన్ను నిలబెట్టు.

దైవమా, నా మొరాలకించు. నా విన్నపాలు వినిపించుకో.

పరాయివాళ్ళు నా మీద విరుచుకుపడుతున్నారు. క్రూరులు, నా ప్రాణాలకోసం పగబట్టారు. వాళ్ళపక్కన దేవుడు లేడు.

చూడండి, దేవుడు నా పక్కన నిలబడ్డాడు. నా బతుకు తనచేతుల్లోకి తీసుకున్నాడు.

నా శత్రువులమీద ప్రతీకారం తీర్చుకుంటాడు. తప్పనిసరిగా వాళ్ళని మట్టుబెడతాడు.

సంతోషంగా నీకోసం నైవేద్యాలు సమర్పిస్తాను. నీకు ధన్యవాదాలు చెల్లించుకోవడం నిజంగా శుభప్రదం.

ప్రతి ఒక్క విపత్తునుంచీ నన్ను బయటపడేసిన ఆయన దయవల్ల నా పగవాళ్ళ ఓటమి నాకు కన్నులపండగ.

ప్రధానగాయకుడికోసం గీతం, దావీదు కృతి కీర్తనలు, పాతనిబంధన, 54

భాగవతోత్తముల కోవలో

ఓ దైవమా, నా మొరాలకించు. నా ప్రార్థన పట్టించుకో.

నా హృదయాన్ని నిస్సత్తువ ఆవహించినప్పుడు దిగంతపు సరిహద్దునుండి నిన్ను పిలుస్తాను. నా కన్నా ఎత్తైన కొండకొమ్ముమీదకి నన్ను నడిపించు.

నువ్వే నాకు నా ఆశ్రయానివి. నా శత్రువులకి అడ్డునిలబడే దుర్భేద్య దుర్గానివి.

నీ గుడారంలో నన్ను నివసించనివ్వు. నీ రెక్కలనీడన నన్ను తలదాచుకోనివ్వు.

ఎందుకంటే, దేవుడా, నువ్వు నా ప్రమాణాలు విన్నావు. భాగవతోత్తముల కోవలో నా పేరు కూడా రాసుకున్నావు

రాజులకి నువ్వు దీర్ఘాయుర్దాయమిస్తావు. ఆయనకు పుత్రపౌత్రాభివృద్ధి కలుగుగాక.

ఆయన సదా దైవసన్నిధిలో నిలిచి ఉండుగాక! స్థిరమైన ప్రేమ, విశ్వాసం అతణ్ణి కాచి రక్షించుగాక!

ప్రతిరోజూ నీ గుణగానం చేస్తాను. అనుదినం నా మొక్కులు చెల్లించుకుంటాను.

ప్రధాన గాయకుడికోసం గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 61

భగవంతుడికోసమే

భగవంతుడికోసమే నా ప్రాణం నిశ్శబ్దంగా పరితపిస్తున్నది. ఆయనవల్లనే నాకు విడుదల.

ఆయనే నా ఆధారశిల, నా విమోచన, నా దుర్గం. నన్నెవ్వరూ కదపలేరు.

ఎంతకాలం మీరంతా కలిసి ఒక్కమనిషినిట్లా వేధిస్తారు. అసలే అతడొక ఒరిగిపోయిన గోడ, కూలిపోతున్న కంచె.

అతడు పైకి చేరుకున్న చోటు నుంచి అతణ్ణెట్లా కిందకు పడదొయ్యాలా అన్నదే మీ పన్నాగం. కపటంలోనే మీకు సంతోషం. పైకి ప్రశంసలు కురిపిస్తారు. మనసులో శపిస్తారు.

నా ప్రాణమా, దైవం గురించి మాత్రమే ఎదురుచూడు. నాకున్న ఆశ ఆయనొక్కడే.

ఆయనే నా ఆధారశిల, నా విమోచన. నా దుర్గం, నన్నెవ్వరూ కదపలేరు.

ఆయన్ని బట్టే నా విడుదల, నా యశస్సు. నా బంగారుకొండ, నా నీడ దైవమొక్కడే.

జనులారా, ఎన్నటికీ ఆయన్నే నమ్ముకోండి. ఆయనముందే మీ హృదయం కుమ్మరించు కోండి. మనందరికీ తోడూ, నీడా ఆయనొక్కడే.

మనుషులు నిమ్నస్థానాల్లో ఉండటం క్షణిక సత్యం. ఉన్నతస్థానాల్లో ఉన్నారన్నది ఒక భ్రమ. దేవుడి తక్కెడలో అవి తేలిపోతాయి.. ఆ రెండూ కలిసి గాలికన్నా పలచన.

దౌర్జన్యాన్ని నమ్ముకోకండి. దోచుకోవడం మీద ఆశలు పెట్టుకోకండి. కలిమి సమకూరు తున్నదా, కనీసం మీ చూపులు కూడా తిప్పకండి.

దేవుడు ఒక మాట చెప్పాడు. ఆ మాటలు రెండు సార్లు విన్నాను: నిజమైన శక్తిమంతుడు దైవమొక్కడే అని.

ప్రభూ, నీది ప్రేమశిబిరం. ఎవరికి చేతలకు తగ్గట్టుగా వాళ్ళని తీర్చిదిద్దుతావు.

ప్రధాన గాయకుడికోసం గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 62

నేను వెతుక్కుంటున్నది నిన్నే

దేవుడా, నువ్వే నా దైవానివి, నేను వెతుక్కుంటున్నది నిన్నే. నిర్జలసీమలో ఎండి మాడిపోయిన నేలలాగా నా ప్రాణం నీకోసమే దప్పిపడి ఉంది. నా దేహం నీకోసమే స్పృహ తప్పుతున్నది.

నిన్ను నా అభయక్షేత్రంగా గుర్తుపట్టాను. నీ యశోవైభవాలు కళ్లారా కనుగొన్నాను.

జీవితాన్ని మించింది నీ ప్రేమ. కాబట్టే నా అధరాలు నిన్నే జపిస్తున్నాయి.

బతికినంతకాలం నిన్ను స్తుతిస్తూనే ఉంటాను. చేతులు పైకెత్తి నీ గుణసంకీర్తన సాగిస్తాను.

ప్రాణానికి పుష్టికరమైన ఆహారం దొరికినట్టు నా సంతోషచలితాధరాలు నిన్ను కీర్తిస్తాయి

శయ్యమీద మేను వాల్చినప్పుడు రాత్రి నాలుగు జాములూ నీ గురించే తలపోస్తుంటాను.

నువ్వే కదా నాకు తోడు. నీ రెక్కల నీడలోనే నా సంతోషం, నా సంగీతం.

నా ప్రాణం నిన్ను కరిచిపట్టుకున్నది. నీ కుడిచేత్తో నన్ను దగ్గరగా తీసుకున్నావు.

నా జీవితాన్ని కూలదొయ్యాలనుకున్నవాళ్ళు. వాళ్ళే పాతాళంలో కుంగిపోతారు.

కత్తికి ఆహారంగా మారతారు, నక్కలపాలవుతారు.

రాజుకి కూడా శుభంకలిగేది దైవం వల్లనే. సకలజనుల్నీ పైకెత్తేది దైవమే,. అబద్ధాలాడేవాళ్ళ నోరునొక్కేసేదీ ఆయనే.

యూదాలో ఏకాకిగా సంచరిస్తున్నప్పుడు దావీదు రాసుకున్న కీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 63

నా మొరలాకించు దైవమా

నా మొరలాకించు దైవమా, నా విన్నపాలు వినిపించుకో. శత్రుభయం నుండి నా జీవితాన్ని కాచి రక్షించు.

తప్పుడు పనులు చేసే మూకలమధ్య నుంచి, దుర్మార్గుల రహస్య పన్నాగాల నుండి నన్ను తప్పించు.

నాలుకల్ని కత్తుల్లా పదును పెట్టుకునేవాళ్ళు; కూరవచనాల్ని శరాల్లాగా సంధించేవాళ్ళు;

నిష్కళంకుల మీద దొంగచాటుగా దండెత్తే వాళ్ళు; వాళ్లని హతమార్చడానికి ఏ మాత్రం వెనుతియ్యని వాళ్ళు;

ఎంతసేపూ తమ దుష్టప్రయోజనాల్నే పట్టుకుని ఉంటారు. ఎంతసేపూ ఉచ్చులు పన్నడం గురించే వాళ్ల తలపోత. తమనెవరు చూడగలరనుకుంటారు.

అన్యాయాన్ని అన్వేషిస్తూ ఉంటారు. తమ వెతుకులాట చాలా గోప్యం అనుకుంటారు. తన మనసులో, హృదయంలో మనిషి ఎంత నిగూఢం!

కాని దైవం వాళ్ల మీద విల్లు ఎక్కుపెట్టితీరతాడు. ఒక్కసారిగా వాళ్ళని నిట్టనిలువునా కూల్చేస్తాడు.

వాళ్ళ నాలుకలు వాళ్ళకే ఎదురు తిరిగేట్టు వాళ్ళని సర్వనాశనం చేసేస్తాడు. అదంతా చూసినవాళ్ళు పారిపోతారు.

అప్పుడు మొత్తం మానవజాతికి భయమంటే తెలుస్తుంది. భగవంతుడు ఏమి చేసాడో చెప్పుకుంటారు. ఏమి చేసి చూపించాడో తలుచుకుంటారు.

నీతిమంతుడు సర్వేశ్వరుణ్ణే నమ్ముకుని ఉండుగాక! ఆయన్నే ఆశ్రయించుకుని ఉందురు గాక! సత్యవంతులు ధీరచిత్తులై విలసిల్లుదురుగాక!

పధాన గాయకుడికోసం గీతం, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 64

ఈ భూమ్మీద నీ దారి

భగవంతుడు మాపై దయచూపించుగాక, మమ్మల్ని ఆశీర్వదించుగాక! ఆయన వెలుగు మా పై ప్రసరించుగాక!

అప్పుడే ఈ భూమ్మీద నీ దారి మాకు గోచరిస్తుంది. నీ రక్షణశక్తి సకలజాతులకు తెలిసి వస్తుంది.

జనులు నిన్ను స్తుతింతురు గాక, ఓ దైవమా! సకల జనులు నిన్ను కొనియాడుదురు గాక!

ఎల్లజనులు సంతోషపరవశులై నిన్ను కీర్తింతురు గాక! నువ్వు ప్రజలందరినీ సమదృష్టితో పరిపాలిస్తావు. వసుధపైన సమస్త జాతులకీ దారిచూపుతావు

జనులు నిన్ను స్తుతింతురు గాక, ఓ దైవమా! సకల జనులు నిన్ను కొనియాడుదురు గాక!

పుడమి పైన పాడిపంటలు పొంగిపొర్లుతాయి. దైవం, మా దైవం కూడా మమ్మల్ని ఆశీర్వదించుగాక!

దైవం మమ్మల్ని అనుగ్రహించుగాక! నేలనాలుగు చెరగులూ భయభక్తులతో మసలు గొనుగాక!

పధాన గాయకుడి గీతం, కీర్తనలు, పాతనిబంధన, 67

సర్వేశ్వరా! త్వరపడు!

సర్వేశ్వరా, త్వరపడు, నన్ను విడుదల చెయ్యి. నాకు నీ ఆపన్నహస్తం అందించడానికి త్వరపడు

నా జీవితం మీద పగబట్టినవాళ్ళకి ఆశాభంగం కలిగించు, వాళ్ళు అవమానంతో కుంగిపోయేలా చెయ్యి.

నా అవమానాన్ని చూసి సంతోషపడాలనుకున్నవాళ్ళు వెనక్కి తిరిగి అగౌరవంతో తలవాల్చుకోవాలి. ఇహిహీ అంటో వేళాకోళం చేసేవాళ్ళు సిగ్గుతో ముఖం చాటేసుకోవాలి.

నిన్ను అన్వేషించేవారంతా నీ పాదకమలసేవలో తరించాలి, సంతోషంగా. నీ అభయహస్తం కోసం ఎదురుచూసే వాళ్ళు నీకు జయజయధ్వానాలు పలకాలి.

నేను దీనుణ్ణి, అనార్తుణ్ణి. జాగుచెయ్యకు తండ్రీ! నువ్వే నా అభయం, నా విమోచన! త్వరగా రా తండ్రీ!

ప్రధాన గాయకుడి గీతం, స్మరణభక్తిగీతం, కీర్తనలు, పాతనిబంధన, 70

దేవా, నీకు ధన్యవాదాలు

దేవా, నీకు ధన్యవాదాలు. నీ నామసంపద మాకు చేరువైనందుకు ధన్యవాదాలు. నీ మహిమలు కొనియాడడం మాకు సంతోషం.

నేను ప్రతి ఒక్కటీ ముందే నిర్ణయించి పెట్టాను. ప్రతి ఒక్కర్నీ సమదృష్టితో పరిపాలిస్తాను.

పృథ్వి, పార్థివజీవులంతా తడబడుతున్నప్పుడు ఆ స్తంభాలు చెక్కుచెదరకుండా నిలబెట్టేది నేనే.

ప్రగల్భుల్ని ప్రగల్భాలాడవద్దని మందలించేదీ నేనే. దుష్టులకి హితవు చెప్తాను: గొప్పలు పోకండి.

మరీ అంత పైకెత్తి మీ బూరాలు ఊదకండి గర్వంతో మిడిసిపడకండి అని హెచ్చరిస్తాను.

నాకు తెలుసు మన ఉద్ధరణ తూర్పునుంచో పడమటినుంచో ఎడారులనుంచో వచ్చేది కాదు.

అంతిమతీర్పరి దైవం మాత్రమే. ఒకరిని అణచిపెట్టేదీ, మరొకర్ని పైకి లేవనెత్తేదీ ఆయనే.

భగవంతుడి చేతిలో ద్రాక్షారసంతో పొంగిపొర్లే పాత్ర ఉంది, దాన్ని చక్కగా కలిపి ఆయన ధారపోస్తున్నాడు. భూమ్మీద ఉండే దుష్టులంతా దాని మడ్డికూడా మిగలకుండా తాగేస్తారు.

నేను మాత్రం ఎలుగెత్తి చాటతాను. నా రాజాధిరాజు మహిమలు కొనియాడతాను.

దుర్మార్గుల బాకాలు తుత్తునియలు చేస్తాను. సత్యవంతుల ఘనత నలుదిక్కులా చాటిస్తాను.

పధాన గాయకుడికోసం గీతం, అసఫ్ కృతి, కీర్తనలు, పాతనిబంధన, 75

సర్వేశ్వరా! మేలుకో!

దేవసభలో భగవంతుడు ఆసీనుడయ్యాడు. దేవతాబృందం మధ్య ఆయన ప్రశ్నిస్తున్నాడు

ఎన్నాళ్ళు మీరిట్లా అన్యాయంగా తీర్పులిస్తారు? దుర్మార్గులపట్ల పక్షపాతం చూపిస్తారు?

దీనులకీ, దిక్కులేనివాళ్ళకీ న్యాయం చెయ్యండి. దళితులవీ, పతితులవీ హక్కులు కాపాడండి.

ఆర్తుల్నీ, అన్నార్తుల్నీ రక్షించండి. దుర్జనహస్తాలనుంచి వాళ్ళని బయటపడెయ్యండి.

వాళ్ళకి తెలివి లేదు, మెలకువలేదు. చీకట్లో నడుస్తుంటారు. భూమి పునాదుల్లోంచీ కంపించిపోతున్నది.

వాళ్లతో చెప్పాన్నేను. మీరంతా దేవతలు, ఉత్తమ వంశ సంజాతులు.

అయినా, మీరు కూడా మరణిస్తారు మనుషుల్లానే. కూలిపోతారు తక్కినరాజుల్లానే.

సర్వేశ్వరా, మేలుకో, భూమిని చక్కదిద్దు. సకల రాజ్యాలూ నీ సొత్తు.

ప్రధాన గాయకుడికోసం గీతం, అసఫ్ కృతి, కీర్తనలు, పాతనిబంధన, 82

సర్వేశ్వరుడు నిర్మించిన నగరం

పవిత్రపర్వతం మీద నగరాన్ని నిర్మించాడు ఆయన.

దేశంలోని సమస్త స్థలాలకన్నా ఈ నగర ద్వారాలే ఆయనకు ప్రీతికరం.

ఓ దైవనగరమా! నీ గురించి ఎంత గొప్పగా విన్నాం.

నా గురించి తెలిసినవాళ్ళు రహాబులో బేబిలోనులో ఫిలిస్తియా, తైరు, కుష్ దేశాల్లో ఉన్నారు. నా గురించి చెప్తూ ఇతడు అక్కడి బిడ్డ అంటారు వాళ్ళు.

ఈ నగరం గురించి తలుచుకుంటూ ఇదిగో వాడూ, వీడూ అక్కడ పుట్టినవాళ్ళే అంటారు సాక్షాత్తూ సర్వేశ్వరుడు నిర్మించిన నగరం ఇది.

జనుల పుట్టుకల లెక్కలు రాసేటప్పుడు దేవుడు 'ఇదిగో వీడిక్కడ పుట్టాడు' అని రాసుకుంటాడు.

మా జలాలు నీలోనే ఊటలూరుతున్నాయని గాయకులూ, నర్తకులూ ఒక్కలానే చెప్పుకుంటారు.

కోరాకుమారుడు రాసిన గీతం, కీర్తనలు, పాతనిబంధన, 87

నీ శాసనం నమ్మదగ్గది

ప్రభువు పరిపాలన మొదలుపెట్టాడు.. వైభవవస్త్రం ధరించాడు, సత్త్వసంపదతో నడుం బిగించాడు. అవును, ప్రపంచం సుస్థాపితమైంది, ఇకదాన్నెవరూ కదల్చలేరు.

అనాదికాలం నుండీ సాగుతున్నది నీ పాలన. చిరకాలం నడుస్తుంది నీ సామ్రాజ్యంఈ

వరదలు గొంతెత్తాయి, ఓ ప్రభూ వరదలు హోరెత్తాయి. వరదలు ఘోషించడం మొదలు పెట్టాయి.

ఉరుముతున్న నదీప్రవాహాలకన్నా సాగర తరంగాల గర్జనలకన్నా ప్రభువు మరింత శక్తిమంతుడు.

ప్రభూ, నీ సన్నిధి పవిత్రతకు మారుపేరు. నమ్మదగ్గది నీ శాసనం నిన్నా, నేడూ, రేపు కూడా.

కీర్తనలు, పాతనిబంధన, 93

ఒక నూతనగీతం పాడండి

ప్రభువుకోసం ఒక నూతనగీతం పాడండి. ఆయన చేసిన మహిమలు అద్భుతం. ఆయన దక్షిణహస్తం, పవిత్రహస్తం అవి విజయహస్తాలు.

తన రక్షణ ఎటువంటిదో ప్రభువు వెల్లడి చేసాడు. సమస్త జనుల ఎదట తన సత్యనిష్ఠ ప్రకటించాడుఈ

నా దేశానికి తన ప్రేమనీ అనుగ్రహాన్నీ ఎరుకపరిచాడు. నేల నాలుగు చెరగులూ దైవమహిమ కళ్ళారా కనుగొన్నాయి.

సర్వలోకమా, ప్రభువుకు స్తుతిగీతాలు ఆలపించు! ఎలుగెత్తి మంగళగీతాలు, జయగీతాలు ఆలపించు!

తంబుం˝సితార నాదాలతో శుభగీతాలు ఆలపించు!

భేరీవాద్యాలు మోగించండి, బాకాలు ఊదండి! మన రాజాధిరాజుకు జయజయధ్వానాలు పలకండి.

సముద్రం గర్జించుగాక, సముద్రస్వరంతో సమస్తజనుల సంతోషం కలిసిపోవుగాక!

ఆయన ముందు నదీప్రవాహాలు చప్పట్లు చరచుగాక! కొండలు సంతోషపరవశంతో కేరింతలాడుగాక!

భూమ్మీద తన శాసన ప్రకటనకై ప్రభువు దిగిరానున్నాడు, ఆయన ప్రపంచాన్ని సరిదిద్ద నున్నాడు. మనుష్యకోటికి మంచినడత నేర్పబోతున్నాడు.

గీతం, కీర్తనలు, పాతనిబంధన, 98

ఆ పచ్చికబయలుకు గొర్రెలం

సమస్త భూమండలమా, జయధ్వానం కావించు!

ప్రభువును సంతోషంగా సేవించు. పాటలు పాడుతూ ఆయన సన్నిధిలో ప్రవేశించు.

ఆయనే ప్రభువు, మన దైవమని తెలుసుకో. ఆయన మన సృష్టికర్త, మనం ఆయన సొత్తు. ఆయన సొంతమనుషులం, ఆ పచ్చికబయలుకు గొర్రెలం.

ధన్యవాదాలు సమర్పిస్తూ ఆ గడపలో అడుగుపెట్టండి. స్తుతిగీతాలు ఆలపిస్తూ ఆ సన్నిధిలో అడుగుపెట్టండి. కృతజ్ఞతలు చెప్పండి, గుణగాన కీర్తన చెయ్యండి.

ప్రభువు శివంకరుడు. ఆయన ప్రేమ స్థిరం, శాశ్వతం. తరాలు మారినా చెక్కుచెదరదు ఆయన అనుగ్రహం.

ధన్యవాద సమర్పణ, కీర్తనలు, పాతనిబంధన, 100

ఎన్నటికీ నిలిచి ఉండే నీ ప్రేమ

ప్రభూ, ఎన్నటికీ నిలిచి ఉండే నీ ప్రేమ, నీ న్యాయం. వీటి గురించే పాడతాను, ప్రభూ, సంగీతం కూర్చుకుంటాను.

నిష్కళంక మైన నీ మార్గం గురించి తలపోస్తాను. ఓహ్! ఏ నడిరేయి ప్రభూ నువ్వు నన్ను చేరవచ్చేది?

నా ఇంట్లో సత్యసంధతతో సంచరిస్తాను. వ్యర్థవిషయాలవైపు మనసుపోనివ్వను. నీ దారిని వదిలిపెట్టినవాళ్ళ చేతల్ని ద్వేషిస్తాను. అవి నన్ను అంటకుండా చూసుకుంటాను.

కుటిల హృదయానికీ నాకూ మధ్య ఎంతో దూరం. చెడు నాకు అపరిచితం.

రహస్యంగా తన పొరుగువాణ్ణి నిందించే వాణ్ణి నాశనం చేస్తాను. అహంకారదృష్టితో చూసేవాళ్ళనీ, పొగరుబోతుల్నీ పక్కనపెట్టేస్తాను.

ఎవరు విశ్వాసాన్ని నమ్ముకుని ఉన్నారో వాళ్లని ఆదరిస్తాను. వాళ్ళని నాతోనే ఉండనిస్తాను. ఎవరూ వేలెత్తిచూపలేని విధంగా ఎవరు నడుచుకుంటారో అతడే నాకు పరిచారకుడు.

మోసకారిజీవితం జీవించేవాడికి నా ఇంట్లో తావులేదు. అబద్ధాలాడటం ఎవరికి చాతకాదో వాళ్ళమీదనే నా కటాక్షం.

ఈ భూమ్మీద చెడ్డవాళ్ళందరినీ దినందినం సంహరిస్తూంటాను. దైవనగరంలో దుష్టకర్మలు చేసేవాళ్ళని తుడిచిపెట్టేస్తాను.

దావీదు గీతం, కీర్తనలు, పాతనిబంధన, 101

ఆశీర్వదించు ప్రభూ!

ఆశీర్వదించు ప్రభూ నా ఆత్మని! ఓ ప్రభూ, నా ప్రభూ, నువ్వు మహోన్నతుడివి, యశస్సునీ, వైభవాన్నీ వస్త్రాలుగా ధరించినవాడివి.

కాంతిప్రకాశాన్ని ఒక పీతాంబరంగా ధరించావు, నువ్వు స్వర్గసీమని ఒక తెరగా పరిచి పెట్టావు.

ఆయన తన సౌధోపరిభాగపు దూలాల్ని నీళ్ళమీద నిలబెట్టాడు, మేఘమండలాన్ని సృష్టించాడు, ఆయన రథం గాలిరెక్కలతో పయనిస్తుంది.

ఆయన తేజస్సుతో దేవదూతల్ని రూపొందిస్తాడు, అగ్నికీలల్తో అనుచరగణానికి ప్రాణం పోస్తాడు.

భూమికి నువ్వెలాంటి పునాదులు వేసావంటే అదెప్పటికీ చెక్కుచెదరకుండా నిశ్చలంగా నిలబడుతుంది.

నువ్వు దాని అధోభాగాన్ని ఒక వస్త్రంతో కప్పి వుంచావు, పర్వతశిఖరాల పైన జలాల్ని ప్రవహింపచేసావు.

నువ్వు మందలించగానే అవి పరుగులుతీసాయి, ఉరుములాంటి నీ కంఠధ్వని వినబడగానే అవి దూరంగా తప్పుకుపోయేయి.

అవి పర్వతాలమీదకి ప్రసరించేయి, లోయల్లోకి ప్రవహించేయి, నువ్వు వాటిని ప్రతిష్ఠించిన స్థానంలో అవి కుదురుకున్నాయి.

అవి మరింత పొంగిపొర్లకుండా, తిరిగి అవి భూమిని ఆక్రమించకుండా నువ్వు వాటికొక హద్దు నిర్ణయించావు.

ఆయన జలపాతాల్ని లోయల్లోకి ప్రసరింపచేసాడు. అవి కొండలమధ్య ప్రవహించేట్టు చేసాడు.

పొలాల్లో ప్రతి ఒక్క పశువుకీ అవి దప్పి తీరుస్తాయి, వన్యమృగాలు అక్కడ తమ దప్పిక తీర్చుకుంటాయి.

వాటివల్ల పక్షులు స్వర్గలోకాన్ని తమ నివాసంగా మార్చుకున్నాయి, ఆ కొమ్మలమీద అవి గానం చేస్తాయి.

ఆయన తన సౌధోపరితలం మీంచి పర్వతాలకు నీళ్ళు పోస్తాడు, నీ మహిమలవల్ల భూమి తృప్తి చెందుతుంది.

గోవులకోసం పచ్చిక మొలిపిస్తాడాయన, పుడమి నుంచి మనిషి అన్నం పుట్టించడం కోసం ఆయన సస్యాల్ని వికసింపచేస్తాడు.

మనిషి మనసును ఉల్లాసపరిచే మధువుని, మనిషి వదనానికి నిగారింపును చేకూర్చే తైలాల్ని, మనిషి హృదయాన్ని బలోపేతం చేసే అనుదిన ఆహారాన్ని అందిస్తాడు.

దేవుడు సృష్టించిన సమస్త వృక్షాల్లో పోషకరసం పొంగిపొర్లుతుంది. లెబనాన్ దేశపు దేవదారు వృక్షాలు ఆయన నాటినవే.

ఆ చెట్లమీదనే పక్షులు గూడుకట్టుకునేది, ఆ పాలచెట్లనే సారసపక్షులు ఆశ్రయించేది.

ఆ ఎత్తైన కొండలు అడవిమేకల ఆటపట్లు, ఆ కొండకొమ్ములు వన్యమృగాలకు ఆశ్రయాలు.

ఋతువులకోసమే ఆయన చంద్రుణ్ణి నియమించాడు, సూర్యుడికి అస్తమించాలన్న జ్ఞానం కలిగించాడు.

నువ్వు అంధకారాన్ని సృష్టించావు, రాత్రికాగానే అడవిజంతువులన్నీ బయటకి అడుగు పెడతాయి.

యువసింహాలు తాము వేటాడబోయే జంతువుల్ని చూసి గర్జిస్తాయి, తమ ఆహారాన్ని అవి భగవంతుడినుంచే స్వీకరిస్తాయి.

సూర్యోదయం కాగానే అవి మళ్ళా ఒకచోట చేరి గుహల్లో విశ్రమిస్తాయి.

మనిషి తన పనుల్లోకి పోయి సాయంకాలందాకా శ్రమిస్తాడు.

ప్రభూ, నీ మహిమలు పరిపరివిధాలు! నీ చేతలన్నీ నీ వివేకసముత్పన్నాలు. పృథ్వి సమస్తం నీ భాండాగారం–

ఈ మహోదధి ఉందే, దీనిలో అసంఖ్యాకంగా పుష్కళంగా పొంగిపొర్లుతున్నవెన్నో. చిన్నవీ, పెద్దవీ ప్రాణులెన్నో.

అదిగో అక్కడే నౌకలు తెరచాపలెత్తి పయనిస్తున్నవి, నువ్వు సృష్టించిన మహామత్స్యం అక్కడే క్రీడిస్తున్నది

ఇవన్నీ నీకోసం ఎదురుచూస్తున్నవి, వాటి వాటి కాలాల్లో వాటికి ఆహారాన్నందించేది నువ్వే అని వాటికి తెలుసు.

నువ్వేది ప్రసాదిస్తే వాటిని అవి పోగుచేసుకుంటాయి, నువ్వు నీ వరదహస్తం చాచగానే వాటికి శుభాలు సంప్రాప్తిస్తాయి.

నువ్వు వాటినుంచి నిన్ను మరుగుపరుచుకుంటావు, అవి అల్లల్లాడిపోతాయి, నువ్వు వాటి ఊపిరి వెనక్కి లాక్కుంటావు, అవి మరణిస్తాయి, దుమ్ములో కలిసిపోతాయి.

నువ్వు గట్టిగా ఊపిరి పీలుస్తావు, అవి ప్రాణంపోసుకుంటాయి, నువ్వు మళ్ళా పుడమి రూపురేఖలు మార్చేస్తావు.

ప్రభు వైభవాతిశయం కలకాలం వర్ధిల్లుగాక! ప్రభువు తన సృజనసంతోషంలో మైమరచు గాక!

ఆయన పృథ్విపై చూపుసారించగానే పుడమి వణికిపోతుంది. ఆయన పర్వతాల్ని స్పృశించ గానే అవి పొగలు కక్కుతాయి.

నేను జీవించినంతకాలం ప్రభువుని స్తుతిస్తూనే ఉంటాను. నా అసిత్వమున్నంతకాలం ప్రభువుని నుతిస్తూనే ఉంటాను.

ఆయన గురించిన నా తలపులు ఆయనకు మధురంగా తోచుగాక! ప్రభువులో నేను పరవశిస్తాను.

పాపులు ఈ పుడమినుంచి తుడిచిపెట్టుకునిపోదురుగాక! దుర్మార్గులకి ఈ భూమిపైన చోటులేకుండుగాక! కీర్తించు ప్రభువుని, ఓ నా మనసా, సంతోషంగా స్తుతించు ప్రభువుని.

దావీదు గీతం, కీర్తనలు, పాతనిబంధన, 104

ప్రభువు నీ కుడిపక్కనున్నాడు

ప్రభువు నా ప్రభువుతో చెప్తున్నాడు: నీ శత్రువులందర్నీ నీకు పాదాక్రాంతం చేసేదాకా నువ్వు నా కుడిపక్కనకూచో.

నీ రాజదండాన్ని పంపించాడు ప్రభువు తన దేవాలయం నుంచి. శత్రుమధ్యంలోనే పాలనసాగించు.

దివ్యవస్త్రధారివైన నీ బలోత్సేకానికి నీ ప్రజలు తమంతతామే తలొగ్గుతారు. ప్రభాతగర్భం నుండి విడివడిన హిమశోభిత యవ్వనం నీదవుతుంది.

ప్రభువు ఒకసారి వాగ్దానం చేసాక వెనుతిరగడు. నీ పురాతన వంశంలో నువ్వు సదా దైవసేవకుడిగా జీవిస్తావు.

ప్రభువు నీ కుడిపక్కనున్నాడు. ఆయన కోపోద్రిక్తుడైన రోజు రాజులంతా మట్టిగొట్టుకు పోతారు.

జాతులమీద తన శాసనం ప్రకటించినప్పుడు అవి మరుభూమిగా మారి పోతాయి. నాయకశ్రేణుల్ని దుమ్ములో కలిపేస్తాడు.

తన ప్రయాణమధ్యంలో ఆగి ప్రవాహజలాలు కడుపారా తాగి ఒకసారి తలపైకెత్తి చూస్తాడు.

దావీదు గీతం, కీర్తనలు, పాతనిబంధన, 110

సత్యవంతుడు చెక్కుచెదరడు

ప్రభువుని స్తుతించండి. భగవంతుడికి భయపడేవాడు ధన్యుడు. ఆయన ఆజ్ఞల్ని హృదయానికి హత్తుకునేవాడు ధన్యుడు.

అతడి సంతతి చిరకాలం వర్ధిల్లుతారు. నీతిమంతుడైన వాడు నిజంగా ధన్యుడు.

అతడి గృహం సుసంపన్నం, ఐశ్వర్య మయం, అతడి సత్యసంధత శాశ్వతం. నీతిమతుడి కోసం చీకట్లో వెలుగు ఉదయిస్తుంది. అతడు కృపా మయుడు, దయామయుడు, ధర్మపరుడు.

తోటిమనుషుల్తో ఉదారంగా ఇచ్చిపుచ్చుకునే వాడికి తన పనులు నిజాయితీతో చేసుకునే వాడికి అంతా శుభమే.

సత్యవంతుడు చెక్కుచెదరడు. అతడు సదా స్మరణీయుడు.

ఏ చెడ్డవార్తా అతణ్ణి భయపెట్టలేదు. దేవుడిలో విశ్వాసం అతణ్ణి దృఢంగా ఉంచుతుంది.

తన శత్రువుల మీద విజయం సాధించేదాకా అతడు చలించడు, భయపడడు.

తనకున్నదంతా ఉదారంగా బీదసాదలకు పంచిపెడతాడు. అతడి నీతివర్తన తిరుగులేనిది. అతడి విజయవాద్యం అడ్డులేనిది.

దుర్మార్గుడు అది చూస్తాడు, పళ్ళు కొరుక్కుంటాడు. కోపగిస్తాడు, కనబడకుండా జారి పోతాడు. దుర్జనుల సంకల్పాలు ధ్వంసమై పోవుగాక!

కీర్తనలు, పాతనిబంధన, 112

ఎలుగెత్తి స్తుతించండి

స్తుతించండి ప్రభువుని! ఓ ప్రభు సేవకులారా, ఎలుగెత్తి స్తుతించండి భగవన్నామ సంకీర్తన చెయ్యండి.

నేటినుంచి మరెన్నటికీ ప్రభునామం విరాజిల్లుగాక.

ఉదయాద్రినుండి అస్తాద్రిదాకా ప్రభునామం ప్రకాశించుగాక!

ప్రభువు రాజ్యాలన్నిటికన్నా ఉన్నతుడు. గగనమండలమంతా ఆయన వైభవమే.

సర్వోన్నత స్థానంలో ఆసీనుడైన మన ప్రభువులాంటి దైవం మరెవరు?

ఆ ద్యులోక తేజస్సుముందు, ఆ పార్థివ వైభవం ముందు సాష్టాంగపడగలిగేదెవ్వరు?

ఆయన దుమ్ములోంచి బీదల్ని ఉద్ధరించగలడు. భస్మరాశుల్లోంచి ఆర్తుల్ని పైకి లేపగలడు.

తన ప్రజానీకపు రాకుమారులసరసన వారిని కూర్చుండబెట్టగలడు.

పిల్లల్లేని స్త్రీకి ఆయన ఆశ్రయం చూపగలడు. ఆమె చుట్టూ పసిపిల్లల కేరింతలు నింపగలడు. స్తుతించండి ప్రభువుని!

కీర్తనలు, పాతనిబంధన, 113

సముద్రం పారిపోయింది

పరాయి భాష మాట్లాడే ప్రజలనుంచి, ఈజిప్టు నుంచి నా దేశం విడుదలయినప్పుడు:

ఒక ప్రాంతం ఆయనకు ఆశ్రయంగా అమిరింది. మరొక ప్రాంతం రాజ్యంగా విలసిల్లింది.

సముద్రం ఆ దృశ్యాన్ని చూసి పారిపోయింది. యోర్దాను నది వెనకడుగు వేసింది.

పర్వతాలు పొట్టేళ్ళలాగా తుళ్ళిపడ్డాయి. కొండలు గొర్రెపిల్లల్లాగా గెంతులేసాయి.

ఏమైంది, మహాసాగరమా, ఎందుకు పారిపోయావు? యోర్దాను ప్రవాహమా? ఎందుకు వెనుదిరిగావు?

పర్వతాల్లారా, పొట్టేళ్లలాగా ఎందుకు తుళ్ళిపడ్డారు కొండల్లారా, గొర్రెపిల్లల్లాగా ఎందుకు గెంతులేసారు?

నా దేశాన్ని కాపాడే నా దైవసన్నిధిలో నా ప్రభు సమక్షంలో, భూమండలమా, కంపించు.

ఆయన గండశిలల్ని సరోవరాలుగా మార్చగలడు. చెకుముకిరాళ్ళతో సెలయేళ్ళు పుట్టించగలడు.

కీర్తనలు, పాతనిబంధన, 114

ప్రభు మహిమ ఉగ్గడించండి

సమస్త జనులారా, ప్రభువుని స్తుతించండి. సకలలోకప్రజలారా, ప్రభుమహిమ ఉగ్గడించండి.

మనపట్ల ఆయన అనుగ్రహం చెక్కుచెదరనిది. మనపట్ల ఆయన నమ్మకం ఎన్నటికీ తరగనిది. స్తుతించండి ప్రభువుని నోరారా!

కీర్తనలు, పాతనిబంధన, 117

శాంతి కోరుకుంటున్నాను

నా దీనావస్థలో ప్రభువుకు మొరపెట్టుకున్నాను. ఆయన నా పిలుపుకు బదులిచ్చాడు

ప్రభూ, బయటపడెయ్యి నన్ను. అబద్ధాలాడే పెదాలనుంచీ, మోసకారి నోటినుంచి.

ఓ జిత్తులమారి నాలుకా! నీకేమి కావాలి? ఎంతిస్తే సరిపోతుంది?

విలుకాడి పదునైన బాణపు ములుకులు మండుతున్న చింతనిప్పులు.

ఎంత కష్టం నాకు, ప్రవాసిగా బతకవలసి వచ్చింది. పరాయి వాళ్ళ మధ్య గుడారం పాతుకోవలసి వచ్చింది.

శాంతిని ద్వేషించే మనుషుల మధ్య చిరకాలమే నివసించవలసి వచ్చింది.

నేనేమో శాంతి కోరుకుంటున్నాను. కాని నోరు తెరిచానా, వాళ్ళు కయ్యానికి కాలు దువ్వుతున్నారు.

యాత్రాకీర్తన, పాతనిబంధన, 120

ప్రభుహస్తం నాకు ఆసరా

తేరిపారచూస్తాను. ఎక్కవలసిన కొండలెన్నో! ఎవరు నాకు చేయందిస్తారు?

ప్రభుహస్తం నాకు ఆసరా. భూదిగంతాల్ని సృజించిన వాడాయన.

అతడు నీ అడుగులు తడబడనివ్వడు. నిన్ను కునికిపాట్లు పడనివ్వడు.

చూడు, నా దేశాన్ని కాచిరక్షించుకుంటున్న ప్రభువుకి కునుకులేదు, నిద్రలేదు.

ప్రభువు నీ కాపరి. నీ కుడిపక్కన పరుచుకున్న నీడ, నీకు ఆశ్రయం.

నిన్ను పగలు ఎండ బాధించదు. రాత్రి వెన్నెల గాయపర్చదు.

ప్రభువు నిన్ను చెడుకు దూరంగా ఉంచుతాడు. నీ బతుకు నిలబెడతాడు.

నీ రాకపోకల్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు, ఇప్పటికీ, ఎప్పటికీ.

యాత్రాకీర్తన, పాతనిబంధన, 121

నా దేశానికి దక్కిన కానుక

దేవాలయానికి రమ్మని వాళ్ళు పిలిచినప్పుడు నాకెంతో సంతోషం అనిపించింది.

ఓ దైవనగరమా, నీ ద్వారాలదగ్గరకు చేరుకున్నాయి మా చరణాలు.

ఒక నగరంలాగా నిర్మించబడ్డ యెరుషలేము గట్టి కూడిక.

భగవంతుడి మనుషులు, సకలజనులు చేరుకునే చోటు అది. ప్రభు నామానికి కృతజ్ఞతగా
నా దేశానికి దక్కిన కానుక అది.

అక్కడ రాజసింహాసనం నెలకొల్పారు దావీదు వంశ సింహాసనం.

దైవనగరక్షేమం కోసం ప్రార్థించండి. నిన్ను ప్రేమించేవాళ్ళకి అభ్యుదయం కలుగుగాక !

నీ ప్రాకారాల మధ్య శాంతి నెలకొనుగాక ! నీ హర్మ్యాలలో క్షేమం సుస్థిరం అగుగాక!

నా అన్నదమ్ములకోసం, బంధుమిత్రులకోసం నీ క్షేమం కోరుతూ ప్రార్థిస్తున్నాను.

మన ప్రభు దేవాలయం కోసం సర్వదా నీకు శుభం కోరుకుంటాను.

యాత్రాకీర్తన, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 122

మాపై దయచూపు

స్వర్గసీమలో సింహాసనాధీశుడవైన నిన్ను కనులారా దర్శిస్తాను.

సేవకులు తమ యజమాని హస్తం కోసం వెతుక్కున్నట్టు దాసీజనం తమ యజమానురాలి అభయం కోసం వెతుక్కున్నట్టు మన నేత్రాలు మన ప్రభువు, మన దైవం కృపావీక్షణానికై పరితపిస్తున్నాయి.

ఇప్పటిదాకా భరించింది ఇంక చాలు, మాపై కృపచూపు, తండ్రీ, మాపై దయచూపు.

మా శక్తికి మించి అవమానాలు సహించాం. గర్విష్ఠుల తృణీకారం రుచిచూసాం. సుఖంగా జీవితం వెళ్ళబుచ్చుతున్నవాళ్ల ఈసడింపులు చవిచూసాం.

యాత్రాకీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 123

నా దేశాన్ని బిగ్గరగా చెప్పమను

నా దేశాన్ని బిగ్గరగా చెప్పమను. ప్రభువు మనవైపు లేకపోయుంటే–

ప్రభువు మన తోడుగా లేకపోయుంటే శత్రువులు మనమీద విరుచుకుపడ్డప్పుడు

వాళ్ళు మనల్ని ప్రాణాల్తో దిగమింగేసేవారు. మనమీద వాళ్ళు ఆగ్రహంతో దండెత్తినప్పుడు

వరదలు మనల్ని ముంచెత్తి ఉండేవి. తుపాన్లు మనల్ని తుడిచిపెట్టేసి ఉండేవి.

కోపంతో పరవళ్ళు తొక్కే జలాల్లో మనం కొట్టుకు పోయి ఉండే వాళ్ళం.

వాటి కోరలకు చిక్కకుండా మనల్ని కాపాడిన ప్రభువు నిజంగా స్తుతి పాత్రుడు.

వేటగాళ్ళ ఉచ్చునుంచి పక్షిలాగా బయటపడ్డాం. ఉచ్చు తెగిపోయింది. మనం తప్పించుకున్నాం.

భూదిగంతాల్ని సృష్టించిన ప్రభు నామం లోనే మన రక్షణ ఇమిడి ఉంది.

యాత్రాకీర్తన, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 124

ప్రభువును నమ్మినవాళ్ళు

ప్రభువును నమ్మినవాళ్ళు పర్వతంలాంటి వాళ్ళు. వాళ్లనెవరూ కదల్చలేరు. వారి నమ్మిక సుస్థిరం, శాశ్వతం.

దైవనగరం చుట్టూ కొండలు పరుచుకున్నట్టు ప్రభువు తన జనుల చుట్టూ పరివేష్టించాడు. ఇప్పటికీ, ఎప్పటికీ.

నీతిమంతుల వాగ్దత్త వసుంధర మీద దుర్జనుల రాజదండం నిలవ జాలదు. చెడుపనులు చెయ్యడానికి సత్యవంతులు చేతులు చాపకూడదని ప్రభువు తలపు.

ఎవరు మంచివారో వారికి మంచి చెయ్యి, ప్రభూ, ఎవరు హృదయాల్లో సత్యవర్తనులో వారిని కరుణించు.

కుటిలమైన దారులవైపు చూసేవాళ్ళకి కూడా దుష్టుల్తో పాటే దండన పడుతుంది. నా దేశానికి శాంతిలభిస్తుంది.

యాత్రాకీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 125

కన్నీళ్ళు నారుగా

దేవుడు తన నగరాన్ని విడిపించినప్పుడు మనకి అదంతా ఒక కలలాగా తోచింది.

అప్పుడు మన పెదాలమీద చిరునవ్వులు పూసాయి. మన గళాలు కేరింతలు కొట్టాయి.
ఆ దృశ్యం చూసి తక్కినరాజ్యాలు ప్రభువు వాళ్ళకి తన మహిమ చూపించాడని చెప్పుకున్నాయి.

ప్రభువు మనకోసం నిజంగా అద్భుతాలు చేసాడు. మనం సంతోషంతో పొంగిపోయాం.

దక్షిణ నదీ ప్రవాహ జలాల్లాగా మమ్మల్ని మళ్ళీ చెరనుంచి తప్పించు.

అశ్రువుల్ని విత్తనాలుగా జల్లుకున్నవాళ్ళకి ఆనందాన్ని పంటగా అనుగ్రహించు

కన్నీళ్ళు నారుగా నాట్లు నాటేవాళ్ళు సంతోషం గంపలకి ఎత్తుకుని తిరిగిరానివ్వు.

యాత్రాకీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 126

ప్రభువు ఎవరిని ప్రేమిస్తాడో

ఆ ఇల్లు దేవుడు కట్టకపోతే రాళ్ళెత్తిన కూలీలది వృథాశ్రమ. ప్రభువు నగరాన్ని కాచి చూసుకోకపోతే కావలివారు రాత్రంతా మేలుకుని వృథా.

నువ్వు పొద్దున్నే లేచిపరిగెత్తడం, రాత్రి ఆలస్యంగా పక్కమీదకు చేరడం నీ శ్రమ, నీ ఆరాటం సమస్తం వృథా– ప్రభువు ఎవరిని ప్రేమిస్తాడో వాళ్ళకి మాత్రమే విశ్రాంతిని కానుకచేస్తాడు.

తెలుసుకో, పిల్లలు ప్రభువు ప్రసాదించే వారసత్వం. వాళ్ళని నవమాసాలు మోసినందుకు బహుమానం.

వీరుడైన విలుకాడి చేతిలో శరాల్లాంటివాళ్ళు నీ యవ్వనకాలంలో నీకు పుట్టిన సంతతి.

అట్లాంటి పిల్లల్తో అమ్ములపొది నింపుకున్నవాడు ధన్యుడు. గుమ్మం దగ్గర విరోధుల్తో వాదించేటప్పుడు అతడికి అవమానపడే అగత్యం కలగదు.

యాత్రాకీర్తన, సొలోమోను కృతి, కీర్తనలు, పాతనిబంధన, 127

ప్రభువుకు భయపడే ప్రతి ఒక్కడూ

పభువుకు భయపడే ప్రతి ఒక్కడూ, ఆయన దారిన నడిచే ప్రతి ఒక్కడూ ధన్యుడు.

నీ రెక్కలకష్టానికి తగిన ఫలితం దొరుకుతుంది. నువ్వు ధన్యుడివి, నీ శ్రమఫలితం నీతోనే ఉంటుంది.

చక్కగా ఫలించిన ద్రాక్షతీగలాగా నీ భార్య నీ ఇంటిని అల్లుకుంటుంది. ఆలివు వృక్షం చిగురించినట్టుగా నీ పిల్లలు నీ భోజనాల బల్ల చుట్టూ కూడుకుంటారు.

భగవంతుడికి భయపడే మనిషి భాగ్యం అలా ఉంటుంది, తెలుసుకో.

తన నగరం లోంచి దేవుడు నిన్ను ఆశీర్వదిస్తున్నాడు. నువ్వు బతికినన్ని రోజులు దైవనగర దినదినాభివృద్ధి కళ్ళారా చూస్తావు.

నీకు పుత్రపౌత్రాభివృద్ధి లభిస్తుంది! నా దేశానికి జయం కలుగుతుంది!

యాత్రాకీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 128

నెత్తిన పోసిన పరిమళతైలం

అన్నదమ్ములు కలిసిమెలిసి బతకడంలో ఎంత సుఖమో తెలుసుకో!

అది నెత్తిన పోసిన పరిమళతైలం లాంటిది. ముఖం మీంచి, గడ్డం మీంచి, ఋషీశ్వరుడి గడ్డం మీంచి అతడి అంగీ కొంగు వరకూ కారుతుంటుంది.

అది హెర్మోను పర్వతమ్మీద కురిసిన మంచులాగా బీడునేల మీదకి ప్రవహిస్తుంది. భగవంతుడి ఆశీర్వాదంలాగా తరుగులేని జీవం అది.

యాత్రాకీర్తన, దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 133

ప్రభు నివాసప్రాంగణంలో

పభు నివాసప్రాంగణంలో రాత్రంతా మేలుకున్న ప్రభుసేవకులారా! రండి, ప్రభువుని స్తుతించండి.

పవిత్రస్థలాన్ని నుతిస్తూ చేతులు చాపండి. ప్రభువుని స్తుతించండి.

భూమ్యాకాశాల్ని సృజించిన భగవంతుడు తన నగరం నుంచి మిమ్మల్ని తప్పక దీవిస్తాడు!

యాత్రాకీర్తన, కీర్తనలు, పాతనిబంధన, 134

బేబిలోను జలాల దగ్గర

బేబిలోను జలాల దగ్గర మన నగరాన్ని తలచుకుంటూ తలవాల్చుకు కూచున్నాం, విలపించాం.

అక్కడ నిరవంజి చెట్లకొమ్మలకు మన తంత్రీవాద్యాలు వేలాడదీసాం.

మనల్ని చెరబట్టిన వాళ్ళు అక్కడ తమకోసం మమ్మల్ని పాటలు పాడమన్నారు. మనల్ని హింసిస్తున్నవాళ్ళు తమ వినోదానికి మన దేశం గురించి ఒక పాట పాడమన్నారు.

మనదికాని పరాయి నేలమీద ప్రభుగీతాన్నెట్లా పాడగలం?

నిన్ను నేను మర్చిపోతే నా కుడిచెయ్యి తెలివి తప్పినట్టు.

నా ఆనందాలన్నిటికన్నా పైన నా నగరం ఉందని గుర్తుచేసుకోకపోతే ఓ దైవనగరమా! నిన్ను నేను గుర్తుపెట్టుకోకపోతే నా నాలుక అంగిట్లో అతుక్కుపోయినట్టు.

ప్రభూ, నా నగరం మీద శత్రువులు దండెత్తిన ఆ రోజు, గుర్తుందా, దాన్ని కూల్చెయ్యండి, కూల్చెయ్యండి పునాదుల్తోటీ పెకలించండి అని అరిచారు వాళ్ళు.

ఓ బేబిలోను కుమారీ, నీకు వినాశనం తప్పదు. వాళ్ళు మమ్మల్ని పెట్టిన కష్టానికి నీకు బదులిచ్చిన వాడు నిజంగా ధన్యుడు.

నీ బిడ్డల్ని తన చేతుల్లోకి తీసుకుని రాళ్ళకేసి బాదినవాడు ధన్యుడు.

కీర్తనలు, పాతనిబంధన, 137

నా ఆత్మబలం ఇనుమడించింది

పభూ, నీకు హృదయపూర్వక ధన్యవాదాలు. దేవతలముందు నీ గురించి గానం చేస్తాను.

నీ పవిత్రాలయం ముందు శిరసు వంచి మొక్కుతాను. నీ ప్రేమానుగ్రహాలకు కృతజ్ఞగా నీ సంకీర్తన చేస్తాను. అన్నిటికన్నా మిన్నగా నువ్వు నీ పేరు నిలబెట్టుకున్నావు. నువ్విచ్చిన మాట నిలబెట్టుకున్నావు.

నేను నిన్ను పిలిచినప్పుడు నాకు బదులిచ్చావు. అప్పణ్ణుంచీ నా ఆత్మబలం ఇనుమడించింది.

ప్రపంచరాజ్యాధినేతలంతా నీకు ధన్యవాదాలు పలుకుతారు. వాళ్ళకి కూడా నీ మాటలు వినబడ్డాయి.

ప్రభు మహిమల్ని వారు ఘనంగా కీర్తిస్తారు ప్రభుమహిమాతిశయం అటువంటిది.

ఆయన సర్వోన్నతుడు, దీనుల్ని అక్కున చేర్చుకుంటాడు. గర్విష్టుల్ని దూరం పెడతాడు.

నేను కడగండ్ల మధ్య నడుస్తున్నా నువ్వు నా బతుకుని కాచిరక్షించేవు. నా శత్రువుల క్రోధానికి నీ అరచెయ్యి అడ్డుపెట్టావు. నీ కుడిచేత్తో నన్ను పక్కకు తప్పించావు.

ప్రభువు నా మీద పెట్టుకున్న ఆకాంక్షలు నిజమవుతాయి. అచంచలమైన నీ ప్రేమ, ప్రభూ, కలకాలం నిలుస్తుంది. నీ చేతుల్తో సృజించిన వాటిని ఎప్పటికీ అనాథలుగా వదిలిపెట్టకు.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 138

నా చూపులెప్పుడూ నీ వైపే

ప్రభూ, మొరపెట్టుకుంటున్నాను, త్వరగా రా! నిన్ను పిలిచినప్పుడు నా మొరాలకించు.

నా ప్రార్థన నీ సన్నిధిలో ఒక అగరుధూపంగా వెలగనివ్వు. నేను చేతులు పైకెత్తితే అదే ఒక నైవేద్యంగా భావించు.

ఓ ప్రభువా, నా నోటికి బీగం బిగించు. నా పెదాల దగ్గర ఒక కావలి వాణ్ణి నియమించు.

నా మనసు చెడుతోవలవైపు మొగ్గకుండు గాక! క్రూరుల్తో, దుర్జనుల్తో చెలిమికోసం నేను చెడు నడతలో మునిగిపోకుందునుగాక! వారి పిండివంటల్ని రుచిచూడ కుందును గాక!

సత్యవంతుడు నన్ను దండించాడా– అది దయామయ చర్య. అతడు నన్ను మందలించనీ– అది నా నెత్తిన పరిమళ ద్రవ్యం. నా శిరసువంచి మరీ వాటిని స్వాగతిస్తాను. నా ప్రార్థనలెప్పుడూ చెడుపనులు చేసేవాళ్ళని ధిక్కరిస్తాయి.

కొండకొమ్ము మీంచి వాళ్ళ న్యాయాధీశుల్ని కిందకు తోసేసినప్పుడు అప్పుడు వాళ్ళు నా మాటలు వింటారు, అవి ఆహ్లాదకారకాలు.

నాగళ్ళతో నేలదున్ని చాళ్ళు తీసినట్టుగా మా ఎముకలు మృత్యుద్వారం దగ్గర చెల్లా చెదురవుతాయి.. కాని నా చూపులెప్పుడూ నీ వైపే,

ఓ దైవమా, నా ప్రభూ! నిన్నే శరణు వేడుతున్నాను, నా ప్రాణం తోడెయ్యకు.

వాళ్ళు నా కోసం పన్నిన ఉచ్చునుంచి, పన్నాగాలనుంచి నన్ను తప్పించు.

దుర్మార్గులు తాము తవ్వుకున్న గోతిలో తామే పడాలి. నేను సురక్షితంగా ముందుకుపోవాలి.

దావీదు కృతి, కీర్తనలు, పాతనిబంధన, 141

నాకు దక్కిన వాటా నువ్వు

ఎలుగెత్తి మరీ ప్రభువుని పిలుస్తున్నాను. గొంతెత్తి మరీ ఆయనని బతిమాలుకుంటున్నాను.

నా విన్నపాలు విప్పి పరుచు కుంటాను. కడగండ్లు ఏకరువు పెట్టుకుంటాను.

నా ప్రాణం డస్సిపోయినప్పుడు నా దారి నీకు తెలుసు. నేను నడుస్తున్న దారిలో వాళ్ళో ఉచ్చు పన్నారు.

పక్కకు తిరిగి చూడు. నన్ను పట్టించుకునే వాళ్లెవరూ కనిపించరు. తలదాచుకో డానికి తావులేదు. నాకోసం పరితపించేవాళ్లూ లేరు.

ఓ ప్రభూ, నీకే మొరపెట్టుకుంటున్నాను. నువ్వే నా దిక్కు. సజీవమానవ ప్రపంచంలో నాకు దక్కిన వాటా నువ్వు.

నా మొరాలకించు. నన్ను హింసిస్తున్నవాళ్ళ నుంచి విడిపించు. వాళ్ళు నా కన్నా బలవంతులు.

నన్ను చెరసాలనుంచి బయటపడెయ్యి. అప్పుడు నీముందు కీర్తన పాడగలుగుతాను. నీ అనుగ్రహం అపారంగా వర్షించినప్పుడు నా చుట్టూ నీతిమంతులు గుమికూడతారు.

గుహలో దాక్కున్నప్పుడు దావీదు ప్రార్థన, కీర్తనలు, పాతనిబంధన, 142

ప్రభుస్తోత్రం ఎంత శుభకరం!

స్తుతించండి ప్రభువుని!

ప్రభుస్తోత్రం ఎంత శుభకరం! ఆయన్ని స్తుతించడం ఎంత సంతోషప్రదం!

దైవనగరాన్ని నిర్మించాడు, ప్రవాసితులందరినీ తిరిగి ఒక్కచోటకు చేరుస్తున్నాడు.

భగ్నహృదయులకి స్వస్థతచేకూరుస్తున్నాడు, క్షతగాత్రుల గాయాలకు కట్లు కడుతున్నాడు.

ఆకాశంలో చుక్కలెన్నున్నాయో లెక్కపెడుతున్నాడు, ప్రతి ఒక్క తారకనీ పేరుపేరునా పిలుస్తున్నాడు.

మహనీయుడు మన ప్రభువు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు.

వినయవంతుల్ని నిలబెడతాడు, కుటిలాత్ముల్ని మట్టిగరిపిస్తాడు.

ఉచ్ఛైస్వరంతో ప్రభుమహిమలు కీర్తించండి. తంబురలపైన సంగీతాన్ని సృష్టించండి.

ఆయన మేఘాలతో గగనాన్ని అలంకరిస్తాడు, పుడమిని వర్షధారలతో కరుణిస్తాడు, కొండలమీద సస్యాల్ని పెంచిపోషిస్తాడు.

పశుగణాలకు మేతసమకూరుస్తాడు. ప్రతి ఒక్క పక్షిపిలుపుకూ బదులిస్తాడు.

బలమైన గుర్రాన్ని చూసి ఆయనకు సంతోషం కాదు, లేదా యోధుడి బాహుబలంలో ఆయనకు ఆనందం లేదు.

తనని చూసి ఎవరు భయపడతారో వాళ్ళని చూసినప్పుడే ఆయనకు అభిమానం, తన ప్రేమలో ఎవరు అచంచలమైన నమ్మకం పెట్టుకుంటారో వాళ్లని చూస్తేనే ఆయనకు సంతోషం.

యెరుషలేమా! ఉగ్గడించు ప్రభుమహిమని! సీయోను పర్వతమా, ఎలుగెత్తి కీర్తించు ప్రభు మహిమని!

ఆయన నీ నగరకుడ్యాలకు రక్షణ, వాటిమధ్య నివసిస్తున్నీ నగరవాసులకు ఆయనదే అభయం.

నీ సరిహద్దుల్లో ఆయన శాంతిని స్థాపిస్తాడు. ఆయన అనుగ్రహంవల్లనే నీ పొలాల్లో మేలిమి గోధుమ పండుతుంది.

భూమిని ఆయన ఆదేశిస్తాడు, ఆయన వాక్కుది విద్యుద్వేగం.

తొలిమంచుని ఆయన ఉన్నిలాగా పరుస్తాడు, పొగమంచుని భస్మంలాగా వెదజల్లుతాడు.

వడగళ్ళను గులకరాళ్లలాగా కురిపిస్తాడు, ఆయన హిమపాతానికి ఎదురు నిలబడగల వాళ్ళెవ్వరు?

ఆయన తన మాటల్ని ప్రసరింపచేసి, కరిగించివేస్తాడు.

మరుద్గణాల్ని సంచలింపచేసి జలాల్ని ప్రవహింపచేస్తాడు.

ఆయన తన అంతరంగం నా దేశానికి తెలియచేసాడు, తన శాసనాన్ని, తన ఆదేశాల్ని నా జనులకి ఎరుకపరిచాడు.

ఆయన మరే జాతికీ ఈ మహిమ ప్రకటించలేదు, ఈ అనుశాసనం గురించి మరెవరికీ తెలియనే తెలియదు.

కీర్తనలు, పాతనిబంధన, 148

స్తుతించండి ప్రభువుని

స్తుతించండి ప్రభువుని, స్వర్గం నుంచి స్తుతించండి, శిఖరాల మీంచి స్తుతించండి.

స్తుతించండి ఆయన్ని, ఆయన సమస్త దేవదూతల్ని, స్తుతించండి ఆయన్నీ, ఆయన పరివారమంతటినీ.

స్తుతించండి ఆయన్ని, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, స్తుతించండి ఆయన్నీ, ప్రకాశభరితమైన తారకలన్నింటినీ.

స్తుతించండి ఆయన్ని, స్వర్గసీమకే స్వర్గమైన మిమ్మల్ని, స్వర్గాలకు పైన ప్రవహిస్తున్న జలాల్ని,

అవన్నీ ప్రభునామాన్ని స్తుతించునుగాక! ఎందుకంటే ఆయన శాసనం వల్లనే అవి సృష్టించబడ్డాయి.

ఆయన వాటిని శాశ్వతంగా ప్రతిష్టించాడు, ఎన్నటికీ వీగిపోని శాసనాన్ని ప్రవర్తింపచేసాడు ఆయన.

భూమ్మీంచి ఆయన్ని స్తుతించండి, ఓ మహాసముద్రప్రాణులారా, అగాధమైన లోతుల్లోంచి ఆయన్ని స్తుతించండి.

అగ్ని, వడగళ్ళు, మంచు, మేఘాలు, ప్రచండ ఝంఝామారుతాలు ఆయన వాక్కుని పరిపూర్ణమొనరుస్తున్నాయి.

పర్వతాలు, అన్ని కొండలూ, ఫలభరితాలైన వృక్షాలు, దేవదారు తరువులు

వన్యమృగాలు, పశుగణాలు, నేలమీద పాకేవి, ఎగిరే పక్షులు

భూమ్మీది రాజులు, సమస్త జనులు, రాకుమారులు, పృథ్విని పాలించే న్యాయాధీశులు, యువతీయువకులూ, వృద్ధులూ, పసిపాపలూ

వారంతా ప్రభు నామం స్తుతించెదరు గాక! ఆ నామమొక్కటే సర్వోన్నతం, ఆయన వైభవం భూదిగంతాలను మించినది.

తన ప్రజానీకపు తూర్యరావాన్ని , సమస్త సాధుజనుల స్తుతిని, ఇస్రాయేలు బిడ్డల ప్రార్థనల్ని, తన సమీపవర్తులైన జనుల స్తోత్రాల్ని ఆయన శోభిల్లపరిచాడు! స్తుతించండి ప్రభువుని!

కీర్తనలు, పాతనిబంధన, 148

పాడండి జయగీతం

పాడండి జయగీతం ప్రభువుకి. ప్రభువుకోసం సరికొత్త గీతం పాడండి. భగవద్భక్తుల మధ్య ఆయన్ను ఎలుగెత్తి స్తుతించండి.

నా దేశం తన సృష్టికర్తని తలుచుకుని సంతోషమొందును గాక! దైవనగరజనులు తమ రాజాధిరాజు తలపుల్లో తేలియాడుదురు గాక!

నాట్యమాడుతూ ఆయన్ని తలచుకుందురు గాక. తంబుర సితార నాదాలతో కీర్తించుదురు గాక!

తన ప్రజలని చూసి ప్రభువు పరవశిస్తాడు. దీనజనుల్ని తన రక్షణతో అలంకరిస్తాడు.

సజ్జనులంతా ఉప్పొంగిపోతారు. వాళ్ళింకా తమ శయ్యల మీంచి లేవకముందే పాటలు అందుకుంటారు.

తమ చేతుల్లో రెండంచులా పదునైన కరవాలాల్తో వారి గళాల్లో భగవంతుడి స్తుతి మార్మ్రోగుగాక.

తమని బాధించిన వారిమీద ప్రతీకారానికి, తమని హింసించినవారిని శిక్షించడానికి,

తమ రాజుల్ని సంకెళ్ళతో బంధించడానికి, రాజబంధువుల్ని ఇనుపగొలుసుల్తో కట్టిపడెయ్యడానికి,

వాళ్ళకి విధించబడ్డ తీర్పుల్ని అమలు చెయ్యడానికి. దేవుణ్ణి నమ్మిన ప్రతి ఒక్కరికీ మనం ఇవ్వగల గౌరవమిది. పాడండి జయగీతాలు ప్రభువుకి.

కీర్తనలు, పాతనిబంధన, 149

ఆలపించండి జయగీతం

ఆలపించండి జయగీతం ప్రభువుకి. తన రక్షణాలయంలో కొలువైన ప్రభువును స్తుతించండి. మహోన్నత గగనసీమలో నెలకొన్న ప్రభువుని స్తుతించండి.

ఆయన మహామహిమలకు స్తుతించండి. ఆయన మహోదార్యాన్ని, మహోత్కృష్టతను స్తుతించండి.

దుందుభినాదాలతో స్తుతించండి. వీణావేణు వాద్యాలతో స్తుతించండి.

తంబురతో, నాట్యంతో స్తుతించండి. తంత్రీవాద్యాలతో, నగారాలతో స్తుతించండి.

తప్పెట్లతో, తాళాలతో స్తుతించండి. ఘనరాగపంచకంతో స్తుతించండి.

ఊపిరితీస్తున్న ప్రతి జీవీ, ప్రతి ఒక్కరూ ప్రభువుని స్తుతించండి.

కీర్తనలు, పాతనిబంధన, 150

దావీదు

ఈశ్వర స్తుతిగీతాలు

వాడ్రేవు చినవీరభద్రుడు

బైబిలులో, పాతనిబంధనలో కీర్తనలు యుగయుగాలుగా యూదు, క్రైస్తవ భక్తుల్నే కాక, ప్రపంచమంతటా ఈశ్వరభక్తుల్ని ఉత్తేజితుల్ని చేస్తూనే ఉన్నాయి. పురాతన ఈజిప్షియన్, మెసొపొటేమియన్ ప్రార్థనాగీతాల, కాననైట్ వ్యావసాయిక ఉత్సవాల ప్రార్థనలనమూనాలో దాదాపు వెయ్యేళ్ళ పాటు యూదులు కూర్చుకున్న ఈ గీతాల్లో మానవుడి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఎంతో సజీవంగా, ఎంతో బలంగా వినిపిస్తాయి. ఈ గీతాలు మొదట్లో విలాపగీతాలుగా తలెత్తి నెమ్మదిగా ఈశ్వర స్తుతి గీతాలుగా, విజయగీతాలుగా, మంగళగీతాలుగా పరిణతి చెందాయి. దావీదు రాసాడని చెప్పే ఈ కీర్తనలు ఆయన తదనంతరం ఏసుక్రీస్తు ఆగమనాన్ని సూచించేవిగా కూడా ఉండటంతో ఇవి ఏకకాలంలో ఆక్రోశగీతాలూ, ఆగమగీతాలూ కూడా. నూటయాభై కీర్తనల్లో అరవై నాలుగు కీర్తనల్ని అనువదించడమే కాక, వాడ్రేవు చినవీరభద్రుడు, ఈ గీతాల చరిత్రనూ, ప్రాశస్త్యాన్నీ వివరిస్తూ రాసిన సుదీర్ఘమైన పరిచయ వ్యాసం ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ.